## పరమసంత్ పరమదయాల్ సత్‌గురు
## పండిత్ ఫకీర్‌చంద్ జీ మహరాజ్

# జీవన చరితం

(మొదటి భాగం)

(హిందీ మూలం:- దయాల్ ఫకీర్ కీ జీవనీ -
'శివ్' జనవరి, ఫిబ్రవరి 1974 సంచిక)


రచన
**సేర్ దుర్గాదాస్**

అనువాదం & సమర్పణ
**ఆచార్య డా॥ జ్యోతిరాణి**

ప్రోత్సాహకులు
**దయాల్ ఆనందరావు మహరాజ్**
**దయాల్ శివ మంగళ్ సింగ్ మహరాజ్**



ప్రకాశకులు
**జ్యోతి పబ్లికేషన్స్**
రాధాస్వామి దయాల్ నివాస్, 11-6-254,
పోచమ్మ బాగ్, సరూర్ నగర్,
హైదరాబాద్ - 500 035



దాతా దయాల్ మహర్షి శివవ్రత్‌లాల్‌జీ మహారాజ్




పరమసంత్ పరమ దయాల్ పండిత్ ఫకీర్ చంద్ జీ మహారాజ్

# గురుర్బ్రహ్మా గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః
# గురుః సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురువేనమః

## ప్రార్థన

జబ తుమ్హే చింతా సతావే, గురు కా సుమిరణ ధ్యాన్ హో ॥
మిట్ రహే అజ్ఞాన్ పల్ ఛిన్ మే, జో సచ్చా జ్ఞాన్ హో ॥ ॥1॥

దుఃఖ్ మే సంకట్ మే విపత్ మే, సోచ్ మే చింతా మే భీ ।
నామ కా సుమిరణ సదా హో, నామ కా అనుమాన్ హో ॥ ॥2॥

సోతే ఉఠతే బైఠతే అవుర్ ఖాతే పీతే జాగతే ।
గురుకో అపనే పాస్ సమఝో, పరిచయ కా ప్రమాణ హో ॥ ॥3॥

కౌన్ సీ ఆఫత్ హై జో, టాలే నహీఁ టల్తీ కభీ ।
నామ హై హథియార్ జానో, తుమ్ నహీఁ అన్జాన్ హో ॥ ॥4॥

రాధాస్వామీ కీ దయా సే, జబ శరణ తుమ్ కో మిలీ ।
కుఛ్ దినోఁ అభ్యాస్, పీఛే జీతే జీ నిర్వాణ హో ॥5॥

***

# రెండు మాటలు

సేఠ్ దుర్గాదాస్ ప్రేమగా "గృహస్థీ గురు" (ఉర్దూ పుస్తకం) (ఇప్పుడు జీవన చరితంగా ప్రచురితం) రాతప్రతిని నాకు పంపించి దానిని ప్రచురించడానికి అనుమతి కోరాడు. ఈ సంఘటనలను ప్రచురించాలని నాకు లేదు గానీ గత్యంతరం లేదు. సేఠ్ దుర్గాదాస్‌ను 1917 నుండి ప్రేమిస్తున్నాను. ఇతడు నా గురు సోదరుడు. అంటే ఇద్దరం ఒకే గురువుగారి శిష్యులం. నేను దాతాదయాల్ గారి ఆజ్ఞాపాలన చేసి గురు ఋణం నుండి విముక్తుడను కావాలనుకున్నాను. ఈ క్రమంలో నేను అతనికి "నీవు కాంట్రాక్టర్ పని చేయి. నీ ఆదాయంలోని పదవభాగాన్ని ఏదైనా మంచి పనికి వినియోగించు" అని చెప్పాను. 'మానవతా మందిరం' నిర్మాణంలో ఇరవై రెండు వేల రూపాయలిచ్చాడు. కనుక నేనీ పుస్తకం ప్రచురించడానికి అనుమతిస్తున్నాను. నా గురించి రాసిన సంఘటనలలో నా మంచి కోణాలనే స్పృశించాడు కానీ మొదట్లో నాలో ఉన్న లోపాలను ప్రస్తావించలేదు. (మహారాజ్ గారు ఉర్దూ పుస్తకంలో రాసిన మాటలనే ఈ పుస్తకంలో రాయటం జరిగింది). నన్ను ప్రశంసించినా, విమర్శించినా ఎవరికీ లాభం కానీ, నష్టం కానీ కలగవని ఈ లోకానికి స్పష్టం చేస్తున్నాను. నా మాటలను, నా వచనాలను విని జీవనం గడిపితే లాభదాయకమవుతుంది. నేను నా జీవితంలో ధార్మిక, గృహస్థ, పంథమార్గంలో అనుభవించిన అంశాలను స్వార్థ రహితంగా, అహంకార రహితంగా, లోభరహితంగా వ్యక్తం చేశాను.

***రాధాస్వామీ ధర నర రూప జగత్ మే, గురు హోయ్ జీవ చితాయే ।***
***జిన్ జిన్ మానా బచన్ సమఝ్ కర్, తిన్ కో సంగ్ లగాయే ॥***

నేనేనాడూ ఏ మాటనూ, వచనాన్ని గుడ్డిగా నమ్మలేదు. వాటి గురించి నాకు అనుభవంలోకి వచ్చాకే విశ్వసించాను. ఇది నా అనుభవ జ్ఞానం. పరీక్షించాను. కనుక –

***కర్మ భోగ్ వశ్ యా మౌజ్ అధీన్ కర్‌తా హూం అప్నా కామ్ ।***
***తాకి ఇన్సాన్ కో మిలే జిందగీ మే సుఖ్ ఆరామ్ ॥***

**- ఫకీర్**

# రచయిత మనసులో...

**మ**నిషి ప్రపంచంలోకి వచ్చాడు. కళ్ళు తెరిచాడు. ప్రాపంచిక వ్యవహారాలతో సంబంధం ఏర్పరచుకున్నాడు. బాల్యంలో స్వతంత్రంలోని ఆనందం పొందాడు. యుక్త వయసు వచ్చింది. గృహస్థ వ్యవహారాలతో సంబంధాలు పెంచుకున్నాడు. వివాహం, దుఃఖం, చింత, అచింత స్థితి, సుఖదుఃఖాల ద్వంద్వస్థితులను అనుభవించాడు. జీవితానుభవాలలో వ్యాప్తి, విశాలత్వం వచ్చింది. నడి వయసు వచ్చి వెళ్ళింది. వార్ధక్యం వచ్చింది. శారీరిక, మానసిక నిర్బలత్వాలు – బలహీనతలు మెడలోని దండలుగా మారాయి. ప్రాపంచిక వ్యవహారాలను చూస్తే గాభరా కలుగుతున్నది. ఉదాసీనత వచ్చింది. జీవితమంటే ఏమిటి? దాని ఉద్దేశం ఏమిటి? అని ఆలోచించడానికి వివశుడయ్యాడు.

ఒక సమయం వచ్చాక మనిషికి ప్రాపంచిక వ్యవహారాలు, భార్య, పిల్లలు, ధర్మం, మతం, గౌరవాపేక్ష అతనికి సంతోషాన్నివ్వజాలవు. జీవితం భారంగా అనిపిస్తుంది. శాంతి, నిశ్చింత, దుఃఖ రాహిత్యం ఉన్న స్థితి కావాలని కోరుకుంటాడు. ఈ మానవ జీవన ఉద్దేశ్యం ప్రాప్తింపచేయటంలో ప్రాపంచిక వ్యవహారాలు నిరర్థకమని దీనివలన రుజువవుతున్నది. ఎవరి శారీరిక, మానసిక శక్తులు బలంగా ఉన్నాయో వారికి ఈబొమ్మలు కొంతకాలం వరకు హృదయాకర్షక కారణాలవుతాయి. అనుభవం పెంచుకోవటంలో సహాయపడతాయి.

నేనెవరిని? అని అర్థమైనప్పుడు మనిషికి సంపూర్ణ శాంతి లభించగలదు. జీవితం, దాని ఉద్దేశం ఏమిటి? ఇది ఎవరైనా పూర్ణ పురుషుని సత్సంగం, వచనాల వలన బోధపడుతుంది. కానీ సంస్కారం, అర్హతలను బట్టి సమయం పడుతుంది. పూర్ణ పురుషుడు మనిషి ప్రకృతిని చూసి అతనిలో అణిగి ఉన్నశక్తి పైకి వచ్చేలా అతనికి సూచనలిస్తాడు. పనులు అప్పగిస్తాడు.

సాధన, అభ్యాస శ్రేణుల నుండి నడిపిస్తూ, వచనాల సహాయం అందించి సందేహాల స్థితి సమాప్తం చేసి ఉన్నత స్థితిలోకి చేరుస్తాడు. జీవితం, దాని పనులు ఒక ఆటగా కన్పిస్తాయి. ఇక మనిషి సాంసారిక వ్యవహారాలతో సంబంధం కలిగి ఉంటూన్నా చలించని స్థితిలో ఉంటాడు. సాధన, అభ్యాసం ప్రతి మనిషికీ

ఆవశ్యకం కాదు. మనిషిని ఒక విశేష స్థితిలోకి చేర్చడానికి జపం, తపం, సంధ్య, హవనం, తీర్థవ్రతాలు, పూజా పఠనాలు, స్మరణ, ధ్యానాలు, భజనలు, జ్ఞానం మొదలైనవి అవసరమవుతాయి. కానీ ఇవన్నీ సాధనాలే! జీవితం యొక్క ఇష్టపదం కావు.

నేను కూడా లోకంలోకి వచ్చాను. పెరిగి పెద్దవాణ్ణయ్యాను. స్నేహితులు, సహాయకులు, మార్గ నిర్దేశకులు ఎవరూ లేరు. బీదరికంలో మగ్గిపోయాను. మా నాన్నగారిపైన పెద్ద ఋణభారం ఉంది. ఏదో ఒక అంతరీయ శక్తికి ఆధీనుడనై బ్రసాకు చేరాను. నా ప్రారబ్ధ కర్మ నన్ను పూర్ణ పురుషుడైన పరమ దయాల్ పండిత్ ఫకీర్‌చంద్ జీ మహారాజ్ చరణాలలోకి లాక్కువెళ్ళింది. అప్పట్లో నా వయసు 18 సంవత్సరాలు.

నా గురువు కూడా గృహస్థుడే. జీవితంలోని ప్రతి స్థితిలో ఆయనకు పూర్తిగా అనుభవం ఉంది. గృహస్థునికి ప్రాపంచిక వ్యవహారాలలో, కుటుంబ విషయాలలో ఎలాంటెలాంటి కష్టాలను ఎదుర్కొనవలసి వస్తుందో, వాటిని నియంత్రించే పద్ధతి ఏమిటో ఆయనకు తెలుసు. కనుక జీవితంలోని ప్రతి దశలో నాకు నా మేలు కోసం సహాయం చేస్తూ నన్నీస్థితికి తీసుకువచ్చారాయన. మానవ జీవనం యొక్క ఇష్టపదం ఏమిటో ఇప్పుడు నాకు ఎంతో బాగా బోధపడింది.

మనిషి ఆ పరమతత్త్వం ఇచ్ఛకు లోబడి, ఆయన ఆధీనంలో ఉండి తన జీవితాన్ని సంతోషం, నిశ్చింత, ఆనందాలతో గడపాలి. ఆ పూర్ణ పురుషుని సూచనల మేరకు నడుచుకుంటూ జీవన ధ్యేయాన్ని ప్రాప్తించుకోవాలని భావిస్తాను.

నేను పరమదయాల్ జీ మహారాజ్‌గారికి సేవకుణ్ణి కాను. సేవకునికి అడుగడుగునా పరీక్షలు జరుగుతుంటాయి. పరీక్ష చాలా కఠినం. ఏ ఒక్క సేవకుడో పూర్తిగా కర్తవ్యం నిర్వర్తిస్తాడు. కనుక నేను మహారాజ్‌గారికి పుత్రుడను కావాలని ప్రయత్నిస్తున్నాను. పుత్రుని దోషాలన్నీ క్షమించబడతాయి. తెలివిలేని పుత్రుడు కూడా తండ్రి ఆస్తికి వారసుడవుతాడు. వారసత్వంగా ఏమైనా లభిస్తాయి.

పరమ దయాలుని చరణాల ధూళి

**దుర్గాదాస్**

# ప్రాక్కథనం

ప్రభుత్వ సేఠ్ దుర్గాదాస్‌గారు కాంట్రాక్టర్. చండీగఢ్ నివాసి. ఈయన పరమ దయాల్ ఫకీర్ చంద్ జీ మహారాజ్‌కు పరమభక్తుడు. క్రీ.శ. 1918వ సం॥ నుండి బ్రసా బగ్దాద్‌లో ఉన్న రోజులలో మహారాజ్‌గారి సాహచర్యంలో ఉన్నారు. ఎంతో గొప్ప కాంట్రాక్టర్ –గుత్తేదారే గాక గౌరవ మర్యాదలు పుష్కలంగా వున్న శ్రీమంతుడు. ఇప్పుడు పని మానేశారు. పరమ దయాల్ మహారాజ్ పట్ల ఉన్న అనన్యమైన ప్రేమ కారణంగా మహారాజ్‌గారి జీవన వృత్తాంతాన్ని ఉర్దూలో రాసి 'గృహస్థి గురు' శీర్షికతో ప్రథమ భాగాన్ని 1958లో ప్రచురింప చేశారు. దీని తరువాత మరికొన్ని సంఘటనలు, బోధనలు, అనుభవాలకు సంబంధించిన వివరాలు జ్ఞాపకానికి రాగా వాటిని కూడా "గృహస్థీ గురు" రెండవ భాగం పేరిట క్రీ.శ. 1972లో ప్రచురించారు.

దీని తరువాత ఈ పుస్తకాలను హిందీలో కూడా ప్రచురిస్తే బాగుంటుందని సేఠ్ దుర్గాదాస్ గారు సంకల్పించారు. ఇందుకు ఆయన మహారాజ్‌గారిని ప్రార్థించారు. ఆయన భావాన్ని, సంకల్పాన్ని పూర్తి చేయాలనే దృష్టితో 'శివ్' పత్రికలో వెలువరించమని నన్ను మహారాజ్ ఆజ్ఞాపించారు. నాకు సమయం లభించనందువల్ల దీనిని ప్రచురించటంలో ఆలస్యం జరిగింది.

ఉర్దూ పుస్తకంలో సంఘటనలు క్రమానుసారం లేవని మహారాజ్ అన్నారు. కనుక సేఠ్ దుర్గాదాస్ గారి అనుమతిని పొంది రెండు పుస్తకాలలోని సంఘటనలను వరుస క్రమంలో రాశాను. "దుర్గాదాస్‌గారు ప్రేమవశాన నా జీవితంలోని ఉజ్వల ఘటనలనే వర్ణించారు. కనుక నేను నా అవగుణాలను, లోపాలను, బలహీనతలను కూడా వివరిస్తానని" మహారాజ్ గారు రాశారు. వాటికి కూడా ఈ పుస్తకంలో సమయోచితంగా వరుసక్రమంలో స్థానం కల్పించడం జరిగింది.

ఇదేగాక ఇక్కడ మరో విషయం రాయటం అవసరం. 1951లో నేను మహారాజ్ గారిని పదేపదే ప్రార్థించాను. ఆయన జీవితంలోని స్థితిగతులను వివరిస్తే జీవిత చరిత్రగా రాస్తానన్నాను. ఆయన హోషియార్‌పుర్‌లో సూక్ష్మంగా, క్లుప్తంగా కొన్ని సంఘటనలు చెప్పి రాయమన్నారు. కానీ అవి ఇతరుల జీవిత చరిత్రలవలెగాక కొంచెం భిన్నంగా ఉన్నాయి. ఆ స్థితిని, సన్నివేశాలను, "ఏక్‌బావలే

అవుర్ దానీ ఫకీర్ కీ జీవనీ" పేరుతో పుస్తకంగా ప్రచురింపచేశారు. వాటిని కూడా క్లుప్తంగా ఈ పుస్తకంలో చేర్చటం జరిగింది. ఏ వృత్తాంతాన్నీ, ఘటననూ వదిలిపెట్టలేదు.

పరమదయాల్ జీ మహారాజ్ బోధనలు, చమత్కార సంఘటనలను అన్నింటినీ ఏకత్రితం చేస్తే వేలాది పుటలవుతాయి. అదొక గొప్ప ఉద్గ్రంథమవుతుంది. కానీ క్లుప్తంగా ఆయన బోధనలను, చమత్కార సంఘటనలను వివరించటం జరిగింది. వాటి సారాంశం ఇచ్చాను. ఇప్పటివరకు దాదాపు 100 పుస్తకాలకు పైగా హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషలలో మహారాజ్ పుస్తకాలు ప్రచురించబడ్డాయి. పాఠకులు వాటిని చదివి లాభం పొందగలరు.

పరమ దయాల్ జీ మహారాజ్ పూర్ణ పురుషులు. సంత్ సద్గురు వక్త్. జగత్ గురువులు. వారి జీవితచరిత్ర, వారి బోధనలను వర్ణించటం అసంభవం, అసాధ్యం. ఇందులో వర్ణించినవి వారి జీవితంలోని కొన్ని మెరుపులు మాత్రమే! కొన్ని ప్రతిబింబాలు మాత్రమే!

పరమ దయాల్ జీ మహారాజ్ గారికి తమ సద్గురువు దాతా దయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ పట్ల అగాధమైన ప్రేమ ఉందన్న విషయం ఈ జీవిత చరిత్ర చదివితే తెలుస్తుంది. మహర్షిగారు కూడా ఏ గురువూ తన శిష్యుణ్ణి ప్రశంసించనంతగా ప్రశంసించారు.

పరమ దయాల్ జీ మహారాజ్ అనేక కష్టాలను సహించి జీవితం గడిపారు. సత్యసంధులై జీవితం గడిపారు. సాంగత్య దోషం వలన కలిగిన అవగుణాల పట్ల చాలా పశ్చాత్తాపం పొంది వాటిని వదిలిపెట్టారు. జీవితమంతా సాధన, అభ్యాసాలు చేశారు. ఇప్పటికీ చాలావరకు సమాధిస్థితిలో ఉంటారు. వారి బోధన, శిక్షణ నివృత్తి, ప్రవృత్తి రెండు మార్గాలపై ఉంటుంది. కానీ నివృత్తి మార్గ అర్హులు ఏ కొద్దిమందో ఉంటారు. కనుక మహారాజ్ జీవనాన్ని సుఖశాంతులతో గడిపే రహస్యాన్ని కూడా వర్ణిస్తూ ఉంటారు. పాఠకులు మహారాజ్‌గారి జీవన చరితాన్ని చదివి లాభం పొందగలరని ఆశిస్తున్నాను.

**- దేవీ చరణ్ మీతల్**

'శివ్' పత్రిక సంపాదకుడు

# పీఠిక

హుజూర్ పరమ దయాల్ జీ మహారాజ్ సత్యానికి ప్రతీక. తన గురువైన హుజూర్ మహర్షి దాతా దయాల్ జీ మహారాజ్ సంపూర్ణ కృపకు పాత్రుడై గురువుగారి పేరును నిలబెట్టినవాడు. దాతా దయాల్ గారి కీర్తిని మరింత ప్రకాశింప చేసినవాడు. పరమ దయాల్ జీ మహారాజ్‌కు పరమ భక్తుడు, ఆప్త మిత్రుడు అయిన సేఠ్ దుర్గాదాస్‌గారు అనేక సంవత్సరాలు మహారాజ్ సాంగత్యంలో, సన్నిధిలో ఉండి తరించారు.

హుజూర్ పరమ దయాల్ జీ మహారాజ్ జీవిత చరిత్రను తను జీవించి ఉన్న కాలంలో, తను సమీపంగా ఉండి చూసిన సంఘటనలను చేర్చి రాశారు సేఠ్ దుర్గాదాస్ గారు. ఆయన హిందీలో రాసిన 'దయాల్ ఫకీర్ కీ జీవనీ'ని మూలంలోని సారాంశాన్ని యథాతథంగా పొందుపరుస్తూ తెలుగులోకి అనువదించిన శ్రీమతి జ్యోతిరాణి అభినందనీయురాలు. ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు నా శుభాకాంక్షలు.

హుజూర్ మహారాజ్ ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను ఆశీర్వదించుగాక!

నిజామాబాద్ — 'శివ్'
29-01-2013 (శివ మంగళ్ సింగ్)

# స్వప్నం సాకారమైన శుభవేళ!

*"తూతో ఆయా నర దేహీ మే, ధర్ ఫకీర్ కా భేసా ।*
*దుఃఖీ జీవ కో అంగ్ లగాకర్, లేజా గురు కీ దేశా ॥*

*తీన్ తాపే సే జీవ దుఃఖీ హైం, నిబల్ అబల్ అజ్ఞానీ ।*
*తేరా కామ్ దయా కా భాయీ నామదాన్ దే దానీ ॥*

*తేరా రూప్ హై అద్భుత్ అచరజ్ తేరీ ఉత్తమ దేహీ ।*
*జగ కల్యాణ జగత్ మే ఆయా పరమ దయాల్ సనేహీ ॥*

*జో ఫకీర్ మోహె దర్శన్ దేవే, అప్నా భాగ్ సరాహూం ।*
*అపనీ తన్ కీ చామ్ కీ జూతీ, పగ్ ఫకీర్ పహనావూం ॥*

*మై నహీం రామ కృష్ణ కా సేవక్, ఈశ బ్రహ్మ నహీం జానూం ।*
*మై ఫకీర్ కా నామ దీవానా, సబ సే బఢకర్ మానూం ॥*

అంటూ దాతా దయాల్ జీ మహారాజ్ పరమ దయాల్ మహారాజ్‌ను ఉద్దేశించి శబ్ద్ రాశారు. ప్రపంచంలో ఏ గురువూ తన శిష్యుణ్ణి ఈ విధంగా ప్రశంసించి ఉండడు. లోకంలో ఏ శిష్యుడూ తన గురువు గారిని ప్రేమించనంత అమితంగా పరమ దయాల్ మహారాజ్ దాతా దయాల్ మహారాజ్‌ను ఆరాధించారు, ప్రేమించారు.

పరమ సంత్, మహా మహిమాన్వితుడు, అఖండ మేధా సంపన్నుడు, తేజోమూర్తి, అవతార పురుషుడు, పూరణ్ ధని, సంత్ శిరోమణి, ఆధ్యాత్మిక సంపదకు ప్రత్యేక ఆకృతినిచ్చి, అద్భుతంగా ఆవిష్కరించి, ఐదువేల గ్రంథాలు రాసిన నిలువెత్తు సాహితీ మూర్తి, పుంభావ సరస్వతి దాతా దయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ పరమ దయాల్ మహారాజ్‌ను ఉద్దేశించి ఇలా అంటున్నారు – "నీవు మానవ శరీరంలో ఫకీర్ రూపం ధరించి వచ్చావు. దుః ఖితులైన జీవులను గురు దేశానికి తీసుకువెళ్ళు. త్రయ తాపాలతో జీవులు దుః ఖపడుతున్నారు. నిబలురు, అబలురు, అజ్ఞానులైన వారికి నామ దానమివ్వు. నీ

కర్తవ్యం దయ చూపటమే! నీ రూపం అద్భుతమైనది, ఆశ్చర్యకర మైనది. నీ దేహం ఉత్తమమైనది. జగత్కల్యాణం కోసం, లోకానికి శుభాలు కలిగించటం కోసం పరమ దయాళుడవై ఈ జగత్తులోకి వచ్చావు. నాకు ఫకీర్ దర్శనం లభించటం నా అదృష్టం. నా చర్మంతో చెప్పులు కుట్టి ఫకీర్ పాదాలకు తొడిగిస్తాను. నేను రాముడికో, కృష్ణుడికో సేవకుణ్ణి కాను. నాకు ఈశ్వరుడు, బ్రహ్మదేవుడు తెలియరు. నాకు తెలిసింది ఫకీర్, ఫకీర్ నామం. ఫకీర్ నామం అంటే నాకు పిచ్చి అభిమానం. అంతగా నేను ఫకీర్‌ను ప్రేమిస్తున్నాను. అందుకే అందరికంటే, అన్నిటికంటే ఫకీర్ ఉన్నతోన్నతుడని, ఉత్తమోత్తముడని విశ్వసిస్తాను" అన్నారాయన.

ఒక గురువే శిష్యుణ్ణి ఇంతగా శ్లాఘిస్తున్నాడంటే శిష్యుని అర్హత ఎంత గొప్పదో తెలుసుకోవచ్చు. ఇక ఆ శిష్యుడు తన గురువును ఎంతగా అభిమానించి, ఆరాధించాడో అర్థం చేసుకోవచ్చు. ఆ గురువు ఆజ్ఞను పాటించడానికి ఈ శిష్యుడు తన 95 సంవత్సరాల వార్ధక్యాన్ని సైతం లెక్కచేయక సత్సంగాలివ్వడానికి, సంత్ మతమును, మానవతను ప్రచారం చేయడానికి పంజాబ్ నుండి బయల్దేరి హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లేగాక అనేక విదేశాలకు సైతం పర్యటించారు.

ఆ ఇద్దరి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే! ఎంత విన్నా తక్కువే! నూటికి నూరుపాళ్ళు సత్యావతారుడైన నా ఆరాధ్య దైవం పరమ సంత్ పరమ దయాల్ పండిత్ ఫకీర్ చంద్ జీ మహారాజ్ జీవిత చరిత్రను 'దయాల్ ఫకీర్ కీ జీవనీ' శీర్షికతో సేట్ దుర్గాదాస్ గారు రాశారు. ఇది పూర్వార్థం. శ్రీ దుర్గాదాస్ గారి జీవన కాలం నాటి వరకు ఆయన చూసిన, విన్న ఉదంతాల సమాహారం.

శ్రీ దుర్గాదాస్ గారు పరమపదించిన తరువాత కూడా కొన్ని సంవత్సరాల పాటు పరమ దయాల్ జీ జీవించారు. శ్రీ దుర్గాదాస్ గారు పరమ దయాల్ జీ కి ప్రియమైన భక్తుడు, స్వచ్ఛమైన మిత్రుడు, గురు సోదరుడు. అన్నిటినీమించి ఆయన సన్నిధిలో చాలాకాలం పాటు నివసించి, సత్సంగామృతాన్ని, స్నేహ మాధుర్యాన్ని, ప్రేమను అనుభవించి, ఆస్వాదించిన అదృష్టవంతుడు. ఆయన

అత్యంత సమీపంగా ఉండి చూసిన సంఘటనలకు అక్షరాకృతిని ఇచ్చాడు. వీటిని మొదటి భాగంగా మనం అనువదించి, వెలువరించుకుంటున్నాం. శ్రీ దుర్గాదాస్ గారు రాసిన ఈ గ్రంథంలోని సంఘటనల తరువాత జరిగిన అంశాలను "రెండవ భాగం"గా మరోసారి ప్రచురించుకోవాలని సంకల్పిస్తున్నాం. ఇక ఈ పుస్తకం గురించి! తినబోతూ రుచులడగటమెందుకు? మీరే చదవండి! ఎన్నాళ్ళుగానో కలగంటున్న నా స్వప్నం సాకారమై పరమ దయాల్ మహారాజ్ జీవిత చరిత్రగా వెలువడటం సంతోషంగా ఉంది.

మహర్షి దాతా దయాల్ మహారాజ్‌కు, పరమ దయాల్ మహారాజ్‌కు, దయాల్ ఆనందరావు మహారాజ్‌కు, హుజూర్ ప్రేమానందరాయ్ మహారాజ్‌కు, హుజూర్ శూన్యోజీ మహారాజ్‌కు, దయాల్ శివ మంగళ్ సింగ్ జీ మహారాజ్‌కు శతకోటి ప్రణామాలర్పిస్తున్నాను. నన్నెంతో అభిమానిస్తున్న ప్రియమైన సత్సంగీయ సోదర సోదరీమణులకు ప్రేమతో రాధాస్వామి.

హైద్రాబాద్ — పరమ దయాలుని చరణాల ధూళి

29-01-2013 — **– ఆచార్య డా॥ జ్యోతిరాణి**

*గురు ప్యారే కె చరణోఁ కీ దాసీ బనీ, దాసీ బనీ ప్రేమ ప్యాసీ బనీ ॥*
*సహస్ కమల్ దల్ నిరఖ్ సహస్ ఛవి, సహసాసన్ సహసాసీ బనీ ॥*
*త్రికుటీ తత్వమ్ వాచ్ లక్ష్య లఖ్, ఓమ్‌కార్ సహవాసీ బనీ ॥*
*సున్న్ మే ద్వంద్ అవస్థా మేటి, సహజ్ సమాధి ఉదాసీ బనీ ॥*
*భఁవర్ మే భఁవరాకృత్ హో డోలీ, సోహంగమ్ ఆకాసీ బనీ ॥*
*సత్ పద్ జాయే మిలీ సతగురుసే ఆనందిత్ సుఖరాసీ బనీ ॥*
*అలఖ్ అగమ్ అనామ్ పద్ దర్‌సా, అజర్ అమర్ అవినాశీ బనీ ॥*
*రాధాస్వామి ధామ్ మే డేరా డాలా, జ్ఞాన భక్తి ప్రకాశీ బనీ ॥*

# దయాల్ ఫకీర్ జీవన చరితం

## సంతుల ప్రాకట్యం

మనిషి జీవితంలో జననితో, జన్మభూమితో ప్రత్యేకమైన అనుబంధం ఉంటుందనటంలో సందేహమేమీ లేదు. పంజాబ్ ధరిత్రిపై ఎల్లప్పుడూ ధర్మవీరులు, రణ వీరులు, కర్మవీరులు ఉద్భవించటం ఇక్కడి ప్రత్యేకత. గురునానక్, గురుగోవింద సింహ, హకీకత్‌రాయ్, రణజీత్ సింహ, స్వామీ రామతీర్థ వంటి అనేకమంది మహా పురుషులు సమయానుసారం పంజాబ్‌కు లభించారు. ఇదేవిధంగా నేటి సమయంలో ఒక పరమసంత్‌ను ఉత్పన్నం చేసే అదృష్టం దానికి ప్రాప్తించింది. భారతదేశానికే గాక విశ్వానికి మార్గదర్శనం చేయటం పరమావశ్యకమైంది. ఇవాళ నలువైపులా అంధకారం అలముకుంది. లోకులు మతం పట్ల, ధర్మం పట్ల విముఖులయ్యారు. వారి ఆచార వ్యవహారాలు భ్రష్టమవుతున్నాయి. పదార్థవాదం - మెటీరియలిజం - పదం యొక్క అర్థం వారిని ఘోరంగా అణచిపెట్టింది. నలువైపులా లంచగొండితనం, పక్షపాతం, అవినీతి తీవ్రంగా వ్యాపించాయి. ధర్మ పంథ మత సంప్రదాయాలు పెరిగాయి. కానీ ధనాపేక్షగల ఆచార్యులు, గురువులు, మహాత్ముల కపట ప్రవర్తన వలన ప్రజలు బాధలు పడుతున్నారు. కొద్దోగొప్పో మత-ధార్మిక భావాలు, సత్యం, శాంత్యహింసల కోరిక గలవారికి సత్యమైన మార్గం లభించటం లేదు. ఇలాంటి వారి గుండెపిలుపు వలన, ఆయా కాలంలోని ఆవశ్యకత ననుసరించి ప్రపంచంలో దైవేచ్ఛతో సంత్‌ల ప్రాకట్యం జరుగుతుంది. సంత్‌ల అవతరణ జరుగుతుంది. వారు తమ వచనాలతో, ఆచరణతో, క్రియాత్మక జీవనంతో అంధకారంలో చిక్కుకున్న ప్రపంచాన్ని సత్యం, శాంతి దిశగా తీసుకువెళ్తారు.

సంత్‌లు రెండు రకాలుగా వుంటారు. మొదటిరకం సంతులు ప్రపంచంలోకి వచ్చి ఎవరైనా పూర్ణ పురుషుని పర్యవేక్షణలో, సన్నిధిలో సాధన, అభ్యాసాలు చేసి నిజస్వరూపాన్ని సాక్షాత్కరించు కుంటారు. రెండవ రకం వారు ఆజన్మ సంతులు.

అనగా తల్లి గర్భం నుండే సంతులుగా ఉద్భవిస్తారు. బాల్యంనుండే తమ వచనాలు, కర్మలతో ప్రజలకు బోధిస్తుంటారు. సమయం వచ్చినప్పుడు, సామాన్యుల కోసం కళ్యాణకర, శుభకరమైన పనులు ప్రారంభిస్తారు.

ఈ రోజు అలాంటి ఒక పవిత్రమూర్తి, సాక్షాత్తూ సత్యమే తానుగా మూర్తీభవించిన ఒక పరమ సంతు జీవితంలోని కొన్ని సంఘటనలను రాయడానికి సాహసిస్తున్నాను.

## జననం, జన్మభూమి, బాల్యం

పంజాబ్ రాష్ట్రంలోని హోషియార్‌పుర్ జిల్లాలో పంఘూల్ అనే గ్రామంలో ఒక ఉన్నతశ్రేణికి చెందిన బ్రాహ్మణ కుటుంబం ఉంది. మహారాజ్‌గారి తండ్రి పండిత్ మస్తరామ్‌గారు మొదట పోలీస్ ఉద్యోగి. రిటైరయ్యాక ఇచ్చిపుచ్చుకునే పని ప్రారంభించారు. అంటే వ్యాపారం చేశారు. ఆయనకు పెళ్ళయ్యాక పన్నెండేళ్ళవరకు సంతానం కలగలేదు. అందుకు బాధపడేవాడు. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయంది. చివరకి ఒక ఫకీర్ - సాధువు దగ్గరికి వెళ్ళసాగాడు. ఆయనకు సేవచేసే వాడు. తనకింకా సంతానం కలగలేదని ఆ ఫకీర్‌తో మొరపెట్టుకునేవాడు. తనపై దయచూపు మనేవాడు. ఒకరోజు ఆయన సేవకు ప్రసన్నుడైన ఫకీర్, "వెళ్ళు! నీ ఇంట్లో పుత్రుడు ఉదయిస్తాడు. అతని పేరు ఫకీర్ చంద్ అని పెట్టాలి" అన్నాడు.

మహారాజ్‌గారి జనన సమయంలో వారి తల్లిగారు ఆమె తల్లిగారింట్లో ఉంది. భర్త గతించినందువలన ఆమె ఈశ్వరుణ్ణి, పరమేశ్వరుణ్ణి భక్తితో పూజించేది. ఆమె ఇంట్లో ఒక చిన్న మందిరం ఉంది. ఆ ఇంట్లోనే 1886లో మహారాజ్‌గారి అవతరణ జరిగింది. ప్రాచీనకాలంలో హిందువుల ఇళ్ళల్లో రామాయణ, భాగవత కథలు విన్పించేవారు. చెప్పించేవారు. మహారాజ్ గారికి ఆరేళ్ళప్రాయం వచ్చేనాటికి వాటి ప్రభావం ఆయనపై పడసాగింది. భక్తి, ప్రేమల సంస్కారాలు నిగ్గుదేలాయి. బాల్యం నుండే ఆయన ఆలోచనలు సాధువుల ఆలోచనలుగానే వుండేవి.

ధార్మికులు ఆత్మను చైతన్యం అని అంటారని మహారాజ్‌గారు రాశారు. భావన లేదా సంకల్పం లేదా ఆలోచనా విచారం లేదా మనసులకు ఆత్మకంటే కొంత తక్కువ స్థాయి ఇవ్వబడింది. స్థూల పదార్థాన్ని జడం అన్నారు. చైతన్యతే , ఆలోచనా విచారాలను తయారు చేస్తుంది. ఆ సంకల్ప, భావనలు – ఆలోచనా విచారాలే జడ పదార్థ రూపమును ధరించటం జరుగుతుంది. ఎందుకంటే ఆలోచనా విచారం అనేది ఒక శక్తిమంతమైన వస్తువు. అందుకే మస్త్ ఫకీర్ గారి ప్రబలమైన ఇచ్ఛా శక్తి, నా తల్లి దండ్రుల ప్రబల సంతానేచ్ఛ, ఈ ప్రకృతిలోని ముఖ్యమైన పరమాణువులను నా తండ్రిగారి మస్తిష్కంలో ప్రవేశపెట్టాయి. ఆ విచారాలు, ఆలోచనలు, సంకల్ప భావనలు నా తండ్రిగారి శరీరం, రక్తం, వీర్యముల ద్వారా నా ప్రకృతిలో ప్రవేశించాయి. నా జీవితంలో ప్రభావితమై నా శరీరం, మనసు, ఆత్మలతో ఫకీరీ – సాధుత్వం – సంతత్వం కార్యనిర్వహణ చేయడానికి వివశుడిని చేశాయి. నా తల్లి లేదా తండ్రిగార్ల ఆలోచనా విచారాలు, సంకల్ప భావనలు కూడా ఫకీరానా అనగా సాధు సంతత్వాలకు సంబంధించినవైతే నా వర్తమాన జీవితం మరో రకంగా, గౌరవంగా ఉండేది. ఇదేవిధంగా ప్రతి ప్రాణి ఈ లోకంలోకి వచ్చాక తమ తల్లిదండ్రుల భావాలు, ఆలోచనావిచారాలు, జనన సమయంలో కల దేశకాల వస్తువుల ప్రభావాలను తన ప్రకృతిలోనికి తీసుకొని పుడతారు.

## ఇతర వృత్తాంతాలు

ఇంట్లో పాల కోసం ఏర్పాట్లు లేవు. వారి తండ్రిగారు ఒక మేకను కొన్నారు. ఒకరోజు ఆ మేక కోసం తుమ్మకాయలు తుంచుకు రమ్మన్నారు. మహారాజ్ అడవికి వెళ్ళి కాయలు తుంపసాగారు. కాయలు తెంపుతూంటే పాలవంటి ద్రవం రాసాగింది. మహారాజ్ ఏడవసాగారు. కాయలను వదిలి వచ్చేశారు. తండ్రితో "వృక్షం నుండి రక్తం వెలువడుతున్నది. చెట్టులో ప్రాణముంది. తుమ్మకాయలు తుంచటం నా వల్ల కాదు" అన్నారు. పండిత్ మస్తరామ్‌గారు మహారాజ్‌ను బెదిరించారు. వీరు మౌనంగా అన్నీ సహించసాగారు.

గడ్డిలో కూడా ప్రాణం ఉంటుందని మహారాజ్ నమ్మకం. దానిపైన మలవిసర్జన చేస్తే గడ్డికి దుర్గంధం వస్తుంది. కనుక దూరంగా ఖాళీ ప్రదేశానికి వెళ్ళి మల విసర్జన చేసేవారు. ఇలాంటి ఆలోచనా విచారాలు, భావనలు వారి చిత్తంలో ఏర్పడసాగాయి.

చిన్ననాటి మాట. మహారాజ్ గారు తన తమ్ముడు వజీర్ చంద్‌ను ఎత్తుకుని ఆడిస్తున్నారు. మహారాజ్ కాలికేదో దెబ్బ తగిలి కింద పడ్డారు. తమ్ముడికి కూడా కొంచెం దెబ్బ తగిలింది. అతడు ఏడవసాగాడు. పిల్లవాడు ఏడుస్తున్న చప్పుడు విని తల్లి ఫరుగు పరుగున వచ్చింది. మహారాజ్‌ను రెండు, మూడు దెబ్బలు కొట్టింది. మళ్ళీ పిల్లవాడిని చేతికిచ్చి "తీసుకువెళ్ళి ఆడించు" అంది. ఇంతకు ముందు కూడా చాలాసార్లు ఈ కారణంగానే దెబ్బలు తిన్నారు. ఈ రోజు మాత్రం వారికి చాలా బాధనిపించింది. ఆలోచించసాగారు. ఈ పిల్లవాడి కారణంగా రోజూ నాకు దెబ్బలు పడుతున్నాయి అనుకుంటూ వారు భగవంతుణ్ణి ప్రార్థించి, "ఓ సర్వేశ్వరా! ఈ పిల్లవాడైనా చనిపోవాలి. నేనైనా చనిపోవాలి" అని వేడుకున్నారు. ఫలితంగా నెలరోజుల లోపల పిల్లవాడు మరణించాడు. దుఃఖపడిన హృదయపు పిలుపు పరిణామం ఇది. ఎవరి మనసునైనా దుఃఖ పెట్టడం మంచిది కాదు.

*గరీబ్ కో న సతాయియే, బురీ గరీబ్ కీ ఆహ్ ।*
*ముయీా ఖాల్ కీ స్వాంస్ సోం, సార్ భస్మ హో జాయ్ ॥*

మహారాజ్‌ను ఏడు సంవత్సరాల వయసులో బడికి పంపించారు. వారి సద్గుణాలు అధ్యాపకుల మనసులలో స్థానం సంపాదించాయి. వారు ప్రేమగా చదువు చెప్పసాగారు. మహారాజ్ తోటి పిల్లలపట్ల సోదర భావం, సానుభూతితో ప్రవర్తించేవారు. ఇంటినుండి నేరుగా బడికి వెళ్ళేవారు. మనసు పెట్టి పాఠాలను జ్ఞాపకం చేసుకునేవారు. బడి వదలగానే నేరుగా ఇంటికి వచ్చేసేవారు. పనిలేకుండా ఇటూ అటూ తిరగటం ఆయన నేర్చుకోనేలేదు. ప్రైమరీ తరగతుల పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. ఇంతవరకు ఉర్దూబడిలో చదివారు. ఆయన ఉర్దూ, ఫార్సీ భాషలలో ఐదవ తరగతి వరకు చదువుకున్నారు.

ఆ తరువాత వారిని ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో చేర్చారు. ఆ రోజుల్లో పెద్ద పెద్ద నగరాల్లోనే ఇంగ్లీష్ బోధనా బడులుండేవి. వారి తండ్రిగారి ఆదాయం తక్కువగా వుండేది. కనుక ఆ తరువాత మరింత పెద్ద చదువులు చదివించలేక పోయారు. విద్యార్థిగా వున్నప్పుడు వారు ప్రతిదినం రామాయణాన్ని పఠించేవారు. అప్పుడు ఒక విచిత్ర సంఘటన జరిగేది. పఠించే సమయంలో వారికి ఇంట్లో ఒక రకమైన సుగంధం వచ్చేది. పొయ్యిలో ఏదైనా వస్తువు కాలుతున్నదేమో, ఇది దానికి సంబంధించిన సువాసన కాబోలని చాలాసార్లు పరిశీలించారు. కానీ అలాంటిదేమీ కన్పించేది కాదు. రామభక్తి రంగు చాలా లోతైనదై ఉంది. ఆ సమయంలో సుగంధానికి గల కారణం తెలియలేదు. విషయం అర్థం కాలేదు. ఇప్పుడు ఆయన నిజ అనుభవాల ఆధారంతో చెబుతారు. ఉదాహరణకు మాంసం లేదా చర్మం వలన దుర్గంధం ఉద్భవిస్తుంది. అదేవిధంగా ఎప్పుడైతే ఆత్మ నిజ స్వరూపం వైపు ఆకర్షితమై లాక్కున బడుతుందో అప్పుడు ఆనంద స్థితి కలుగుతుంది. ఆ సమయంలో కారణ ప్రకృతి ఆత్మ నుండి వేరై పోతుంటుంది. ఈ క్రియ వలన ఒక విశేషమైన గంధం - వాసన వస్తుంది. చాలామంది సురత్ శబ్దయోగ సాధకులకు కూడా ఇలాంటి అనుభవాలు కలిగాయి. కలుగు తుంటాయి.

## వివాహం

ఆయన వయసు పదమూడేళ్ళు. ఆనాటి ముసల్మాను రాజ్యంలో బాల్య వివాహాలు జరిగే ఆచారం ఏర్పడి ఉంది. మూడు, నాలుగేళ్ళ పిల్లలకు కూడా పెళ్ళిళ్ళు చేసేవారు. 10-12 సంవత్సరాల తరువాత వివాహం చేయడం పాపంగా భావించేవారు. హిందువులు ప్రాచీన నమ్మకాలను, మాటలను నమ్మటంలో సుప్రసిద్ధులు. ఆంగ్లేయుల రాజ్యం వచ్చింది. ముస్లిం శాసనం సమాప్తమైంది. కానీ దాని ప్రభావం మిగిలే ఉంది. ఆంగ్ల బోధన యొక్క పరివర్తనను పూర్తిగా స్వీకరించలేదు. కనుక వారి వివాహానికి ఏర్పాట్లు జరిగిపోయాయి.

వివాహాన్ని పురస్కరించుకుని ఆయనకు మంచి మంచి బట్టలు తొడిగించారు. మెడలో పువ్వుల దండ వేశారు. అత్తరు పులిమారు. పల్లకీలో

కూర్చో బెట్టి తీసుకువెళ్ళారు. ఆయన **ఎంతో సంతోషించారు. ఈ ఆట** ఎంతో మనోహరంగా ఉందని మనసులో **అనుకోసాగారు. మళ్ళీ** మళ్ళీ ఆడుకోవాలనిపించింది. ఇది చిన్నతనంలోని **సామాన్యమైన సాధారణ**మైన ఆలోచనలే! కానీ విచారాలలో ఆలోచనల్లో **చాలా శక్తి ఉంటుంది. ఫలితంగా** కొంతకాలం తరువాత ఆయన భార్య దేహాంతమైంది. **కొన్నాళ్ళకు ఆయనకు** రెండవ వివాహం చేశారు.

## ఉద్యోగం - సాంగత్య ప్రభావం

ఆయనకు పదహారేళ్ళు రాగానే సిలనాబడీ స్టేషన్‌లో కన్‌స్ట్రక్షన్‌లైన్‌లో ఉద్యోగం లభించింది. అక్కడొక కాంట్రాక్టరు, ఒక పి.డబ్ల్యు.ఐ. పనిచేసేవారు. వాళ్ళంతా మాంసాహారులు, మద్యం తాగేవారు. వారి దగ్గరే ఉండటం, వారి వద్దే పని చేయటం వలన వాళ్ళు మాంసం తినమని, మద్యం తాగమని అలవాటు చేశారు. ఇది ఉద్యోగంలో చేరిన తొలిరోజుల్లోని మాట. ఆయనకు చిన్ననాటినుండే ఉత్తమమైన భావాలున్నాయి. మరి ఉద్యోగంలోకి రాగానే ఇలాంటి ఆలోచనలు ఎందుకొచ్చాయి? ముఖ్యంగా ఆయనకు సాధుత్వం - ఫకీర్ సంస్కారాలు లభించాయి కదా అని ఎవరైనా అడగవచ్చు. ఇందుకు ఆయన సమాధానంగా – "ఇవి సాంగత్య దోషం వల్ల లభించాయి" అంటారు. ఇదేగాక ఆయన తండ్రిగారు కూడా మాంసం తినేవారు. ఒక మహాపురుషుని శుభ సంస్కారాలు ఉన్నా మనపై ఇతర సంస్కారాలు కూడా ప్రభావం చూపుతాయి. ఈ సంస్కారాలు మన తల్లిదండ్రుల నుండి కూడా పొందుతుంటామని ఆయన అనుభవం చెబుతున్నది.

యుక్త వయసులో ఉన్న రోజులు! ఒకసారి అదే స్టేషన్‌కు ఇద్దరు ఆడిపాడే వేశ్యలు వచ్చారు. "నిర్మాణం పనులు జరుగుతున్నాయి. గనుక కూలీలు కూడా చాలా మందే ఉన్నారు. అందరూ వేశ్యలతో పాటకచేరీ పెట్టించమని కోరసాగారు. అక్కడ నేనే అధికారిని గనుక అందుకు నేనే ఏర్పాట్లు చేయవలసి వచ్చింది. రాత్రంతా గాన కచేరీ జరిగింది. రాత్రి మూడు గంటలకు మహాత్మా ఫకీర్ చంద్

రైల్వేపోలీస్ ఇన్స్‌పెక్టర్ ఏదో హత్యానేరం కేసును పరీక్షించేటందుకు ఒంటెపై సవారీ చేస్తూ అక్కడికి వచ్చారు. మా నాన్నగారు రైల్వేలో ఉద్యోగి కనుక నాకాయన తెలుసు. చిన్నాన్నగా భావించేవాణ్ణి. ఆయనను అక్కడ చూస్తే చాలా సిగ్గేసింది. ముఖం దాచుకోవాలను కున్నాను. క్షమించమని అడిగాను. నా తప్పును ఒప్పుకుంటూ నా భార్యను, అమ్మను పంపించమని మా నాన్నగారిని అడిగాను. అలా అయితే నేను తప్పుడు మార్గంలోకి వెళ్ళకుండా ఉంటానని భావించాను" అని చెబుతారు మహారాజ్.

అదే సిలనాబాడీ స్టేషన్‌లో వారి చిన్నాన్న గారి కుమారుడు పండిత్ రామ్ నారాయణ ఉద్యోగం చేస్తున్నాడు. అతడు ప్రాతఃకాలంలోనే నిద్రలేచి స్నానం చేసి, భజన–పూజ చేసి రామాయణం, మహాభారతం చదివేవాడు. అప్పుడు అతని స్వరం మహారాజ్‌గారికి వినిపించేది. క్రీ.శ. 1904లో కాంగడాలో భూకంపం వచ్చింది. ఆ రాత్రి తరువాత ఉదయం ఒక నౌకరు ఆయన ఎదుట ఒక మాంసం గిన్నె పెట్టాడు. చిన్నాన్నగారి కుమారుడు తన కళ్ళు, ముక్కు మూసుకుని రొట్టె పారేశాడు.

ఆ రోజుల్లో చలి విపరీతంగా వుంది. చల్లని నీళ్ళతో స్నానం చేశాక అతడు వణుకుతున్నాడు. నా దృష్టి అతని వైపు మళ్ళింది. వంశగౌరవార్థం, నియమానుసారం నేనతణ్ణి ఎంతగానో ఆదరించేవాడిని. నా కుకర్మలు చూసి అతడేనాడూ తప్పు లెంచలేదు" అనుకుంటున్న మహారాజ్ గారి మనసులో ఆలోచనలు ముప్పిరిగొన్నాయి. ఒకే వంశం వాళ్ళం. అతనిలో, నాలో ఒకే అంశం ఉంది. నేనెటు వెళ్తున్నాను? అతడెటు వెళ్తున్నాడు. అతడు మొట్టమొదట మహారాజ్‌కు గురువుగా పనిచేశాడు. ఇక మహారాజ్ మాంసం తిననని ప్రతిజ్ఞ చేశారు.

మహారాజ్ గారంటారొకచోట – "కొన్ని నెలల తరువాత ఏదో పనిపై నేను గుర్రంపై ఒక ఊరికి వెళ్ళాను. అక్కడ ఒక సర్దారు నా మిత్రుడు. ఒక కోడిపిల్లను బలవంతంగా నాకిచ్చాడు. నేను లోగడ మాంసం తినకూడదని

మనసులో చేసుకున్న ప్రతిజ్ఞ మరిచిపోయాను. నేనా కోడిపిల్లను ఒక నౌకరుకిచ్చి దానిని శుభ్రం చేయమన్నాను. అతడు దానిని శుభ్రం చేసి తెచ్చాడు. అక్కడే ఉన్న మా అమ్మ ఆ చచ్చిపడి వున్న కోడిపిల్లను చూసింది. ఆమె వంటింట్లోకి వెళ్ళి తలుపులు మూసుకుంది. కోడికూర వండడానికి కావలసిన వస్తువులు వంటింట్లో వున్నాయి. "వంటింటి తలుపులు మూసి ఉన్నాయి. అమ్మ లోపలున్నారు" అంది నా భార్య. నేను, నా సోదరుడు రామనారాయణ, నా భార్య తలుపులు తీయాలని ఎంతో ప్రయత్నించాం. కానీ అమ్మ తలుపులు తెరవలేదు. చివరికి ఒక ఇనుపసీకును పెట్టి తలుపులు తెరిచాం. అమ్మ బయటికి వచ్చింది. నేను ప్రేమగా ఆమెను హత్తుకున్నాను. "అమ్మా! ఈ పొగలో నీవు మరణిస్తే నేనేం కావాలి?" అన్నాను. మా అమ్మ గట్టిగా నన్ను దూరంగా నెట్టేసింది. "నా కడుపులో నీ బదులుగా ఒక రాయి పుట్టినా దేనికైనా ఉపయోగపడేది" అంది.

నేను ఆశ్చర్యంగా అడిగాను – "అమ్మా! నా అపరాధం ఏమిటి?" అని. "నీవొక తల్లి సంతానాన్ని చంపేశావు. దాని తల్లికి ఎంతో దుఃఖం కలిగించావు. నీవు నా కొడుకువైనా కొంచెం కూడా మర్యాద, గౌరవాల గురించి నీకు ధ్యాసలేదు. మీ నాన్నగారు మాంసం తింటారని నాకు తెలుసు. కానీ ఆయన భర్త అయి ఉండి కూడా ఎప్పుడూ ఇంట్లో మాంసం వండమనలేదు. తినలేదు." అంది.

అప్పుడు నాకు నా తప్పేమిటో తెలిసింది. నేను మా అమ్మ చరణాలను ముద్దు పెట్టుకుని, "నేను నిజంగానే నీ కొడుకునైతే భావి జీవితంలో ఎప్పుడూ ఏ చెడు పనీ చేయను" అని ప్రతిజ్ఞ చేశాను. అయినా మానసికంగా అప్పుడప్పుడు కొన్ని పతనాలు జరిగాయి" అంటారు మహారాజ్.

తన జీవన స్థితుల గురించి రాస్తూ "ఈ సంస్కారాలు కుసాంగత్యం – సాంగత్య దోషం వల్ల వచ్చాయి. మా నాన్నగారు కూడా మాంసం తినేవారు.." అంటారు మహారాజ్. ఒక మహాపురుషుని సంస్కారాలపై కూడా ఇతరుల స్థితిగతుల సంస్కారాల ప్రభావాలు పడతాయి. ఈ సంస్కారాలు కూడా మన తల్లిదండ్రుల నుండి పొందుతామని నా అనుభవం చెబుతోంది.

5–6 నెలల పాటు మాంసం తిన్నందుకు మహారాజ్ ఎంతో బాధపడ్డారు. నేను పాపినయ్యాను అంటూ దుఃఖంతో ఉండేవారు. రామాయణం, మహాభారతం వినేవారు. వాటిలో రాముడినీ, కృష్ణుడినీ అవతారాలని చెప్పారు. సాధుతత్వం, సంతత్వం, ఫకీర్ సంస్కారాలు ఆయనలో ఉన్నాయి. రాముణ్ణి కలుసుకోవాలని తీవ్రమైన కోరిక కలిగింది. మానవరూపంలో రాముణ్ణి దర్శించుకోవాలని మనసు తహతహలాడసాగింది.

## రాముని అన్వేషణ

రాత్రింబగళ్ళు రామాన్వేషణలోనే ఉండసాగారు. తన దోషాలను తలచుకుని విలపించే వారు. ఈ మధ్యకాలంలో తన ఉద్యోగం వదిలి మరో ఉద్యోగం వెదుక్కోవలసి వచ్చింది. ఇందుకు 15–20 రోజులు పట్టాయి. ఇంకా ఉద్యోగం దొరకకముందే ఆయన జీవనంలో ఒక సంఘటన జరిగింది. వారి తండ్రిగారు బిందా దాదన్‌లో రైల్వే పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసేవారు. జీతం తక్కువ. చిరుద్యోగం, భార్య అనారోగ్యం కారణంగా వారు ఉదాసీనంగా ఉండేవారు. మహారాజ్ గారిలో రామభక్తి మరింత దృఢతరం కాసాగింది. రామలీల ఉత్సవం వచ్చింది. భక్తి భావం వలన రాముని చరణాలలోకి ప్రసాదం సమర్పించాలని కోరిక కలిగింది. తండ్రిగారిని అర్ధ రూపాయి ఇమ్మని అడిగారు. ఆయన ఇవ్వడానికి నిరాకరించాడు. కేవలం రెండు పైసలిచ్చి, కఠోరంగా వ్యవహరించాడు. మహారాజ్ గారి మనసు గాయపడింది: రూపాయి పావలా వెల ఉన్న తన ఆంగ్ల పుస్తకం ( క్యారెక్టర్ స్మైల్) అర్ధ రూపాయికి అమ్మి రాముని పాదాలకు ప్రసాదం అర్పించారు. ఈ సంఘటన ఫలితంగా తను ఇక జీవితంలో ఎవరి ఎదుటా చేయి చాచి అడగనని ప్రతిజ్ఞ చేశారు. దానిని జీవితాంతం ఆచరించారు. ప్రతిజ్ఞా పాలనకు ఇదే ఆదర్శం.

రాముణ్ణి దర్శించాలనే కోరిక లోలోపల పెరగసాగింది. ఈ తపనలోనే ఒకసారి అర్ధరాత్రివేళ బయట తిరుగుతున్నారు. ఏడుస్తున్నారు. “ఓ రామా! నీవు నాకు లభించు. దర్శనమివ్వు” అని వేడుకుంటూ విలపించారు. ఆ స్థితిలో ఒక

తేజస్వి అయిన సాధువు దర్శనమైంది. "నీ రాముడు నీ కోసం మానవ రూపంలో వచ్చాడు" అని ఆయన విశ్వాసం కలిగించాడు.

కొన్నాళ్ళ తరువాత మహారాజ్ గారు బాగాన్‌వాలా స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తున్న సమయంలో రాముణ్ణి కలుసుకోవాలనే తపనతో 24 గంటలు ఎడతెరిపి లేకుండా ఏడవసాగారు. "నీ రాముడు మహర్షి శివవ్రత్‌లాల్ వర్మన్ రూపంలో ఉన్నాడు" అని స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో ఆయన చిరునామా కూడా లభించింది. ఆ స్వప్నం కూడా బాహ్య ప్రభావాల పరిణామమేనంటారు వారు ఇప్పుడు. ఎందుకంటే ఏ విచారమైనా, ఆలోచన, భావన, స్వప్నమైనా మనిషి బాహ్య ప్రభావాలు లేనిదే అంతరంలో ఉద్భవించదు అని విశ్లేషిస్తారు. తొమ్మిదినెలలపాటు నిరంతరం ఎడతెరిపి లేకుండా మహర్షిగారికి ఉత్తరాలు రాశారు. జవాబు వచ్చేది కాదు. తపన పెరిగింది. ప్రతిరోజు పోస్ట్ వస్తుందేమోనని ఎదురు చూసేవారు. ఉత్తరానికి సమాధానం రాకపోయేసరికి ఖిన్నులయ్యేవారు. దుఃఖపడేవారు.

తొమ్మిది నెలల తరువాత ఉత్తరానికి జవాబు వచ్చింది. "ఫకీర్! నీ ఉత్తరాలు అందాయి. నేను నీ భక్తి భావాన్ని గౌరవిస్తాను. విలువనిస్తాను. సత్యం, శాంతి బోధలను నేను రాధాస్వామి మతంలో పొందాను. ఇందుకు నీకు అభ్యంతరం లేకుంటే లాహోర్‌కు వచ్చి నన్ను కలుసుకోవచ్చు" అని రాశారాయన.

## గురు దర్శనం - దీక్ష - బోధన - సాధన

మహారాజ్ గారి ఆనందానికి అవధులు లేవు. అది ఉత్తరమా? వారికి అది నవ జీవనం! వెంటనే శలవు ఏర్పాటు చేసుకుని లాహోర్‌కు చేరారు. చిత్తంలో ఒకటే ధ్యాస! ఒకటే ఆలోచన సుళ్ళు తిరుగుతున్నది. తన కాలు రోడ్డుపైన పడుతోందా లేక కాలువలోనా అనేది కూడా పట్టించుకోనంతటి ఉద్వేగస్థితి. చిరునామా కనుక్కుంటూ మహర్షిగారి నివాస స్థానానికి చేరుకున్నారు.

మహర్షి మహారాజ్‌గారి విశాల మస్తకమును, దివ్యమూర్తిని, తన రాముడిని

మానవరూపంలో చూసి గద్గదమయ్యారు.. అత్యధికమైన ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రేమతో హృదయం నిండిపోయింది. నోటివెంట మాట రాలేదు. కొంచెం సేపటి వరకు ఏమీ మాట్లాడలేకపోయారు. కానీ అంతరంగం పదేపదే పిలుస్తోంది.

*ఇశ్క్ కా తేరే కోహే గమ్, సిర్ పర్ లియా జో హో సో హో ।*
*ఏశో నిశాత్ జిందగీ, సబ ఛోడ్ దియా జో హో సో హో ॥*

*అకల్ కే మదరసే సే హో అవుర్ ఇశ్క్ కే మైకదే మే ఆ ।*
*జామే శరాబ్ బే ఖుదీ, అబ్ తో పియా జో హో సో హో ॥*

కాస్సేపటికి తేరుకుని తన శిరస్సును మహర్షిగారి చరణాలపైన ఆనించారు. ఆయన పరమ దయాల్ మహారాజ్‌ను లేవనెత్తి హృదయానికి హత్తుకున్నారు. ఈ సంఘటన క్రీ.శ. 1906 నాటిది.

మహర్షి జీ మహారాజ్ గారు పరమ దయాల్ మహారాజ్‌గారికి దీక్షనిచ్చారు. 'రాధాస్వామి సార్ బచన్, 'పరమ పూజ్య రాయ్ సాహబ్ సాలిగ్ రామ్ మహారాజ్ గారి జీవిత చరిత్ర' చదవడానికిచ్చారు. 'సార్‌బచన్' అనే పోథిలో ఖండనం ఉంది గనుక మహారాజ్ చదవలేదు. కానీ జీవిత చరిత్ర చదవటం వలన గురుభక్తి చేసే పద్ధతి బోధపడింది. ఎక్కడెక్కడ రాధాస్వామి మతం సత్సంగం లభిస్తే వెళ్తూ ఉండమని ఆజ్ఞ నిచ్చారు మహర్షి మహారాజ్. అంతేకాదు "నీవు ఫకీరులలో చంద్రుడవవుతావు" అనీ ఆశీర్వదించారు. మహారాజ్‌గారికి స్వప్నంలో కనిపించినట్లే కుర్తా, కోటు చిలక్కొయ్యకు వేలాడుతున్నాయి. ఇది చూశాక మహారాజ్‌గారి విశ్వాసం మరింత దృఢపడింది.

సత్సంగం విని, నామ దీక్ష తీసుకుని తన ఉద్యోగానికి మళ్ళీ వచ్చేశారు. ప్రతిరోజూ అభ్యాసం చేయసాగారు. అంతరంలో శబ్దం, ప్రకాశం ప్రకటం కాసాగింది. ఆనందం లభించసాగింది. వీలుదొరకగానే లాహోర్ సత్సంగానికి వెళ్ళేవారు. అంతరీయ ఆనందం మరింత పెరిగింది. దీనిని వర్ణించటం అసాధ్యమనవచ్చు. మహర్షిగారి ప్రకాశవంతమైన రూపం ఎల్లవేళలా కళ్ళెదుటే ఉండేది.

మహర్షిగారి వంటి గురువు, పరమ దయాల్ ఫకీర్‌చంద్ మహారాజ్ వంటి శిష్యుడు చరిత్రలో వెదికితే బహుశా దొరకరు. **లోకులు భక్తి చేస్తారు.** మళ్ళీ సమస్యలు చెబుతుంటారు. "మహారాజ్! కామం సతాయిస్తున్నది. మనసు చంచలమై ఉంది. అభ్యాసం కుదరటం లేదు" అంటారు. ఇవన్నీ భ్రమలు. భక్తి తన ముద్రవేసినపుడు, గాఢమైన ప్రభావం చూపినప్పుడు కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారాలు, మనసు చాంచల్యం, ఉదాసీనత అన్నీ గుణకారులుగా, లాభ దాయకాలుగా మారుతాయి.

*దురంగీ ఛోడ్ దే, ఏక్ రంగ్ హోజా ।*
*సరాసర్ మోమ్ హో యా సంగ్ హోజా ॥*

భక్తి, ప్రేమ, ఏకాగ్రత స్వంతమై, గురి కుదిరినప్పుడు ఏ దుఃఖమూ దగ్గరికి రాదు. "ఫకీర్ అభ్యాసం చేస్తూ ఉండు" అన్నారు మహర్షిగారొకసారి.

"మహారాజ్! మీ శరణం పొందాక ఇంకేం మిగిలి ఉంది? ఎక్కడి అభ్యాసం? ఎక్కడి పూజ?" అన్నారు మహారాజ్.

"అది సరే! బాగుంది. కానీ నా ఆజ్ఞను పాటించు. వార్ధక్యంలో అభ్యాసం నీకు సహాయపడుతుంది" అన్నారు మహర్షిగారు.

ఒకసారి మహారాజ్ మహర్షిగారి దర్శనార్థం లాహోరుకు వెళ్ళారు. ఒకవారం రోజులపాటు సత్సంగం జరిగింది. ఆ తరువాత బయలుదేరేముందు మహర్షి గారి చరణాలకు ప్రణమిల్లి, ప్రసాదం తీసుకుని వెళ్ళిపోయారు. చన్‌గఢ్ మొహల్లా వద్దకు రాగానే మరొకసారి మహర్షి మహారాజ్ దర్శనం చేసుకోవాలనిపించింది. వెనక్కి వెళ్ళారు. మళ్ళీ వచ్చిన మహారాజ్‌ను చూసి, "ఫకీర్! ఎందుకు తిరిగి వచ్చావు?" అడిగారు మహర్షి.

"మహారాజ్! ఒకసారి మళ్ళీ మీ దర్శనం చేసుకోవాలన్పించి వచ్చాను" జవాబిచ్చారు పరమ దయాల్ మహారాజ్.

"దర్శించుకున్నావు కదా! ఇక వెళ్ళు" అన్నారు మహర్షిగారు.

అక్కడి నుండి బయల్దేరారు మహారాజ్. అనార్కలీకి వచ్చాక మళ్ళీ గురువు

దర్శనం చేసుకోవాలన్పించింది. ఎంతో తపన కలిగింది. మళ్ళీ లాహోర్‌కి మహర్షి జీ వద్దకు వచ్చారు.

"ఎందుకొచ్చావు?" అడిగారు మహర్షిగారు.

"దర్శనం కోసం" జవాబిచ్చారు మహారాజ్. "మంచిది. దర్శనం చేసుకో. వెళ్ళు. ఇప్పుడే మళ్ళీ రావద్దు."

పరమ దయాల్ జీ మహారాజ్ బయలుదేరారు. కొంతదూరం వెళ్ళాక అనార్కలీలో కలిగినంత దర్శనాపేక్ష కంటే మరెంతో ఎక్కువ అభిలాష కలిగింది. తహతహను అణచుకోలేక వెనుదిరిగి మళ్ళీ మహర్షిగారి దగ్గరికి వచ్చారు.

"ఎందుకొచ్చావు?" అడిగారు మహర్షిగారు.

"మహారాజ్! దర్శనం కోసం"....

మహర్షిగారు ముసిముసిగా నవ్వి, మేనేజర్‌ను పిలిచి, "ఈ పిచ్చి ఫకీర్‌ను టాంగాకు కట్టేసి స్టేషన్‌కు తీసుకువెళ్ళి, రైల్లో కూర్చోబెట్టి రా" అన్నారు. అతడు అలాగే చేశాడు. రైలు కదిలే వరకు ఉండి వచ్చాడు. తరువాతి స్టేషన్ రాగానే రైలు దిగి మహర్షిగారి దగ్గరికి వచ్చేశారు మహారాజ్.

మహారాజ్‌గారి భక్తి, ప్రేమలకు మహర్షిగారెంతగానో ప్రభావితులయ్యారు. ముగ్ధులయ్యారు. వేలాది శబ్దలు ఫకీర్ పేరిట రాశారు. అందులోనుండి ఒకటి, రెండు కింద ఇస్తున్నాం. వీటి వలన మహర్షి గారు మహారాజ్‌గారి భావనలకు ఎంతగా విలువిచ్చారో, గౌరవించారో తెలుస్తుంది. మహారాజ్ గురించి మహర్షిగారి భవిష్యవాణి ఏమిటి?

***జో ఫకీర్ మోహె దర్శన్ దేవే, అపనా భాగ్ సరాహూఁ ।***
***అపనీ తన్ కీ చామ్ కీ జూతీ, పగ్ ఫకీర్ పహనావూఁ ॥***

***మై నహీఁ రామ కృష్ణ కా సేవక్, ఈశ్ బ్రహ్మా నహీఁ జానూఁ ।***
***మై ఫకీర్ కా నామ దీవానా, సబ్ సే బఢకర్ మానూఁ ॥***

***

*తేరా రూప హై అద్భుత్ అచరజ్, తేరీ ఉత్తమ దేహీ ।*
*జగకల్యాణ జగత్ మే ఆయా, పరమ దయాల్ సనేహీ ॥*

*తూతో ఆయా నర దేహీ మే, ధర్ ఫకీర్ కా బేషా ।*
*దుఃఖీ జీవ కో అంగ్ లగాకర్, లేజా గురు కీ దేశా ॥*

*తీన్ తాప్ సే జీవ దుఃఖీ హై, నిబల అబల అజ్ఞానీ ।*
*తేరా కామ్ దయా కా భాయీ, నామ దాన్ దే దానీ ॥*

ప్రపంచంలో ఈనాటి వరకు తన శిష్యుణ్ణి ప్రశంసిస్తూ ఇలాంటి పదాలు ఏ గురువూ ఉపయోగించలేదు. ఇంతగా పొగిడిన గురువు మరొకరు లేరు. తన స్పష్టమైన మాటల ద్వారా ఆయన గురించి భవిష్యవాణి చెప్పారు మహర్షి. మహారాజ్ ఎంతటి మహాపురుషుడో ఇది రుజువు చేస్తుంది.

ఒకసారి దర్శనార్థం లాహోర్‌కు వెళ్ళారు. అదే సమయంలో మహర్షిగారు ఏదో అవసరమైన పనికోసం బయటికి ఒక్కరే వెళ్ళవలసి వుంది. మహారాజ్ గారితో "నీవొక పనిచేయి. నేను వచ్చేవరకు ఇదే ఆసనంపై కూర్చుని సహజ రీతిలో నామస్మరణ చేస్తూ ఉండు" అన్నారు. మహారాజ్ అక్షరాలా పాటించారు. ఉదయం 9 గంటలకు మహర్షిగారు ఇంటికి తాళం వేసి వెళ్ళిపోయారు. సాయంత్రం 5 గంటలకు వచ్చారు. తలుపు తీశారు. అదే ఆసనంపై ఉదయం కూర్చున్న స్థితిలోనే ఉండి స్మరణ చేస్తున్నారు మహారాజ్. ఇదీ గురువాజ్ఞా పాలన. ఇదేవిధంగా జీవనంలో అన్ని రకాల ఆవశ్యకతలకు తిలాంజలినిచ్చి సాధన అభ్యాసాలు చేశారు మహారాజ్.

మహారాజ్‌గారికి వేతనం తక్కువగా లభించేది. ఇల్లు కష్టంగా గడిచేది. దీనిని ఇంతకుముందు కూడా ప్రస్తావించటం జరిగింది. స్టేషన్ మాస్టర్‌గా ఉండే డ్యూటీ సమయం ముగిశాక భట్టీ నుండి ఇటుకలు తీసే పని చేయసాగారు. లంచం తీసుకోవటం తప్పనుకోకుంటే ఈ పనులేమీ చేయకున్నా హాయిగా గడిచేది. స్టేషన్‌లోని ఇతర ఉద్యోగులు లంచాలు తీసుకునేవారు. కానీ మహారాజ్ ఏనాడూ ఒక్కపైసా కూడా తీసుకోలేదు. ఇతరుల గురించి ఎన్నడూ ఒక్కచెడు మాట కూడా నోటి నుంచి రానీయలేదు. మహారాజ్ ఎప్పుడూ తోటివారి

సద్గుణాలను చూసేవారు. దోషాలను చూడటం, నిందించటం మహారాజ్ గారి స్వభావంలో లేదు. భగవంతుని దయ తన భక్తులను సంరక్షిస్తుంది. కాపాడుతుంది. సహాయపడుతుంది. ఆయన దయను ఎవరైనా అనుభవించటం, అనుభవించకపోవటం వేరే విషయం.

మహారాజ్‌గారు మదర్సా స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌గా పనిచేసే రోజుల్లో ఓ రోజు డ్యూటీ ముగిశాక అడవి నుండి గడ్డికోసుకుని తన తలపై పెట్టుకుని వస్తున్నారు. దారిలో రైల్వే (స్టేషన్‌ను పర్యవేక్షించేటందుకు వచ్చిన) ఆఫీసర్లు మహారాజ్ గారిని చూశారు. సాయంత్రం డ్యూటీకి వచ్చిన మహారాజ్ గారిని చూసి "రైల్వే డిపార్ట్‌మెంట్ పరువు తీశావు కదయ్యా!" అన్నాడు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్. అంతేకాదు "నీ పొజిషన్ ఏమిటో గుర్తుపెట్టుకోవా?" అనీ అడిగాడు.

ఆయనకు సమాధానంగా "ఒక వైస్రాయ్ తన బూట్లు తాను శుభ్రపరచుకునేవాడు. డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ సూపరింటెండెంట్‌గా పనిచేసే శ్రీ మాక్ పర్‌లీన్ తన చెప్పులను తనే బాగు చేసుకునేవాడు. మరమ్మత్తు చేసుకునేవాడు. ఒక ముసల్మాన్ పాదుషా కురాన్ శరీఫ్‌ను తన చేతితో స్వయంగా రాసి అమ్మించి పొట్టపోసుకునే వాడు" అన్నారు మహారాజ్ గారు.

ఆ అధికారి మౌనంగా చూస్తుండిపోయాడు.

ఇంతేగాదు. మహారాజ్‌గారు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ అయి వుండీ ఇంటి ఖర్చుల కోసం స్టేషన్‌లో కూలీ పని చేసేవారు. అప్పుడప్పుడు రెండు పైసల శనగలు తిని భోజనం ముగించేవారు. స్టేషన్ మాస్టర్ అయి వుండీ ఏ బంధువునైనా డ్యూటీ సమయం ముగిశాక రైలు ఎక్కించవలసివచ్చి స్టేషన్ లోపలికి వెళ్తే ఎల్లప్పుడూ ప్లాట్‌ఫార్మ్ టికెట్ తీసుకుని మరీ వెళ్ళేవారు. ఆయన నిత్య జీవితంలో సత్యానికి, న్యాయానికి సాక్షాత్తు ప్రతిరూపమని, ఆదర్శ జీవనానికి ఉదాహరణ అని ఇలాంటి కొన్ని సంఘటనల వలన తెలుస్తున్నది.

ఆయన లంచం తీసుకునే వాడు కాదు. ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. మహారాజ్ తండ్రిగారు బాధపడి మహర్షిగారి దగ్గరికి లాహోర్‌కు వెళ్ళారు.

పాదాలకు మొక్కి ప్రసాదం సమర్పించారు. "పండిత్ జీ! ఇలా వచ్చారేం?" అని మహర్షి గారు అడిగారు. అయన ఒక చురకత్తి తీసి ఎదుట పెట్టి "మీరు దీనితో నా పొట్టలో పొడవండి" అన్నాడు. "మీరెందుకు బాధపడుతున్నారు? మీ దుః ఖానికిగల కారణం ఏమిటి? ఏం కావాలని కోరుకుంటున్నారు?" అని అడిగారు మహర్షి. "ఇల్లు గడవటం కష్టంగా వుంది. ధనం కావాలి" "ధనం లభిస్తుంది. ఇంకేం కావాలి?" అన్నారు మహర్షి జీ. "సంతానం మంచివారు, గౌరవనీయులు, పరువు గలవారు కావాలి" "మీకు గౌరవం లభిస్తుంది. సంతానం కూడా శ్రేష్టులవుతారు. ఎంతో ఉన్నతిని పొందుతారు. ఇంకేం కోరుకుంటున్నారు?" "మా సేవ చేయాలి."

"అలాగే అవుతుంది. వెళ్ళు" అన్నారు మహర్షి. ఆయనకు మహర్షి గారి పట్ల ఎంతగానో విశ్వాసం పెరిగింది. ఇక మరెన్నడూ ఏ ఫిర్యాదూ చేయలేదు.

మహర్షిగారి వచనాలు సత్యమయ్యాయి. ఆయనకు ఎంతో గౌరవాదరాలు లభించాయి. సంతానం మంచివారై, ధనవంతులై లబ్ధ ప్రతిష్ఠులయ్యారు. పరమ దయాల్ మహారాజ్‌గారి భార్య స్వర్గస్తురాలైంది. రెండవ వివాహం నిర్ణయించారు. ఆదాయం తక్కువగా ఉంది. డబ్బు ఏర్పాటు కాలేదు. మహారాజ్ తన అత్తవారికి ఉత్తరం రాశారు. తన దగ్గర ప్రస్తుతం డబ్బులేనందున వివాహం చేసుకోలేనని స్పష్టం చేశారు. పెళ్ళికి ముహూర్తం కూడా అంతకుముందే నిర్ణయించినందున ఇప్పుడీ పెళ్ళిని రద్దుచేసి దాటవేస్తే పరువుపోతుంది. ఈ విషయం మహారాజ్ తండ్రిగారు మస్తరాం గారికి తెలిసింది. తపాలాఫీసుకు వెళ్ళి రిజిస్టరు చేసిన ఉత్తరం తీసేసి ఆ కవరులోనే మరోరకమైన ఉత్తరం రాసి పెట్టేశారు.

భగవంతుని దయ వలన ఆనాటి రాత్రికి ఒక వ్యక్తి వచ్చాడు. అతడు లోగడ మహారాజ్ దగ్గర ఉద్యోగం చేశాడు. ఐదువందల రూపాయలు మహారాజ్ ఎదురుగాపెట్టి "మీరీ డబ్బును మీ వద్ద ఉంచండి. నాకు అవసరమైనప్పుడు తీసుకువెళ్తాను" అన్నాడు. ఇలా వారి పనులన్నీ పూర్తయ్యాయి.

మహారాజ్ శెలవు పెట్టి ఇంటికొచ్చారు. డబ్బు తండ్రిగారి కిచ్చారు. పెళ్ళి

పనులు మొదలయ్యాయి. కానీ బరాత్ బయల్దేరే సమయానికి ఒకరోజు ముందు పైకం ఖర్చయిపోయిందని తెలిసింది. ఖర్చులకు డబ్బు కావాలన్నారు. మహారాజ్ బాధపడ్డారు. ఎక్కడ నుండీ డబ్బు వచ్చే సూచనలు, మార్గాలు లేవు. ఇంటి నుండి బయటికి వచ్చారు. అకస్మాత్తుగా ఒక యువకుడొచ్చాడు. లోగడ ఇతడు మహారాజ్‌గారితో కలిసి చదువుకున్న సహపాఠి. "ఎందుకు ఉదాసీనంగా ఉన్నావు?" అడిగాడు అతడు. మహారాజ్ తన పరిస్థితిని వివరించారు. ఆ యువకుడు శ్రీమంతుడు. వెంటనే జేబులోనుండి ఎనభై రూపాయలు తీసి మహారాజ్‌కిచ్చి "వీలున్నప్పుడు మళ్ళీ ఇచ్చేద్దువుగానీ ప్రస్తుతం ఇవి ఖర్చు పెట్టుకో" అన్నాడు. బుద్ధి జీవులు దీనిని ఆకస్మిక సంఘటనగా అర్థం చేసుకుంటారు. కానీ విశ్వాసం కల భక్తులకు భగవంతుడు ఏవిధంగా తన భక్తుల కష్టాలను దూరం చేస్తాడనేది తెలుసు. తలుపు తట్టు. తెరుచుకుంటుంది. అడుగు లభిస్తుంది. అయితే అడగడానికి కూడా ఒక పద్ధతి ఉండాలి. మనసులో సత్యసంధత, అర్హత ఉండాలి.

పరమదయాల్ జీ మహారాజ్‌లో భక్తి భావం అధికంగా వుంది. కొన్నిసార్లు ప్రేమలో నిమగ్నమై కాళ్ళకు గజ్జెలు కట్టుకొని నర్తించేవారు. విశ్వాసం దృఢంగా, ప్రబలముగా వుంది. ప్రేమ, సత్యమైన విశ్వాసం వారి ప్రతి కష్టాన్ని, సమస్యను దూరం చేసింది.

*గురు సమరథ్ సిర్ పర్ ఖడే, కాహి కమీ తోహి దాస్ ।*
*రిద్ధి సిద్ధి సేవా కరేం, ముక్తి న ఛాండే పాస్ ॥*

మలక్‌బాల్‌లో రాధాస్వామి మత సత్సంగం జరుగుతుండేది. అక్కడి సత్సంగీయులు సర్కార్ సాహబ్ శిష్యులు. శబ్ద పఠనం జరిగేది. దాని వ్యాఖ్యానం చేయబడేది. మహారాజ్‌కూడా అక్కడికి వెళ్ళసాగారు. కొన్నిరోజుల తరువాత ఈయన మహర్షిగారి శిష్యుడని వారికి తెలిసింది. "వక్త్ గురు – సమయపు గురువు ఒక్కడే ఉంటాడు. అది సర్కార్ సాహబ్. ఆయన తప్ప ఇంకెవరూ సమయపు సద్గురువు కాజాలదు" అన్నారు వారు. మహారాజ్ మనసు గాయపడింది.

చివరికి "నేను పరమాత్మకు ఉత్తరం రాస్తాను. అది ఆయనకు పంపించాలి. ఏ జవాబు వచ్చినా అది ఇద్దరికీ అంగీకారం కావాలి" అని నిర్ణయించారు. మహారాజ్ రోదించి రోదించి ఒక పెద్ద ఉత్తరం రాశారు. దానిని మూసి సర్కార్ సాహబ్ వద్దకు పంపించారు. 15 రోజుల తరువాత సర్కార్ సాహబ్ శరీరం త్యజించారని జవాబు వచ్చింది. ఈ జవాబు పరమ దయాల్ జీ మహారాజ్ సంతుష్టి పడడానికి చాలు. ఆ తరువాత ఆయన అక్కడికి వెళ్ళటం మానేశారు.

మ్యానీ స్టేషన్‌లో పరమ దయాల్ జీ మహారాజ్ అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా ఉన్నరోజుల్లో రాత్రి 12 గంటలకు మేల్కొని ఉంటూ విధులు నిర్వహించవలసి వచ్చేది. పగటి సమయంలో కూడా పూర్తిగా విశ్రాంతి లభించేది కాదు. ఎందుకంటే సరుకుల బుకింగ్ – నమోదు కోసం స్టేషన్ మాస్టరుకు సహాయపడవలసి వచ్చేది. ఇలాంటి రోజుల్లో రాత్రంతా మేల్కొనటం కష్టంగా ఉండేది.

రాత్రి 10 గంటలకు మ్యానీ నుండి ఫేరాకు ఒక రైలు వెళ్తుండేది. ఉదయం 5 గంటలకు తిరిగి వచ్చేసేది. అనుకోకుండా మహారాజ్‌కు నిద్రనుండి ఓ నాటి రాత్రి మెలకువ రాలేదు. లైన్ క్లియర్ లేకుండానే రైలు మ్యానీకి వచ్చేసింది. దీనిపై ఆరా మొదలైంది. మహారాజ్ తన తప్పును ఒప్పుకొని 12 గంటల రాత్రి నిద్రలేవటం కష్టమనీ, కునుకు పట్టిందనీ చెప్పారు. రైల్వేశాఖ యాజమాన్యం మూడు రూపాయల జరిమానా అపరాధం రుసుం విధించింది.

రాత్రి నిద్రలేవటం కష్టమవుతోందని పదిగంటల రైలు ఫేరాకు వెళ్ళడానికి అనుమతిని ఇచ్చి ఉదయం ఐదుగంటలకు తిరిగి వచ్చేటప్పుటికి ఇవ్వవలసిన లైన్‌క్లియర్ ఇప్పుడే ఇవ్వసాగారు. ఇలా కొంతకాలం గడిచింది. కానీ అకస్మాత్తుగా ఓ రోజు ఫేరా స్టేషన్ మాస్టర్ ఉదయం ఆలస్యంగా నిద్రలేచినందున రైలు ఒక గంట ఆలస్యంగా బయల్దేరింది. రైల్వేశాఖ మళ్ళీ కారణాలు పరిశోధించింది.

రాబోయే రైలుకు రాత్రిపూటే అనుమతినివ్వటం చట్ట విరుద్ధం. మహారాజ్ సహచరులు కొందరు నిజం చెప్పొద్దని సలహానిచ్చారు. వారి తండ్రిగారు కూడా వత్తిడి చేశారు. కానీ ఆయన ఎవరి మాటా వినలేదు. జరిగినదంతా ఉన్నదున్నట్లు

చెప్పారు. రైల్వే అధికారులు ఆయన సత్య సంభాషణకు ప్రభావితులై సాధారణ హెచ్చరికతో వదిలేశారు. ఖేరా స్టేషన్ మాస్టర్‌ను తార్‌బాబూ పదవినిచ్చి బదిలీ చేశారు.

విధి నిర్వహణలో ఇలా ఆయన వల్ల పొరపాట్లు జరిగినా వాటిని దాచే ప్రయత్నమెప్పుడూ చేయలేదు. ఆయన సత్యసంధతను చూసి అధికారులు ఆయనను ఆదరించేవారు. పొరపాట్లను చూసీ చూడనట్లు వదిలేసేవారు. ఉద్యోగ సమయంలో మహారాజ్ వ్యక్తి గత ఫైలులో (Most Honest man in Railways) రైల్వే విభాగంలో అత్యంత నిజాయితీ పరుడైన వ్యక్తి అని రాసేవారు.

మ్యానీలో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా ఉన్న రోజుల్లో ఆ ఊళ్ళో నిప్పంటుకుంది. ఇది 1907లో జరిగిన సంఘటన. కష్టమెదురైనా లెక్కించక ఆ మంటలు ఆర్పేటందుకు ఎంతగానో సహాయపడ్డారు మహారాజ్ . ఇంకా అదనపు సహాయం కోసం టెలిగ్రాములిచ్చి ఖేరా నుండి సహాయం రప్పించారు. ఎందుకంటే ప్లేగు వ్యాపించినందున ఇంతకుముందే నగరం ఖాళీ అయింది. మహారాజ్‌గారి సేవకు సంతోషించిన జిల్లా డిప్యూటీ కమిషనర్ ఒక సలహా ఇస్తూ నగరంలో విరాళాలు పోగుచేసి మహారాజ్ కివ్వాలని నిర్ణయించాడు. రూపాయలు వసూలయ్యాయి. కానీ మహారాజ్ వాటిని తీసుకోవడానికి నిరాకరించి ప్రజలకు సహాయమందివ్వటం తన కర్తవ్యం అన్నారు. డిప్యూటీ కమిషనర్ మహారాజ్ నిస్వార్థ గుణానికి ఎంతో మెచ్చుకుని పొగడ్తలతో ముంచెత్తారు.

ఒకచోట మహారాజ్ స్వయంగా ఇలా రాశారు – "1907లో నేను మియానీ స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌గా పనిచేసే వాడిని. ఒకరోజు రైలు ఖేరా నుండి మ్యానీ స్టేషన్‌కు వచ్చినప్పుడు టికెట్లు తీసుకోవడానికి నేను గేటు దగ్గర ఉన్నాను. ఆ రైల్లో నుండి పెళ్ళి దుస్తులలో ఉన్న ఓ అందమైన యువతి దిగింది. ఆ అమ్మాయి టికెట్ ఇస్తున్నప్పుడు నా దృష్టి ఆమె వైపు ప్రసరించింది. ఆ క్షణాన నా మనసు చలించింది. నా మనసును అదుపు చేయడానికి ఎంతగానో ప్రయత్నించాను.

కానీ అది నియంత్రణలోకి రాలేదు.  నన్ను నేను చెంప దెబ్బ కొట్టుకున్నాను. సంఘటన వచ్చింది.  పోయింది. రెండు రోజుల తరువాత మా అమ్మ "నీవు మొన్నటిరోజున టికెట్ తీసుకునేటప్పుడు నీ ముఖాన్ని ఎందుకు కొట్టుకున్నావు?" అని అడిగింది. నేను సిగ్గుపడ్డాను.  'ఈ విషయం నీకెవరు చెప్పారమ్మా' అని అడిగాను.  "నాకు ఆ అమ్మాయి తెలుసు.  తనే చెప్పింది" అంది.  నేను లజ్జితుడనయ్యాను.  "నీ ప్రశ్నకు జవాబు చెప్పదలచుకోవటం లేదు" అన్నాను. అందుకే "ఈ మనసు చాలా చంచలమైనదీ, విచిత్రమైనదీ" అంటాను.  ఒక్క క్షణం ఒకలా, మరోక్షణంలో మరొకలా ఉంటుంది.

## బసరా బగ్దాద్‌లో ఉద్యోగం

యుద్ధ కాలం.  పశ్చిమ ఆసియాలోని కొంత భాగం వారి ఆధీనంలోకి వచ్చింది.  దేశం దాటి వెళ్ళడానికి ఎవరూ ఇష్టపడలేదు.  వెళ్తున్నవారంతా మళ్ళీ వస్తామనే ఆశ వదులుకునే వెళ్తున్నారు.  భగవదేచ్ఛ వలన మహారాజ్‌కు బసరా బగ్దాద్‌కు వెళ్ళి ప్రభుత్వ ఉద్యోగ విధులు నిర్వహించవలసి వచ్చింది. చిత్తంలో ఉదాసీనత నిండింది.  కుటుంబ సభ్యులు బాధపడ్డారు.  ఆయన దాతా దయాల్ మహర్షి మహారాజ్ దగ్గరికి లాహోర్‌కు వెళ్ళారు.  ఇది 1916 నాటి మాట. విషయం వివరించారు.  అంతా విన్న దాతాదయాల్ మహర్షి మహారాజ్ "ఫకీర్! చింతించకు.  దైవేచ్ఛ నిన్ను ఏదో లక్ష్యం కోసమే అక్కడికి పంపిస్తున్నది.  వెళ్ళు. భగవంతుడే రక్షిస్తాడు" అన్నారు.  చిత్తంలోకి ధైర్యం వచ్చింది.  తరువాత మహారాజ్ బసరా బగ్దాద్‌కు చేరుకున్నారు.

అక్కడ 12 సంవత్సరాలున్నారు.  వారి ధర్మపత్ని భారతదేశంలోనే ఉంది. బ్రహ్మచర్య పాలన జరిగింది. సాధన –అభ్యాసం కొనసాగింది. పని వేళల్లో పనిచేసేవారు. మిగతా సమయం సాధన అభ్యాసంలో గడిపేవారు.  చిత్తం ఏకాంత ప్రియత్వాన్ని పొందింది.  గంటల తరబడి సమాధి స్థితిలో ఉండసాగారు. శబ్ద ప్రకాశాల వర్షం కురియసాగింది.  ఎప్పుడైనా రాత్రి సమయంలో సమాధి నుండి మేల్కొన్నప్పుడు అంతరీయ ప్రకాశం వలన గది అంతటా చాలాసేపటి

వరకు ప్రకాశం నిండి కన్పిస్తుండేది. తన అభ్యాస స్థితి గురించి మహర్షి మహారాజ్‌కు రాసేవారు. జవాబు లభిస్తుండేది. ఎలా ఎలా ఆనందం పెరగసాగిందో అలాగే మహర్షి మహారాజ్ చరణాలపై ప్రేమ పొంగిపొర్ల సాగింది. ఆనంద స్థితి ఎలా ఉందంటే ఆయన కేవలం రెండే విషయాలతో సంబంధం పెట్టుకున్నారు. ఒకటి ఉద్యోగ నిర్వహణ. రెండవది అంతరీయసాధన. ఉద్యోగ బాధ్యతల సమయం ముగియగానే ఇంటికి వచ్చి ధ్యానంలో నిమగ్నమయ్యేవారు. 12 సంవత్సరాలు బస్రా నగరంలో ఉన్నారు గానీ బసరా బగ్దాద్ నగరంలోకి వెళ్ళి చూడలేదు. నేటివరకు నగరం ఎలా ఉంది, బజారు ఎలా ఉంది? సుప్రసిద్ధమైన ప్రదేశాలు ఏవి అనేవి తెలియవు.

ఒక బిందువుపై నిల్చున్నారు. నిర్ణయం మనసుది. అంతే! ఆనంద స్థితిలో తన వేతనమంతా మహర్షి మహారాజ్‌కు పంపించసాగారు. అనేక సంవత్సరాలు ఈ స్థితే కొనసాగింది. మరొకరెవరైనా అయితే ఆనందంగా జీవితం గడిపేవారు. మహారాజ్ సంపాదించి పంపుతూ ఉంటే మహర్షిజీ మహారాజ్ అందులోనుండి ఒక్కపైసా కూడా తీసుకునేవారు కాదు. వెంటనే ఆ పైకాన్ని తపాలాఫీసులో జమ చేసేవారు. మహారాజ్‌గారి అవధులు దాటిన ప్రేమను చూసి ముసిముసిగా నవ్వుకునేవారు. ఇరవై వేల రూపాయలు పోగయ్యాయి. మహారాజ్ తిరిగి వచ్చాక మహర్షిజీ మహారాజ్, "ఫకీర్! ఈ రూపాయలను నీవు నాకు అర్పించావు. వీటిపై ఇప్పుడు నీకు ఏ హక్కూ లేదు" అని ఆ రూపాయలను మహారాజ్‌గారి ధర్మపత్ని మాతా భాగవతీ దేవి పేరిట తంతి తపాలా కార్యాలయంలో జమ చేశారు. అంతేకాదు. "ఈ డబ్బులో నుండి ఒక్క పైసా కూడా ఫకీర్‌కు ఇవ్వద్దు. అతడు తన సంపాదన కొనసాగిస్తాడు" అని ఆదేశించారు.

మహారాజ్ బసరా రైల్వేస్టేషన్‌లో శెబా స్టేషన్‌లో పనిచేసేవారు. మిలిటరీ కారణంగా పని ఎక్కువగా ఉండేది. ఆయన తన పనిని సత్యసంధతతో నిజాయితీగా, సరైన రీతిలో చేసేవారు. పొరపాటు చేయాలనుకునేవారు కాదు గానీ జరిగిపోయేది. మహారాజ్ వ్యాకులపడ్డారు. తప్పు చేయాలనుకోకున్నా

జరుగుతున్నది. ఎందుకలా జరుగుతోందని బాధ పడసాగారు. ఏ విషయమూ అర్థం కాలేదు. వివశులై స్టేషన్‌లోని ఓ ప్రత్యేక రిజిస్టర్‌పై (why a man makes mistake) అనగా మనిషి ఎందుకు తప్పు చేస్తాడు అని రాశారు.

ఒకసారి కర్నల్, ట్రాఫిక్ మేనేజర్, డిస్ట్రిక్ ట్రాఫిక్ సూపరింటెండెంట్ స్టేషన్‌కు తనిఖీ చేయడానికి వచ్చారు. ప్రతి రిజిస్టరుపైన ఇంగ్లీష్‌లో మనిషి తప్పెందుకు చేస్తాడు? అని రాసి ఉంది. ఇనస్పెక్షన్ తరువాత వారు "ఇలా ఎందుకు రాశారు?" అని మహారాజ్‌ను అడిగారు. "నేను తప్పు చేయాలనుకోను, కానీ అవుతున్నది. దీనికి కారణం చెప్పగలరా?" అని నిర్భయంగా అడిగారు మహారాజ్. ఈ జవాబు విని వాళ్ళు నవ్వసాగారు.

వచ్చిన అధికారులు తమ తమ కార్యాలయాలకు బస్రాకు వెళ్ళిపోయారు. టెలిఫోన్ చేసి మహారాజ్‌ను పిలిచి, "మీ జీతం ఎంత?" అని అడిగారు. ఆ రోజుల్లో మహారాజ్ 'ఏ' గ్రేడ్‌లో ఉన్నారు. తన వేతనం ఎంతో చెప్పారు. ఆయన ఫోన్లోనే ఒక వంద రూపాయలు పెంచుతూ తరువాత వచ్చే గ్రేడ్‌కు పదోన్నతి నిచ్చారు. అంతేకాదు, మహారాజ్‌ను "మీకు ప్రత్యేక పదోన్నతి ఎందుకివ్వబడిందో తెలుసా?" అని అడిగారు. "నాకు తెలియదు" అని బదులిచ్చారు మహారాజ్. "ఎందుకంటే నీతో తప్పులు జరుగుతాయి గనుక" అన్నాడు ఆఫీసర్.

మహారాజ్ తన జీవితంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేవారు. సత్యమే మాట్లాడేవారు. ఎవరికైనా సహాయం అవసరమైతే సంతోషంగా సహాయం చేశారు. బగ్దాద్ రైల్వేలో మిస్టర్ మాస్కల్ టెలీగ్రాఫ్ సూపరింటెండెంట్‌గా ఉండేవాడు. వివాహం కోసం ఇంగ్లండ్‌కు వెళ్ళాలనుకుంటున్నాడు. కానీ రైల్వే ట్రాఫిక్ మేనేజర్‌తో వైరం ఉంది. హాని చేయడానికి సాకు కోసం చూస్తున్నాడు. ఈ సాకు చెప్పి మాస్కల్‌ను ఉద్యోగంలో నుండి తీసేయాలని చూశాడు. మిస్టర్ మాస్కల్ చాలా జాగ్రత్తగా కాలం గడుపుతున్నాడు. మహారాజ్‌తో అతడు, "నేను ఇంగ్లండ్‌కు వెళ్ళిపోతే ట్రాఫిక్ మేనేజర్ శత్రుత్వం వెళ్ళగక్కుతూ నన్ను ఉద్యోగంలో నుండి తీసేస్తాడు. ఈ పని చేయడానికి నీవు సమర్థుడవైన టెక్నికల్ హ్యాండ్‌వు గనుక

నా స్థానంలో నిన్ను నియమిస్తాడు" అన్నాడు. "మీరు నిశ్చింతగా విదేశాలకు వెళ్ళిరండి. నేను ఈ పదవిని స్వీకరించను" అని మాట ఇచ్చారు మహారాజ్. మహారాజ్‌కు అతని విధులు అప్పగించారు. ఏ విషయం గురించి మాస్కల్ భయపడ్డాడో ఆ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కొన్నిరోజుల తరువాత ట్రాఫిక్ మేనేజర్ మిస్టర్ బోర్నే మహారాజ్‌ను పిలిచి చిరునవ్వుతో "సూపరింటెండెంట్ పదవి నీకు ఇస్తున్నాను సంతోషంగా స్వీకరించు" అన్నాడు. అప్పుడు మహారాజ్‌గారి వేతనం మూడు వందల రూపాయలుండేది. సూపరింటెండెంట్ పదవి లభిస్తే 500 రూపాయలవుతుంది. అధికారి ఇస్తానన్న ప్రమోషన్‌ను నిరాకరిస్తూ "నేను మిస్టర్ మాస్కల్‌కు మాట ఇచ్చాను. కనుక నేనీ పదవిని స్వీకరించలేను" అన్నారు మహారాజ్. కొన్ని రోజులకు మిస్టర్ మాస్కల్ తమ ఉద్యోగానికి వచ్చేశాడు. ఈ సంఘటన తరువాత ఆంగ్లేయులలో మహారాజ్ పట్ల గౌరవం ఇతోధికంగా పెరిగింది. చాలామంది ఆయనను రెండోగాంధీ అనేవారు. ప్రతిజ్ఞాపాలనలో అనగా ఆడినమాట తప్పని విషయంలో ఆయనే అద్భుతమైన ఆదర్శం, ఉదాహరణ.

బాగ్దాద్‌లో ఉండడానికి ఒకసారి మహారాజ్‌కు డేరా-(షామియానా) లభించింది. అందులో అంతకుముందే నలుగురు పంజాబీయులు నివసిస్తున్నారు. మహారాజ్‌కు తలపై పొడవైన వెంట్రుకలు, ముఖం పొడవైన గడ్డంతో ఉంది. మహారాజ్ షామియానాలోకి రావటం వాళ్ళకు నచ్చలేదు. కానీ వారించే పరిస్థితి లేదు. మహారాజ్‌కు షామియానా ద్వారం వద్ద చోటిచ్చారు. నిజానికి మహారాజ్ వారందరిలోకీ పెద్దవాడు. దైవేచ్ఛకు ఆధీనుడై ఉండేవాడు కనుక వాళ్ళు చూపిన స్థలంలోనే తన పడక వేసుకున్నారు. తలుపు దగ్గరే నీళ్ళ కడవను పెట్టేవారు. మహారాజ్ ఆఫీసు నుండి రాగానే వేసవిలో రజాయి కప్పుకొని పడకపైన విశ్రాంతి తీసుకునేవారు. ఎప్పుడైనా దుతారా వాయిద్యం తీసుకుని వాయించేవారు. శబ్దులు గానం చేసేవారు. సమాధి స్థితిలోకి వెళ్ళిపోయేవారు. వారికీ విషయం నచ్చేది కాదు. అక్కడి నుండి మహారాజ్‌ను మరోచోటికి పంపించాలనుకునేవారు. రాత్రింబగళ్ళు మహారాజ్‌ను ఎగతాళి చేయసాగారు. నీళ్ళు బయటికి పోయే మార్గాన్ని మహారాజ్ పడకవైపు చేశారు. మహారాజ్ అన్నీ సహించారు. ఆయన

సహన శక్తి, సత్వ్యవహారం కారణంగా కొన్నాళ్ళకు ఆ నలుగురూ మహారాజ్ ఆజ్ఞాపాలన చేయసాగారు. మరికొన్ని రోజులు గడిచాక మహారాజ్ నుండి నామదానం తీసుకున్నారు.

అధికారి హోదాల్లో ఉన్నప్పుడు మహారాజ్ బయటి ఊళ్ళకు పర్యవేక్షణకు వెళ్ళేవారు. ప్రతి స్టేషన్‌లో అక్కడ సిబ్బంది మహారాజ్‌ను ఎంతో సమాదరించేవారు. సన్మానించేవారు. గౌరవంగా ఆయనను "నాన్నగారూ', 'పితాజీ' అని పిలిచేవారు.

1918లో నేను ఆయన శరణంలోకి వెళ్ళాను. బస్రాలో మహారాజ్‌తో ఉన్నాను. ఆయన పూర్తిగా సామాన్యంగా, నిరాడంబరంగా, విరాగ జీవితం గడిపే వారు. పగటివేళ కార్యాలయంలో పని చేసేవారు. ఎవరి ఆధీనంలో పనిచేసినా ప్రేమగా ప్రవర్తించేవారు. ఇంటికి వచ్చి సమస్త సమయం అభ్యాసంలో వినియోగించేవారు. బస్రాలో అప్పటికి ఇళ్ళు కట్టలేదు. మహారాజ్‌కు ఒక గుడిసె దొరికింది. అందులో ఇంకా ఇద్దరు మద్రాసు వాస్తవ్యులుండేవారు. మహారాజ్ అందులోనే సంతోషంతో నివసించే వారు. వేసవిలో నేలపైన పక్క పరచుకుని రజాయి కప్పుకుని పడుకునేవారు. సమాధి స్థితిలోకి వెళ్ళిపోయేవారు. ఎవరూ ఆయన దగ్గరికి వెళ్ళేవారు కాదు. ఒకరోజు తార్ బాబూ శ్రీ హంసరాజ్ సాయంకాల సమయంలో మహారాజ్ దగ్గరికి వచ్చారు. నీ రాకకు కారణం ఏమిటన్నారు మహారాజ్. ఊరికే వచ్చానన్నాడతడు. "వృధా మాటలకు నా దగ్గర సమయం లేదు" అన్నారు మహారాజ్. ఎందుకంటే ఆ రోజులలో ఆయన సాధనకే అత్యధిక సమయం వినియోగించుకునేవారు. అందుకే ఎవరూ తన దగ్గరికి రావడానికి అనుమతిని ఇచ్చేవారు కాదు.

నా పైన ఆయనకు విశేష కృప ఉండేది. నేను, మహారాజ్ ప్రాతః కాలంలో నాలుగు గంటలకు వాహ్యాళికి వెళ్ళేవాళ్ళం. అక్కడ భజన చేసుకునేవాళ్ళం. నేను ఉదయం, సాయంత్రం మహారాజ్‌కు సేవ చేసేవాడిని. ఆరోజుల్లో భారతీయులందరూ మహారాజ్ గారిని గౌరవంగా చూస్తూ మాస్టర్ అని తలచుకునేవారు, పిలుచుకునేవారు.

ఇరాక్‌లో విప్లవం ప్రారంభమైంది. ఆంగ్లేయులను ఎదిరించాల్సి వచ్చింది. మహారాజ్ ఆ రోజుల్లో ఇరాక్‌లో టెలిగ్రాఫ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. పర్యవేక్షణ - తనిఖీ కోసం వేరే ప్రాంతానికి వెళ్ళారు. ఆ స్టేషన్‌ను శత్రువులు చుట్టుముట్టారు. స్టేషన్‌వద్ద ఆంగ్లేయులు యుద్ధం చేయసాగారు. రక్షణ కోసం సిపాయీల సైన్య సమూహం ఉంది. విరోధులు తంతి తీగలు తెంచేశారు. సందేశాలు- వార్తలు పంపటం ఆగిపోయింది. అరబ్బుల సంఖ్య అధికంగా వుంది. ఆంగ్లేయ సైన్యానికి సహాయం అందుతుందనే ఆశలేదు. రాత్రంతా యుద్ధం జరిగింది. తుపాకీ మందు గుండు సమాప్తమై పోయింది. అరబ్బులు ముందుకు సాగుతూ కనిపించారు. ఓడిపోయే సూచనలున్నాయి. మహారాజ్ కళ్ళు మూసుకున్నారు. దాతా దయాల్ మహర్షి మహారాజ్ అంతరంలో ప్రత్యక్షమై "తుపాకీగుండ్లు కాల్చటం ఆపుమని కమాండర్‌కు చెప్పు" అన్నారు. మహారాజ్ ధ్యానావస్థ నుండి బయటికి వచ్చి సార్జంట్‌గా ఉన్న కమాండర్‌కు యుద్ధం చేయటం ఆపమని చెప్పారు. మిగిలి వున్న తుపాకీ గుండును కాపాడుకుని కేవలం ఎప్పుడో ఒకసారి దానిని ప్రయోగిస్తుండమన్నారు. పరమ దయాల్ జీ మహారాజ్ సలహాను సార్జంట్ కమాండర్ విని ఆచరించాడు. తెల్లవారాక చూస్తే అరబ్బులు ముందుకు సాగడానికి బదులుగా తమ సైనికుల శవాలను తీసుకుని వెనుదిరిగి పోతున్నారు. వీరి సైన్యం ఓటమి నుండి తప్పించుకుంది.

పరమ దయాల్ జీ మహారాజ్ తమ ఉర్దూ పుస్తకంలోని భూమికలో స్వయంగా రాశారు ఇలా -"ఓ రోజు నేనింటికి వస్తున్నాను. అప్పట్లో నాకు దాదాపు 350 రూపాయల వేతనం లభిస్తుండేది. నాలుగువందల రూపాయల సూట్ తొడుక్కున్నాను. మకీనా క్యాంపులో రెండవ నౌక కోసం ఎదురుచూడవలసి వచ్చింది. తెల్లవారి లేచాను. బయట నౌకర్లు వంట చేశారు. పొయ్యిలో ఇంకా నిప్పులున్నాయి. చిల్లం తీసుకొని పొయ్యి దగ్గరికి వెళ్ళేసరికి అక్కడ ఓ పావలా పడి వుంది. నాలుగువైపులా చూస్తే ఎవరూ కన్పించలేదు. పావలా తీసుకొని జేబులో వేసుకున్నాను. క్యాంపు లోపలికి వెళ్ళిపోయాను. హుక్కా తాగుతూ కూర్చున్నాను. కొంచెంసేపటి తరువాత నా చర్యపై నాకే ఆశ్చర్యం కలిగి

చింతించసాగాను. నేను చారానా కోసం ఆకలిగొని ఉన్నానా? పావలా అవసరమే ముంది? ఇదేం లీల అని ఆలోచించసాగాను."

పరమ దయాల్ జీ మహారాజ్ ఒకసారి మహర్షి దాతా దయాల్ జీ దర్శనం, సత్సంగం కోసం లాహోర్‌కు వెళ్ళారు. భక్తి మెండుగా వుంది. ప్రేమ, ఆనందాల ఆవేశంలో అప్పుడప్పుడు పశ్చాత్తాపపడే పనులు చేసే వారు. బజారు నుండి మూడు, నాలుగు డజన్ల కమలాఫలాలు కొనుక్కుని వెళ్ళి మహర్షి దాతా దయాల్ వడిలో కూర్చున్నారు. "ఫకీర్! ఏం తెచ్చావ్?" అడిగారు దాతా దయాల్ మహర్షి మహారాజ్." మహారాజ్! మీకు తినిపించాలని సంత్రాలు తెచ్చాను" అన్నారు మహారాజ్. "సరే! తినిపించు" అన్నారు మహర్షిజీ. మహారాజ్ ప్రేమ మత్తులో మగ్నమైన స్థితిలో సంత్రాల పొట్టు వలిచి తినిపించసాగారు. తెచ్చిన సంత్రాలన్నీ తినిపించారు. మహర్షీజీ "ఇక వెళ్ళు" అని ప్రేమగా ఆజ్ఞాపించారు. మహారాజ్ వెళ్ళిపోయారు. తరువాత పరమ దయాల్‌జీ మహారాజ్‌కు ఓ సత్సంగి ద్వారా జరిగిన విషయం తెలిసింది. పరమ దయాల్ వెళ్ళాక మహర్షీ జీ స్నానాల గదిలోకి వెళ్ళారు. నోట్లో వేలేసి సంత్రాలన్నీ వాంతి చేసుకున్నారు. ఈ విషయాన్ని విన్న మహారాజ్ ఎంతో పశ్చాత్తాపపడ్డారు.

ఒకసారి సత్సంగం కోసం లాహోర్‌కు వెళ్ళారు. బజారులో పీతాంబరం ధోవతి, మంచి కోటు, బూట్లుకొని మహర్షి మహారాజ్ సన్నిధికి చేరారు. "ఫకీర్! ఏం తెచ్చావు?" అన్నారు మహర్షీజీ. తను తెచ్చిన బట్టలు అర్పించి "మీ కోసం బట్టలు తెచ్చాను" అన్నారు. మహర్షీజీ ధోవతి ధరించి, కోటు తొడుక్కున్నారు. "సంతోషమేనా?" అన్నారు మహారాజ్ వైపుచూసి. మహారాజ్ నవ్వేసి, "మహారాజ్! ఈ దుస్తుల్లో మీ ఫోటో తీయంచాలని నా కోరిక" అన్నారు. "సరే పద! ఫోటో స్టూడియోకు" అని బయల్దేరారు. ముందర పరమ దయాల్ జీ, వెనుక నుండి మహర్షీజీ గారు నడవసాగారు. ఫోటో స్టూడియో చాలాదూరంలో ఉంది. వీరిని చూసి బజారులో కొందరు తప్పులెన్ని చూపుతున్నారు. మహారాజ్ ఒక్కటీ వినలేదు. మహర్షి మహారాజ్ పట్టించుకోలేదు. పరమ దయాల్ జీలోని ఆవేశాన్ని

తగ్గించాలనుకున్నారంతే! ఫోటో స్టూడియోలో ఫోటో తీయించుకున్నారు. "పాపం! ఈ ఫకీర్ నా ఫోటో తీసుకోవాలను కుంటున్నాడు" అన్నారు ఫోటోగ్రాఫర్‌తో మహర్షి మహారాజ్. ఆ తరువాత ఇంటికి వచ్చేశారు. "ఫకీర్! సంతోషమేనా" అన్నారు మహర్షి గారు.

**సేవక్ స్వామీ ఏక్ మతి, జో మతి మే మతి మిల్ జాయ్ ।**
**చతురాయీ రీఝే నహీఁ, రీఝే మన్ మే భాయ్ ॥**

అధిక అభ్యాసం, వైరాగ్యం వలన మహారాజ్ ఉదాసీనంగా ఉండసాగారు. ఇక శరీరాన్ని వదిలిపెట్టాలి అనే ఆలోచన వచ్చింది. శలవు తీసుకొని భారతదేశానికి వచ్చారు. ఇది 1921 నాటి మాట. మహర్షిజీ మహారాజ్ దర్శనం కోసం రాధాస్వామి ధామ్‌కు వెళ్ళారు. ఆయన కోసం ఒక సింహాసనం చేయించారు. బంగారు కిరీటం, పొడవైన జరీ అంగీ తొడిగించారు. వెండి హుక్కాను ఎదుట పెట్టారు. వెండి పళ్ళాల్లో ప్రసాదం సమర్పించారు. సత్సంగానికి ముందు మహారాజ్ మహర్షి జీ మహారాజ్‌కు హారతి చేశారు. చేతులు జోడించి తను శరీర త్యాగం చేయగోరుతున్నాననీ, అనుజ్ఞనిమ్మని ప్రార్థించారు. "ఫకీర్! ఇంకా ఆ సమయం రాలేదు. నీ నుండి చాలా పని తీసుకోవలసి వుంది" అన్నారు మహర్షి మహారాజ్.

ఒకసారి పరమ దయాల్ జీ మహారాజ్ మహర్షి గారితో "మీ భోజనం ఖర్చు నేనిస్తుంటాను" అన్నారు. అందుకు జవాబిస్తూ మహర్షి మహారాజ్ "ఫకీర్! ఏమైనా ఇచ్చే హక్కు నీకుంటే నాకు కూడా ఆ హక్కు ఉంది" అన్నారు. ఈ గూఢమైన మాటలను మహారాజ్ అర్థం చేసుకోలేకపోయారు.

మాట తీసుకుని వెళ్ళిపోయారు. ఒక నెల తరువాత 50 రూపాయలు మనీ ఆర్డర్ మహర్షి జీ పేరిట పంపించారు. మహర్షిజీ వాటిని తీసుకుని మరో పదిరూపాయలను తనవి కలిపి మహారాజ్ పేరిట మనీ ఆర్డర్ పంపించారు. మహారాజ్ వాటికి మరో పదిచేర్చి 70/- మనీ ఆర్డర్ మహర్షిజీకి పంపించారు. మహర్షిజీ వాటికి మరో పది చేర్చి 80/- మహారాజ్‌కు పంపించారు. ఇలా చాలాసార్లు జరిగింది. అవిప్పుడు 150/- రూపాయలయ్యాయి. తన లక్ష్యం

నెరవేరకపోగా తపాలా కార్యాలయానికి కమిషన్ వృధాగా పోతున్నదని గ్రహించి పంపటం ఆపారు. మహర్షి మహారాజ్ పరమదయాల్ జీ కి ఓ లేఖ రాస్తూ ఇలా అన్నారు.

*లాలచీ క్యా సమ్ వ జర్ కా తూనే సమఝా హై ఫకీర్ ।*
*మై అజల్ సే బన్ కే ఆయా హూం అమీర్ ॥*

*ఆ గయా హోతా తో చిమటా లేతా గోద్ సే ।*
*అజల్ నే తేరీ ఉల్ఫత్ మే కర్ దియా ముఝ్ కో అసీర్ ॥*

ఇలా ఆట ఆడించి మహర్షి మహారాజ్ పరమ దయాల్ మహారాజ్‌గారి ప్రతి భావావేశాన్ని తొలగించారు. మహారాజ్ అప్పుడప్పుడు ప్రేమలో పిచ్చివారయ్యేవారు.

ఒకసారి వారు మహర్షి దాతా దయాల్ గారి ఓ ఫైల్‌ను తీసి చూశారు. అందులో చాలా ఉత్తరాలున్నాయి. అవన్నీ ప్రాపంచిక దృష్టిలో గొప్ప గొప్ప వారి ఉత్తరాలు. ఒకరు వకీలు, మరొకరు హైకోర్టు జడ్జి, మరొకరు కాలేజీ ప్రొఫెసర్ రాసిన ఉత్తరాలు. అందులో వారు తమకు నామదానమిమ్మని దాతా దయాల్‌ను ప్రార్థించారు. కానీ దాతా దయాల్ వాటన్నిటిపైన నిరాకరిస్తున్నట్లు రాసి పెట్టారు. “మహారాజ్! వీరందరికీ శరణమివ్వడానికి మీరెందుకు నిరాకరించారు?” అని మహారాజ్ అడిగారు. “ఫకీర్! ఈ గొప్ప గొప్ప మనుషులు ధనం, గౌరవాలకు లాలూచీ పడుతుంటారు. నామం పొందే హక్కు కేవలం అర్హులకే ఉంటుంది. దీనత్వంతో ఉండి గొప్పలకు దూరంగా ఉంటూ సత్యాన్ని అన్వేషణ చేసేవారే అర్హులు. కనుక నేను వారిని రావద్దని చెప్పాను” అన్నారు. దాతా దయాల్ మహర్షి మహారాజ్. పరమ దయాల్ జీ మహారాజ్ మొదట్లో తన వేతనమంతటినీ తమ తండ్రిగారికి పంపించేవారు. ఆయన ఇచ్చిపుచ్చుకునే వ్యాపారం చేసేవారు. రూపాయలన్నిటినీ వడ్డీకిచ్చేవారు. ఒకసారి పరమ దయాల్ జీ మహారాజ్, దాతా దయాల్ జీ దగ్గరికి లాహోర్‌కు వచ్చారు. “ఫకీర్! నీ వేతనమంతా ఏం చేస్తున్నావు” అని అడిగాడు దాతా దయాల్. “మా నాయన గారికి పంపిస్తున్నాను.”

"ఎందుకు?" అడిగారు దాతా దయాల్. "ఆయన నన్ను పెంచి పోషించారు. చదువు చెప్పించారు. నాకు సహాయం చేశారు" అన్నారు. "ఐతే నీవు కూడా ఆయనకు సేవచేయి. అవసరమైనప్పుడు సహాయం చేయి. ఆయనకు విశ్రాంతి నివ్వాలనుకో. జీతమంతా ఆయనకెందుకు పంపిస్తున్నావు? రూపాయలు జమచెయ్యి. అవసరమైనప్పుడు నీవు కూడబెట్టిన డబ్బు నీకు సహాయపడుతుంది" అన్నారు దాతాదయాల్ మహారాజ్. మహారాజ్ ఆ ఆజ్ఞను పాటించారు. వారి తండ్రిగారు వడ్డీలకు ఇచ్చిన డబ్బు తిరిగి రాలేదు. అప్పు తీసుకున్నవారు వడ్డీకాదుగదా అసలు కూడా ఇవ్వకుండా ముంచేశారు. మహారాజ్ వారిని కోపగించుకోలేదు. "మహారాజ్! ఈ రూపం దర్శనమైతే లభించింది. ఇప్పుడు నిజరూప దర్శనం చేయించు" అని పదే పదే ప్రార్థించసాగారు దాతా దయాల్‌ను.

దాతా దయాల్ మహర్షిజీ మహారాజ్ "మంచిది! రేపు దర్శనం చేయిస్తా" అన్నారు. మర్నాడు ఒక కొబ్బరికాయ, ఐదు పైసలు మహారాజ్‌కు ఇచ్చి తిలకం పెట్టారు. శిరసు వంచి మొక్కారు. "నీకు సత్యమైన సద్గురు దర్శనం సత్సంగీయుల రూపంలో లభిస్తుంది. సత్సంగం ఇవ్వు. నామదానం ఇవ్వు" అని ఆజ్ఞాపించారు. మహారాజ్ నవ్వారు. తర్వాత ఉదాసీనులయ్యారు. "ఫకీర్! ఎందుకు నవ్వావు? – మళ్ళీ ఎందుకు ఉదాసీనుడవయ్యావు" అని అడిగారు దాతా దయాల్ జీ మహారాజ్. అందుకు జవాబిస్తూ "మహారాజ్! సంతోషం ఎందుకు కలిగిందంటే నా మనసులో అహంకారం ప్రవేశించింది. నేను ఏదో అయ్యాననిపించి నవ్వాను. ఉదాసీనుడిని కావడానికి కారణం ఏమిటంటే "నాకు ఏమీరాదు" అన్నారు మహారాజ్. "ఫకీర్! చింతించకు! నీవు నీ నోటితో ఏది పలికినా అది సత్యమవుతుంది. కానీ నీవు సత్సంగీయుల నావను తీరానికి చేరుస్తానని భావించకు" అన్నారు దాతా దయాల్. ఇప్పుడు అనుభవం కలిగిన తరువాత "సత్సంగీయుల అనుభవాలు నా కళ్ళు తెరిపించాయి. విషయం అర్థమైంది. మనిషికి ఏది లభించినా అతని కర్మ ఫలితమే లభిస్తుంది. సత్సంగీయుల అనుభవాలు దాతా దయాలుని సంకేతాన్ని సమర్థించాయి. నా అజ్ఞానం క్రమంగా తొలగిపోయింది." అన్నారు మహారాజ్. మహారాజ్ తన జీవనంలోని సంఘటనలను గురించి లోగడ రాసిన జీవన

చరిత్రలో రాశారిలా - "క్రీ.శ. 1919లో బగ్దాద్‌లో అశాంతి నెలకొన్నప్పుడు నేను పర్యవేక్షించే పనిలో ఉన్నాను. దాతా దయాల్ జీ ఆజ్ఞానుసారం సత్సంగం నిర్వహించేవాడిని. నాలుగు నెలలపాటు ఆపదలు, కష్టాలు పడిన తర్వాత మేం అంతా ఒకచోటికి చేరాం. సత్సంగీయులు నన్ను ఒక పెద్ద సింహాసనంపై కూర్చోబెట్టి పూలమాలలు వేశారు. మిఠాయిలు తెచ్చి నా పూజ చేశారు. "ఎందుకు మీరంతా నాకు పూజ చేస్తున్నారు?" అని నేను అడిగినప్పుడు వాళ్ళు తమకు గత నాలుగైదు నెలల నుండి వచ్చిన కష్టాలను, ఆపదలను వివరించారు. వారు కష్టకాలంలో ఉండగా నేను చాలాసార్లు ఎంతగానో సహాయపడ్డాననీ, తమను రక్షించాననీ బదులిచ్చారు. నిజానికి నేనే స్వయంగా కష్టంలో వుండగా వారికెలా సహాయం చేశాను? అనే ఆలోచన వచ్చింది. ఓహో! నా కళ్ళు తెరుచుకున్నాయి. ఇదంతా వారి భావం, శ్రద్ధ, విశ్వాసములే! అవే వారికి సహాయం చేశాయి. ఏ వ్యక్తయినా ఎవరికైనా పూజ చేస్తే అది అతని మనసుకు చేసే పూజ అనవచ్చు.! అతని మనసునే అతడు పూజిస్తాడు. ఇలాంటి ఉదాహరణలు వేలాదిగా ఉన్నాయి. ప్రతి నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. నా రూపం ప్రకటమై ప్రజలకు అనేకరకాల పనులు చేస్తూ ఉంటుంది.

బగ్దాద్‌లో మేలారామ్ అనే ఓ సత్సంగి ఉండేవాడు. నాపై అతనికి అత్యధిక విశ్వాసం. నా నోటి వెంట ఏ మాట వచ్చినా అది జరిగి తీరుతుందని అతని నమ్మకం. అలాగే జరిగేది! ఒక విషయం గురించి ఒకసారి నన్ను అలా అనమని బలవంత పెట్టాడు. నాకు ఏ విజ్ఞానం లేదు. విద్యలేదు. గారడీ - చమత్కారాలు రావు. కనుక నేను నిరాకరించాను. అతడు నాలుగు గంటలపాటు నా కాళ్ళు వదల్లేదు. చివరికి నేను విసిగి, వివశుడినై అలాగే జరుగుతుందిలే అన్నాను. అదే జరిగింది. అతడిని వదిలించుకోవడానికే నేనలా అన్నాను కానీ అతని విశ్వాసం ఫలించి అతడు అనుకున్నది నెరవేరింది.

నేను ఫరీద్‌కోట్‌లో ఉండే వాడిని. సంత్‌సింహ అనే సత్సంగి నా దగ్గరికి వచ్చాడు. అతడికి ఉద్యోగం దొరకటం లేదు. నా వెంట పడ్డాడు. నాకు విసుగొచ్చింది. అతడిని వదిలించుకోవడానికి "నువ్వు వెళ్ళు. దైవేచ్ఛ ఏదో ఒక

ఏర్పాటు తప్పకుండా చేస్తుంది" అన్నాను. అతడు తన ఇంటికి వెళ్ళాడు. వెళ్ళేసరికి వర్మ దగ్గరి నుండి ఉద్యోగానికి రమ్మని లేఖ వచ్చి ఉంది. అతడు అక్కడికి వెళ్ళిపోయాడు. ఇది కేవలం అతని విశ్వాసమే.

అదే సమయంలో నేను గురు రూపులుగా భావించి సత్సంగీయులకు ఆరతిని చేస్తుండగా దాతా దయాల్ రాసిన ఒక ఉత్తరం అందింది. అందులో ఒక శబ్దం రాశారు. అది "శబ్ద గుంజార్"లో ఉంది.

***"ఆప్ హీ మాలీ బాగ్ లగావే, ఆప్ ఫూల్ ఫుల్‌వారీ ॥***

ఈ అనుభవంతో భగవంతుడు సద్గురువు రూపం ధారణచేస్తాడనే విశ్వాసం మరింత ఎక్కువైంది. క్రీ.శ. 1921లో దాతా దయాల్ మహారాజ్‌కు ఆరతి చేయడానికి రాధాస్వామి ధామానికి చేరాను. ఉన్నదంతా మన మనసే. చాలా మంది అంతరీయ, బాహ్య భక్తి విడిచి పెడతారు. ఇది అహంకారం. పెద్ద తప్పు చేస్తారు.

# స్వదేశానికి రాక

పన్నెండు సంవత్సరాల తరువాత మహారాజ్ బగ్దాద్ రైల్వే నుండి తిరిగి భారతదేశానికి వచ్చేశారు. నార్త్ రైల్వేలో స్టేషన్ మాస్టరుగా నియమితులయ్యారు. ఆయన ఏనాడూ ఒక్క పైసా కూడా లంచం తీసుకోలేదు. ప్రభుత్వ వస్తువులు నూనె, బొగ్గు వంటివి తన స్వప్రయోజనాలకు ఉపయోగించుకోలేదు. కార్యాలయానికి చెందిన కాగితాలు, సిరా వంటివి కూడా తన ప్రైవేటు పనులకు అనగా స్వంత పనులకు వాడుకోలేదు. తనతోపాటు పని చేసే ఇతర సిబ్బంది లంచం పుచ్చుకున్నవారిపై ఎప్పుడూ విమర్శలు చేయలేదు. తప్పులెంచలేదు. జీవితమంతా దోషాలవైపు చూపు ప్రసరించ నీయలేదు. సదా సత్యమే మాట్లాడేవారు. కానీ ఎప్పుడైనా సహోద్యోగులకు ఎవరికైనా ఆపద వాటిల్లితే వారిని రక్షించవలసిన అవసరం ఏర్పడితే అబద్ధం చెప్పడానికి వెనుకంజ వేయలేదు. ప్రభుత్వ చట్టమే అట్లా ఉందని స్పష్టం చేసేవారు. అప్పుడప్పుడు సత్యాన్ని విడవవలసి వస్తుందంటూ కేవలం సత్యమే మానవ జీవన ఆదర్శం కాదనేవారు.

అధికారులు ఆయన సత్య సంధత, నిజాయితీలు చూసి ఆయనొక ఆదర్శవంతుడని అంగీకరించే వారు.

మహారాజ్ ఉర్దూలో రాసిన తన "జీవిత చరిత్ర"లో ఇలా రాశారు - "నేను బస్రా బగ్దాద్‌లో 12 సంవత్సరాలున్నాను. అక్కడ సౌందర్యం ఎక్కువగా ఉండేది. నా రక్షణార్థం నేను ఎప్పుడూ ఒంటరిగా బజారుకు వెళ్ళలేదు. నాతో ఉన్న సత్సంగీయులను కూడా ఒంటరిగా బజారుకు వెళ్ళడానికి నేను అనుమతించలేదు. అవసరమైనప్పుడు గుంపుగా కొందరిని పంపించేవాణ్ణి. పైగా అక్కడ చెడు ప్రవర్తనగల స్త్రీలు మధ్యాహ్న సమయంలో భారతీయుల నివాసాలకు వస్తూ ఉండేవారు. ఒకరోజు స్త్రీలు వస్తుంటే నేను నా ఇంటి తలుపులు మూసుకున్నాను. కానీ మానసిక పతనం వలన నేను రెండుసార్లు తలుపు సందులలో నుండి ఆ స్త్రీలను చూశాను. మనసు ఎప్పుడైనా పతనమైనప్పుడు నేను నా మనసును అదుపు చేస్తుండేవాణ్ణి. ఏ అవగుణాలూ లేని ధర్మాత్ముడు ఇక్కడ ఎవరూ లేరని నాకు బోధపడింది. అలాగే ప్రపంచంలో మంచి గుణంలేని చెడు వ్యక్తీ లేడు. ప్రజలు తన మనసును జాగ్రత్తగా పరిశీలిస్తే నా మాటల్లో సత్యం ఉందని తెలుసుకుంటారు. వాస్తవమేమిటంటే ఎప్పటివరకైతే మనిషి పాంచనామము (స్థితులు) ల ముందుకు వెళ్ళడో అతడు ధర్మాత్ముడైనా, పాపాత్ముడైనా ఈ చక్రం నుండి విముక్తి లభించదు. అందుకే గురు నానక్ "హమ్ నీచోంకే నీచ్" అన్నారు. కబీర్ సాహబ్ కూడా

*"అవగుణ హారా గుణ నహీం, మన్ మే భరా వికార్ ।*
*ఐసే సమరథ్ సద్గురు, తాహి లగావేం పార్ ॥* అన్నారు.

కనుక నేను గౌరవాదరాలు, కీర్తి ప్రతిష్టలు కావాలని కోరను. ఈ పుస్తకంలో ప్రస్తావించిన సంఘటనలతో అవి నాకు పుష్కలంగా లభించే వీలున్నా వాటిని నేను కోరుకోను. ఈ మనసు యొక్క రూపం బోధపడింది. ఇక నేనిప్పుడు మనసు వలయంలో చిక్కుకోను. మనసుపైనే సవారీ చేస్తాను. ఇదే నాకు కలిగిన లాభం.

మహర్షీజీ మహారాజ్‌ను నేను ప్రేమించాను. ఆయన నాకు గురు పదవిని

ఇచ్చి పనిచేయమని ఆజ్ఞాపించాడు. పని చేసే క్రమంలో సత్సంగీయుల అనుభవాలు వింటూ ఉంటే నాకొకటి అనిపిస్తుంది. అదేమిటంటే ఏ మనిషీ ప్రశంసించడానికి అర్హుడు కాడు. చెడుకూ అర్హుడు కాడు. ప్రశంసించడానికి కేవలం గురుజ్ఞానమే సరైనది. గురుజ్ఞానం తప్ప ఇంకేదీ పొగడదగినదీ, మెచ్చుకోదగినదీ లేదు. నేను సంత్ సద్గురు వక్త్ హోదాలో రచనల ద్వారా, వచనాల ద్వారా నాకు లభించిన దానిని శబ్దాలతో ప్రగటించుకున్నాను.

బగ్దాద్‌లో, బస్రాలో నా జీవితం చాలా ఆనందంగా గడిచింది. క్రీ.శ. 1930లో అక్కడి నుండి నేను వచ్చేశాను. వైరాగ్యం, భక్తి కారణంగా నా భార్య పట్ల విముఖంగా, ఉదాసీనంగా ఉండే వాణ్ణి. గృహస్థుడవై ఉండమని దాతాదయాల్ సూచన చేశారు. సంతానం కలిగింది. ఆరోగ్యం సన్నగిలిగింది. కారణమేమిటంటే అధికంగా అభ్యాసం చేస్తూ ఉన్నా విషయ భోగాలను తప్పించుకోలేకపోవటం. కనుక నిజ అనుభవ సారాంశం మానసిక బ్రహ్మచర్యం పాటించాలని బోధించాను.

దీని అనుభవం నాకు ఇలా జరిగింది – దాతా దయాల్ జీ మహారాజ్ సత్సంగీయులను నా వద్దకు పంపించేవాడు. వచ్చినవారితో 'నాకేం రాదు' అని చెప్పేవాణ్ణి. "తనకేం రాదని ఫకీర్ అంటున్నాడు" అని ఒక సత్సంగి దాతా దయాల్‌కు ఫిర్యాదు చేస్తూ ఉత్తరం రాశాడు. "ఫకీర్ నుండి ఏమీ దొరకకుంటే నా నుండి కూడా ఏమీ లభించజాలదు" అని దాతా అతనికి సమాధానం రాశాడు. సత్సంగీయులు నాకు ఆ ఉత్తరాన్ని చూపించారు. సమాధి స్థితిలో నా ఆత్మ నాతో ఇలా అంది –

***జహాఁ కామ్ తహాఁ నామ్ నహిఁ, జహాఁ నామ్ వహాఁ నహిఁ కామ్ ।***
***రవి రజని దోనోఁ నా మిలే, ఏక్ ఠౌర్ ఏక్ యామ్ ॥***

అదేరోజు "సంత్ సంగ్రహ్" అనే ఓ పుస్తకం కనిపించింది. "ఏ వ్యక్తి విషయ లోలత్వాన్ని విడిచిపెట్టడో అతనికి నామం యొక్క ఫలితం లభించదు. అనగా అతడు సత్ పదం యొక్క రహస్యాన్ని తెలుసుకొనజాలడు" అని అందులో ఉంది.

***

బస్రా బగ్దాద్ నుండి వచ్చాక మహారాజ్ ఎంతో సంతోషంగా ఉన్నారు. అంతరీయ ఆనందం పొందుతూ శబ్ద ప్రకాశాల దృశ్యం చూసేవారు. గమ్యం, లక్ష్యం చేరుకున్నా ననుకున్నారు. లాహోర్‌కు దాతా దయాల్ మహర్షిజీ దర్బారుకు వెళ్ళారు. "బయట ఉన్న ఎండలోకి పద! పరమార్థంలో నువ్వేం సంపాదించావో చూస్తాను" అన్నారు దాతాదయాల్. మహారాజ్ బయటికి వచ్చారు. వీరి ముఖాన్ని, కళ్ళను చూసి, "ఫకీర్! తన్మయం చెందావు. ఆనందం పొందావు. ప్రకాశాన్ని దర్శించుకున్నావు. ఇదంతా బాగుంది. కానీ నీలో ఫకీరీ రాలేదు" అన్నారు. "మహారాజ్! ఫకీరీ అంటే ఏమిటి?" అని అడిగారు మహారాజ్.

"సరే! మంచిది. రేపు నీ పరీక్ష తీసుకుంటా" అన్నారు దాతా దయాల్ జీ.

మర్నాడు ఉదయం మహారాజ్ మహర్షి కోసం భోజనం తయారు చేయసాగారు. పొయ్యి వెలిగించారు. సామగ్రి సిద్ధం చేశారు. "ఫకీర్! ఆగు. ఈ రోజు కూరగాయ నేను వండుతాను" అని వంటింట్లోకి వచ్చారు. పొయ్యిపైన గిన్నె పెట్టారు. "నెయ్యి ఇవ్వు. జీలకర్ర తీసుకురా! పసుపు ఇవ్వు. కారం ఇవ్వు"... అంటూ ఒక్క నిమిషంలో యాభై అంశాలు ఆజ్ఞాపించారు. మహారాజ్ గాభరా పడ్డారు. ఒక్కటి కూడా పూర్తి చేయలేకపోయారు. నెయ్యి మాడిపోయింది. మహర్షిగారు గదిలోకి వెళ్ళిపోయారు.

సాయంత్రం మహారాజ్ మహర్షిగారి కాళ్ళు వత్తుతూ "మహారాజ్! మీరు పరీక్ష తీసుకుంటానన్నారు. తీసుకోలేదు" అన్నారు.

"నేను పరీక్ష తీసుకున్నాను. నీవు ఫెయిలయ్యావు" అన్నారు మహర్షిగారు.

మహారాజ్‌కు ఆశ్చర్యం కలిగింది. విషయం అర్థం కాలేదు.

"కూర వండేటప్పుడు ఏది అడిగినా అందించలేకపోయావు" అన్నారు మహర్షిగారు. "మహారాజ్! మీరు ఒక్క క్షణంలో యాభై ఆజ్ఞలిచ్చారు. నేను గాభరాపడ్డాను" అన్నారు మహారాజ్.

"గాభరాపడకపోవటమే ఫకీరీ! చలించని స్థితిలో ఉండటమే ఫకీరీ!" అన్నారు మహర్షి.

రాధాస్వామి నామం జపించటం వలన దుఃఖం దూరమవుతుందనీ, అసాధ్యమైన రోగాల చికిత్స జరుగుతుందనీ అంటారు. అన్ని కోరికలు నెరవేరుతాయంటారు. సాంసారిక జీవనం సఫలతతో గడుస్తుంది. ఇలా రాధాస్వామి నామ మహిమ గానం చేయబడింది. ఎందుకంటే ఈ నామం ఈ గుణాలున్న స్థానముదే! రాధాస్వామీ నామం జపించే వ్యక్తి మనసు నిర్మలమై ఉండి, మనసు అతని వశంలోనే ఉంటేనే ఈ గుణాలన్నీ నామంలో ఉంటాయనే విషయం మరవకూడదు. రాధాస్వామి నామం దాకా చేర్చే మహాశక్తి మనసు వశంలో ఉండి, పవిత్రంగా ఉండటమే! ఉదాహరణకు తుపాకీ గుండు దూసుకుపోయి వినాశనం చేస్తుంది. తుపాకీలో ఉన్న శక్తివేగంతో గుండు పనిచేస్తుంది. తుపాకీలో ఏదైనాలోపం ఉంటే గుండు వెళ్ళదు. వెళ్తే వినాశనం చేస్తుంది. కనుక పొరపాటున కూడా రాధాస్వామి నామం లేదా ఇతర నామమును వాసన, కామన శుద్ధిగా లేకుంటే, మనసు వశంలో లేకుంటే మానవత్వం కలిగి లేకుంటే స్మరించకు. లేకుంటే కష్టమవుతుంది.

మొదట్లో చాలా సంవత్సరాల వరకు మహారాజ్ సునామ్ స్టేషన్‌లో పనిచేశారు. తరువాత గడర్‌వాహాకు బదిలీ అయింది. ఆ తరువాత ఫరీద్‌కోటకు బదిలీ అయింది. అనేక సంవత్సరాలపాటు ఫరీద్ కోట స్టేషన్‌లో పనిచేశారు. నిర్భయత్వం ఆయనలో నిండి ఉంది. శరీరం సన్నగా ఉన్నా నిజాయితీగా ఉండటంతో సింహం వంటి హృదయాన్ని కలిగి ఉన్నారు. దాతా దయాల్ మహర్షి లాహోర్ వదిలేసి వచ్చి రాధాస్వామి ధామం స్థాపించారు. సత్సంగ గృహం – ధర్మశాల – రాధాస్వామి మందిరం కట్టించసాగారు. ఆ సమయంలో మహారాజ్ అక్కడికి వెళ్ళారు. లోకులు కొందరు అనుచితరీతిలో అనగా లంచం తీసుకుని సంపాదించిన రూపాయలను ధామం కట్టించడానికి ఇస్తుండటం చూశారు. కొందరు సత్సంగీయులు దొంగతనం చేసి ప్రభుత్వసామగ్రి తీసుకొచ్చి ఉపయోగిస్తున్నారనీ తెలిసింది. ఆయన హృదయం గాయపడింది. దాతా దయాల్‌తో నిర్భయంగా "దాతా! నీ ధామం నశిస్తుంది" అన్నారు. క్రీ.శ. 1930 తరువాత దాతా దయాల్ ధామాన్ని వదిలి పెట్టాలని మహారాజ్ కోరిక. ఒక

ఉన్నత స్థితిని ప్రాప్తించుకున్న సంత్ ఏదైనా ధామం, డేరా, గురుద్వారాలతో బంధింపబడి ఉంటే సత్యాన్ని వ్యక్తం చేయటంతో అతడు తెరలు కప్పడానికి వివశుడవుతుంటాడు. దాతా దయాల్ సంపూర్ణ స్వతంత్రుడుగా ఉంటే చూడాలని మహారాజ్ కోరిక. "ఈ ఫకీర్ నన్ను ఫకీర్‌ను చేసే వదులుతాడు" అన్నారు దాతా దయాల్ జీ.

రాధాస్వామి ధామం చరిత్రలో 1933వ సంవత్సరం ఎంతో మహాత్యాన్ని కలిగి ఉందనీ, గొప్పదనీ చెప్పవచ్చు. ప్రతి సంవత్సరం నిర్వహించే భండారా ఏర్పాటైంది. డిసెంబరు మాసం. మహారాజ్ కూడా ధామ్‌కు వెళ్ళారు. దాతా దయాల్ గత మూడువారాల నుండి భోజనం చేయలేదు. నీళ్ళు, పళ్ళరసాలు తీసుకునేవారు. కానీ వార్షిక సత్సంగం ఉన్నందున ఉదయం మూడు, నాలుగు గంటలు, సాయంకాలం మూడు, నాలుగు గంటలు సత్సంగం ఇచ్చేవారు. ఈ మధ్య సమయంలో సత్సంగీయులతో సంభాషించేవారు. 26 డిసెంబరు నాడు ఉదయం సత్సంగం జరుగుతోంది. ధామ్ పక్కన ఉన్న స్కూలు హెడ్‌మాస్టర్‌గా ఉన్న మాస్టర్ జ్ఞానచంద్ సత్సంగంలో ఉన్నాడు. ఆయన అభ్యాసం చేసేవాడు. అతని భార్యవెంటే ఉంది. సత్సంగం సమయంలో ఆమె బయటకు వెళ్ళేది. రెండు గంటల పాటు సత్సంగం జరిగింది. అకస్మాత్తుగా మాస్టర్ లేచాడు. దాతా దయాల్ కూర్చున్న సింహాసనం పైకి తనూ ఎక్కి కూర్చున్నాడు. ఆయన శిరస్సును ముద్దుపెట్టుకున్నాడు. దాతా దయాల్ అతడిని కిందికి దించేశారు. దగ్గరే కింద మహారాజ్ కూర్చుని ఉన్నారు. మహారాజ్ ముఖంపై జ్ఞాన్‌చంద్ ఒక చెంప దెబ్బకొట్టాడు. మహారాజ్‌లో సహనశక్తి ఎవరూ ఊహించనంత అధికంగా ఉంది. ఆయన ముఖంపై ఏ మార్పు లేదు. మౌనంగా శాంతంగా కూర్చున్నారు. దాతా దయాల్‌లో తీక్షణత కనిపించింది. ఉచ్ఛ స్వరంతో "నేనన్నీ సహించుకోగలను కానీ ఫకీర్‌కు అవమానం జరిగితే సహించలేను" అంటూ సింహాసనంపై నుండి కిందికి దిగారు. శ్రీ లలితా ప్రసాద్‌ను సింహాసనంపై కూర్చోబెట్టారు. "ధామ్‌కు ఈయనే ఆచార్యుడు" అని ప్రకటించారు. సత్సంగీయులలో కోలాహలాం మొదలైంది. దాతా దయాల్ స్వతంత్రుడయ్యాడు. ఇక దాతా దయాల్ తనువు

త్యజిస్తాడని కొందరన్నారు. ఒకరు మరొకటన్నారు. వేరొకరు వేరే మాటన్నారు. సత్సంగీయులు దాతా దయాల్ చుట్టూరా పోగై ఏడవసాగారు. కొందరు లలితాప్రసాద్ చరణాలను పట్టుకుని ఇప్పుడిక మీరే మా నావ తీరం చేరుస్తారు అనసాగారు. "దాతా దయాల్ ఇప్పుడే తనువును త్యజించరు. దాతా దయాల్ కంటే ముందుగా బాబూ లలితాప్రసాద్ తనువు త్యజిస్తారు" అన్నారు మహారాజ్. ఆయన భవిష్యవాణి నిజమైంది. రెండు సంవత్సరాల తరువాత బాబూ లలితా ప్రసాద్ శరీరం విడిచాడు. మాస్టర్ జ్ఞానచంద్ చాలా దుఃఖంలో ఉన్నాడు. మహారాజ్ ఎంతో ప్రేమతో సానుభూతితో నచ్చచెప్పారు. "జ్ఞానచంద్! నిగ్రహంతో ఉండాలి. లేకుంటే ప్రాపంచిక జీవితం చెడిపోతుంది. నీలో కామాంగం ప్రబలంగా ఉంది. సంభాళించుకో" అన్నారు. ఓ ప్రాపంచికులారా! తనను కష్టపెట్టిన అపరాధి క్షమ అడగకుండానే క్షమించి, సత్యసంధతతో అతని హితవు కోరి, సలహా చెప్పి సత్యమార్గంపై నడిపించటం సాధారణమైన మానవుడు చేసే పనేనా? ఓ పూర్ణ సంతునుండే ఇలాంటి పరిణామాన్ని, సంఘటనను ఆశించవచ్చు. ఆ రోజు తరువాత దాతా దయాల్ సింహాసనంపై కూర్చో లేదు. విశ్రాంతిగా కూర్చోవడానికి వీలుగా ఉండే ఓ ఆరామ్ కుర్చీ పైన కూర్చుని సత్సంగం ఇచ్చేవారు. తరువాత ధామ్‌ను వదిలిపెట్టారు.

దాతా దయాల్ వయసు పెరిగింది. బలహీనత ఆవహించింది. బయటి ప్రాంతాలకు రావటం, పోవటం కష్టమైంది. దాతా దయాల్ హైద్రాబాద్‌కు వెళ్ళారనీ, అక్కడ వివిధ ప్రదేశాలకు వెళ్ళవలసి వస్తోందని మహారాజ్‌కు తెలిసింది. "మహారాజ్! ఈ వార్ధక్యంలో బయటికి వెళ్ళకండి. నా దగ్గరికి వస్తే నేను సేవ చేయడానికి హాజరుగా ఉంటాను" అని మహారాజ్ ఉత్తరం రాశారు. అందుకు దాతా దయాల్ "ఫకీర్! నన్ను ప్రేమించేవారికి ఒకరికి ఇల్లు లేదు. అతని స్థితిచూసి నాకు దుఃఖం కలుగుతుంది. ఇల్లు కట్టించాలంటే డబ్బు కావాలి. కనుక హైద్రాబాద్‌కు వచ్చాను" అని రాశారు. మహారాజ్‌కు బాధనిపించింది. ఈ ఉత్తరాన్ని తమ ధర్మపత్నికి చదివి వినిపించి "భాగ్యవతీ! ఏం చేద్దాం?" అని అడిగారు. "దాతా ఇచ్చిన రూపాయలు బ్యాంకులో ఉన్నాయి. అవసరమైనన్ని

తీసుకోండి" అంది మాతాజీ. "నా దగ్గర రూపాయలు లేవు. బ్యాంకులో ఉన్న డబ్బు నీ పేరిట ఉంది. వాటిపైన నాకు హక్కు లేదు. అందులో నుంచి ఒక్క పైసా కూడా తీసుకోవద్దని దాతా నన్ను ఆదేశించారు. నీ దగ్గర నగలున్నాయి. వీటిపై నీకు హక్కుంది. నీవు వాటిని నాకు ఇవ్వవచ్చు. నేను వాటిని తాకట్టు పెట్టి ఆ ప్రేమమయుడైన సత్సంగి ఇంటి కోసం రూపాయలు పంపించగలను. కొన్నిరోజుల తరువాత నా సంపాదనతో నగలు విడిపించి ఇచ్చేస్తాను లేదా కొంటాను" అన్నారు. మాతాజీ ఎప్పుడు, ఎలా అని ఏమీ అడగలేదు. స్త్రీలకు నగల పట్ల మమకారం ఉన్నా ఆమె ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా నగలు మహారాజ్ చేతిలో పెట్టేసింది. ఆయన వాటిని అమ్మేసి డబ్బు ఆ ప్రేమీ సత్సంగికి పంపించారు.

ఇంటి కోసం డబ్బు పంపించేశానని, ఇక కృప చూపి తన దగ్గరికి రమ్మనీ దాతా దయాల్ జీ కి ఉత్తరం రాశారు మహారాజ్. సత్యమైన త్యాగానికి, తనువు, మనసు, ధనంతో సేవ చేసే గుణానికి ఇదే ఉదాహరణ. మహారాజ్ దాతాకు ఇలాంటి సేవలే చేశారు. అటు దాతా దయాల్ కూడా తనవంతు బాధ్యత నిర్వహించారు. శిష్యుని ఇరవైవేల రూపాయలను తిరిగి ఇచ్చేసి ప్రపంచ చరిత్రలో త్యాగానికి అసాధారణమైన ఉదాహరణగా నిలిచారు. ఇలాంటి గురు శిష్యులు చరిత్రలో వెదికినా కనిపించరు.

పరమ దయాల్ మహారాజ్ సునామ్ స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన త్యాగం, సత్యవాక్కు, నిజాయతీ, ఆత్మిక బలం చూస్తున్న వారి హృదయాలలో ఆయన పట్ల విశేషమైన గౌరవాభిమానాలు పెరిగాయి. చాలా మంది పైఅధికారులు సైతం పరమ దయాల్ జీ మహారాజ్‌ను అభిమానించేవారు. ఓ రోజు ఆయన కుర్చీలో కూర్చుని ధ్యానస్థులయ్యారు. పోలీసులు ఓ దొంగను పట్టుకుని తీసుకొస్తున్నారు. దారిలో స్టేషన్‌లో ఆగారు. పోలీసులు పరమ దయాల్ జీ వైపు సైగచేసి "ఆయన ఓ సంత్ " అన్నారు. బందిపోటు దొంగ చేతులకు బేడీలు వేసి ఉన్నాయి. అయినా అతడు చేతులోకి ఓ విసనకర్ర తీసుకొని పరమదయాల్ జీ మహారాజ్‌కు గాలి విసర సాగాడు.

పోలీసులు విశ్రాంతి తీసుకుంటున్నారు. కొంచెంసేపటి తరువాత పరమ దయాల్ జీ కళ్ళు తెరిచారు. గాలి విసురుతున్న వాడివైపు చూసి "ఎవరు నీవు" అని అడిగారు. "నేను బందిపోటు దొంగను" అని జవాబిచ్చాడు దొంగ. "నీవు బందిపోటు దొంగవు కావు. భగవద్భక్తునివి. దొంగ సత్యం పలుకడు." అన్నారు పరమ దయాల్ జీ. "మహారాజ్! నేను ఓ పెద్ద బందిపోటును. అనేక హత్యలు చేశాను. దోపిడీలు చేశాను" అన్నాడు దొంగ. "నువ్వు భక్తునివి. బందిపోటువు కావు" అన్నారు పరమ దయాల్ జీ మహారాజ్.

కొంచెంసేపటి తరువాత పోలీసులు అతడిని తీసుకుని వెళ్ళి ఖైదులో ఉంచారు. పరమ దయాల్ జీ పోలీస్ సూపరింటెండెంట్‌గా ఉన్న సర్దార్ భగవాన్ సింగ్ దగ్గరికి వెళ్ళారు. ఆయన మహారాజ్‌ను ఎంతగానో గౌరవించేవాడు. ప్రేమాదరాలతో ఆహ్వానించి కూర్చోమని "మీ రాకకు కారణం? ఎందుకు కష్టపడి వచ్చారు?" అని అడిగాడు. "ఒక భక్తుణ్ణి చెరసాలలో వేశారు. అతడిని విడిచెయ్" అన్నారు. సూపర్నెంట్ ఆఫ్ పోలీస్ ఆశ్చర్యంగా మహారాజ్‌వైపు చూడసాగాడు. "మహారాజ్! మీరేదో పొరబడుతున్నారు. వాడు పేరెన్నికగన్న బందిపోటు. పోలీసులను చాలా యాతన పెట్టాడు" అన్నాడు. "అతడు బందిపోటు దొంగకాదు, భక్తుడు" అన్నారు పరమ దయాల్ జీ మహారాజ్. మహారాజ్ ఆత్మిక బలం యొక్క అత్యధిక ప్రభావం అతనిపై పడింది. ఆ దొంగను ప్రభుత్వ సాక్షిగా చేసి కేసును మూసేశాడు. శిక్ష నుండి తప్పించాడు. కేసు ముగిశాక ఆ దొంగ మహారాజ్ ఇంటికి వెళ్ళాడు. మహారాజ్ అతనికి ప్రేమగా భోజనం పెట్టారు. చుట్టుపక్కల ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ఆ రోజు తరువాత ఆ దొంగ తన వృత్తిని వదిలిపెట్టి జీవితమంతా భగవత్ భక్తిలో గడిపాడు. పరమ దయాల్ జీ ఆత్మిక బలానికి ఉదాహరణ ఇది.

ఓ రోజు దాతా దయాల్ రాసిన ఒక లేఖ చదువుతున్నారు. అందులోని అంశాన్ని బట్టి త్వరలోనే దాతా దయాల్ శరీర పరిత్యాగం చేస్తారని సూచనప్రాయంగా అంతరార్థం ఉన్నట్లనిపించింది.

అది చదవగానే పరమ దయాల్ జీ ఆరోగ్యం వికటించింది. స్పృహ కోల్పోయి మంచంపై నుండి కిందికి పడ్డారు. ఇంట్లో గందరగోళం చెలరేగింది. చుట్టు పక్కల నుండి జనం వచ్చారు. డాక్టరును పిలిచారు. ఆయన ఔషధం ఇవ్వగా పరమ దయాల్‌జీకి చైతన్యం కలిగింది. "ఫకీర్! నీవు ధృపదధామానికి చేరనంతవరకు నేను శరీరాన్ని త్యజించను" అని మీరు నాకు మాట ఇచ్చారు. కానీ ఫలానా మీ రచన వలన త్వరలోనే దేహ త్యాగం చేస్తారని తెలుస్తున్నది. నా స్థితేమవుతుంది? నేనేం కావాలి?" అని దాతా దయాల్ జీకి టెలిగ్రామ్ పంపించారు మహారాజ్. దాతా దయాల్ వెంటనే టెలిగ్రామ్ ద్వారా "ఫకీర్! చింతించకు. నీ పని పూర్తి కానంతవరకు నీ నావను తీరం చేర్చేంతవరకు నేను శరీరాన్ని త్యజించను" అని జవాబిచ్చారు.

1939లో దాతా దయాల్ శరీరాన్ని వదిలినప్పుడు ధామ్ నుండి ఇంటికి కార్డు వచ్చింది. రోదనలు మిన్నుముట్టాయి. కార్యాలయంలో ఉన్న పరమ దయాల్‌జీకి ఈ వార్త అందింది. ఆయన ఇంటికి వచ్చారు. కార్డు చదువుకున్నారు. ముఖంపై దుఃఖ చిహ్నాలేవీ కన్పించలేదు. శాంతంగా అందర్నీ ఓదార్చారు. ఎందుకంటే దాతా దయాల్ శరీరత్యాగానికి ముందే మహారాజ్‌కు ఆజ్ఞాపించారు – "ఫకీర్ నా దేహం వదిలి వెళ్ళాక బోధన క్రమాన్ని నడిపించు. కాలం మారుతుంది. కనుక నీవు కూడా బోధనలో మార్పు తీసుకురావాలి" అని. మహారాజ్ వెంటనే ధామ్‌కు ఇలా టెలిగ్రామ్ ఇచ్చారు. ఇలా – "I solemnly declare that I shall spread thy true teachings throughout the world to the best of ability and circumstances" మీ బోధనను యథాశక్తి ప్రచారం చేస్తానని ప్రమాణం చేస్తున్నాను. ఇదీ సంత్ మతం – సంతుల మతం యొక్క ఆది అంతం. గురువు దేహ పరిత్యాగం చేసినప్పుడు కొంచెం కూడా శోకించని సమయం ఆనాడు.

ఇలాంటి సందర్భంలో కబీర్ సాహబ్ దోహా ఈ శిక్షణను బోధనను ఎంతో అందంగా వర్ణిస్తున్నది.

*గురు మాథే సే ఊతరా, శబ్ద విహూనా హోయ్ ।*
*తాకో కాల్ ఘసీట్‌యే, రోక్ న సకే కోయ్ ॥*

ఏ ప్రాణిలోపల గురుమూర్తి ప్రకటంకాధో లేక గురురూపం లోపిస్తుందో, గురుమూర్తి కన్పించదో, శబ్ద రహితం అవుతుందో అనగా శబ్దం వినిపించదో అతనిని కాలుడు ఈడ్చుకుంటూ వెళ్తాడు. కానీ సాధన అభ్యాసాల తరువాత ప్రాణిస్థితి కింది దోహాలో కబీర్ సాహబ్ చెప్పినట్లుగా జరుగుతుంది.

***గురు మాథే సే ఊతరా, సిర్ సే టలీ బలాయ్ ।***
***జైసా థా వైసా రహే, కహేఁ కబీర్ సమఝాయ్ ॥***

సాధన అభ్యాసాల తరువాత అతడు పరిపూర్ణుడవుతాడు. ఇది జీవనలీల అంతం. ఇదే ఆదిస్థితి. ఇదే అంతిమస్థితి. మధ్యలోని స్థితులు అన్నీ కాలం మాయా చక్రం లోనివి. కానీ ఇది లేనిదే పని జరగదు.

సంత్ మతాన్ని అనుసరించి కేవలం సత్యమే ఇష్టపదం కాదు. కానీ ప్రాపంచిక వ్యవహారంలో దీని ఆచరణ ఆవశ్యకం. ఉద్యోగం చేసే రోజుల్లో ధాన్యాన్ని తలపై పెట్టుకొని పిండిమరకు వెళ్ళేవారు. పిండిని తలపై పెట్టుకుని వెనుదిరిగేవారు. ప్రతి దినం చూస్తున్న, పరిచయం ఉన్న ఓ బండివాడు ఖాళీ బండితో వెళ్ళేవాడు. “ఆ ధాన్యాన్ని బండిలో పెట్టండి. ఖాళీగా వెళ్తోంది” అని ప్రార్థించేవాడు. మహారాజ్ చిరునవ్వు నవ్వి ముందుకు నడిచేవారు. ఏనాడూ ఏ నౌకరుతోనూ అనుచితమైన లాభం పొందలేదు.

మహారాజ్‌గారి పెద్ద కుమార్తె తల్లి గర్భంలో ఉండగా మహారాజ్ తనకు పుట్టబోయే సంతానానికి కామ, కోధ, మోహ, లోభ, మద, అహంకారాది అరిషడ్వార్గాలు ఉండకూడ దనుకున్నారు. వారి సంకల్పం వలన అలాంటి కూతురే పుట్టింది. ఆమె సదా నిర్వికారంగా ఉంటుంది.

పరమ దయాల్ జీ మహారాజ్ జీవితంలో స్వార్థమనే గాలి ఏనాడూ సోకలేదు. ఆయన పెద్ద కుమార్తె సరళ స్వభావురాలు. అమె వివాహానికి ముందు ఆమెను గురించి పూర్తిగా వియ్యంకులకు చెప్పారు. పెళ్ళికొడుకుకు కూడా చెప్పి “మా అమ్మాయి సురత్ ప్యారీని చూడు” అన్నారు. అతడు అన్నిటికీ అంగీకరించాడు. కానీ పెళ్ళయ్యాక అల్లుడు మహారాజ్ గారి కుమార్తె– సురత్ ప్యారీతో సంతుష్టి

చెందక ఉదాసీనంగా ఉండేవాడు. ఇది గమనించిన మహారాజ్ అతనిని మరో పెళ్ళి చేసుకోమన్నారు. "డబ్బు లేకుంటే సురత్ ప్యారీకున్న నలభై తులాల బంగారు నగలలో నుండి సగం నీ రెండో భార్య కోసం తీసుకో" అన్నారు. ఈ విషయం పట్ల మహారాజ్‌గారి తమ్ముడు, ఇంకా ఇతర సభ్యులు చాలా బాధపడ్డారు. వారిని సమాధానపరుస్తూ "మన స్వార్థం కోసం, అమ్మాయి స్వార్థం కోసం ఆ అబ్బాయి మనసును బాధపెట్టడం భావ్యం కాదు. అతడి మనసు బాధపడటం చూడాలనుకోవటం లేదు" అన్నారు. వివాహం అయిన తరువాత అల్లుడు కోపంగా ఉండసాగాడు. మహారాజ్ కుమార్తె మహారాజ్ ఇంట్లోనే ఉండేది. మహారాజ్ ఎప్పుడూ ఈ విషయం గురించి ఆలోచించలేదు. ఎల్లవేళలా అల్లునితో, అతని బంధువులతో ప్రేమగా వ్యవహరించేవారు. తన తల్లిదండ్రుల సేవ కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. తండ్రికి వృద్ధాప్యంలో చాలా సేవ చేశారు. బతికి ఉన్నప్పుడు తల్లిదండ్రులు నాకు; మరణించిన పిదప రాయ్ సాహబ్ సురేంద్ర నాథ్ (తమ్ముడు)కు చెందుతారు అనేవారు తమ తండ్రిగారితో పరమ దయాల్‌జీ మహారాజ్.

తన తమ్ముడు రాయ్ సాహబ్‌ను సదా తన పుత్రుడిగా భావించేవారు. పరమ దయాల్ మహారాజ్ బాగవాన్ స్టేషన్‌లో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా ఉండేవారు. ఒకసారి ఆఫీసు వారు ఒకవారం ఆదాయంలోని భాగాన్ని మహారాజ్ వంతుకు రెండు రూపాయలను ఇంటికి పంపించారు. ఆ రోజు ఆకస్మాత్తుగా ఒక డెబిట్ నోట్ ఆఫీసు నుండి వచ్చింది. పరమ దయాల్ జీ లెక్కల్లో ఒక తాళం మాయమైంది. దాని వెల రెండు రూపాయలు. పరమ దయాల్ జీ మహారాజ్ స్టేషన్ మాస్టర్‌తో "ఈ రెండు రూపాయలు మీరు పంపినవి. ఆరు పైసలు దీనికి వడ్డీ నేనివ్వవలసి వచ్చింది" అన్నారు. ఆనాటి తర్వాత పై ఆదాయంలోని భాగం పంపించడానికి స్టేషన్ మాస్టర్ ఏనాడూ సాహసించలేదు.

పరమ దయాల్ జీ కుందియా స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌గా ఉన్నారు. ఆయనకు రాత్రి డ్యూటీ చేయవలసి వచ్చింది. మూడు రైళ్ళ క్రాసింగ్ ఉంది.

చిక్కని చీకటి. తుఫాను – వర్షం కురుస్తోంది. సిగ్నల్ వెలుతురు కూడా కన్పించటం లేదు. కాంటావారు గాభరా పడుతున్నారు. మహారాజ్ ప్లాట్‌ఫారం పై ఉన్నారు. దాతా దయాల్‌ను ధ్యానిస్తూ తనలోతాను నిమగ్నమయ్యారు. కళ్ళు తెరిచి చూసేసరికి మూడు రైళ్ళు తమ తమ స్థానాల్లో వచ్చి నిల్చున్నాయి. మహారాజ్ ఆశ్చర్యచకితులయ్యారు. రైళ్ళ దగ్గరికీ వెళ్ళి ప్రతి డ్రైవరునూ "మీ రైలు స్టేషన్‌లోకి ఎలా వచ్చింది" అని అడిగారు. "మీరు స్వయంగా ఇంజనుపై వచ్చి రైలును ప్లాట్‌ఫారం లోపలికి తీసుకు వచ్చారు" అని ముగ్గురూ డ్రైవర్లూ చెప్పారు. మహారాజ్ మరింత ఆశ్చర్యపోయారు. మరో విషయం వింటే మనం ఆశ్చర్యానికి లోనవుతాం. మహారాజ్ రైల్వే స్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగం చేసినా తన విధి నిర్వహణ సమయం ముగిశాక ఏ బంధువునో, మిత్రుడినో రైల్లో పంపించడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్ళవలసి వస్తే ప్లాట్‌ఫారం టికెట్ తీసుకునే లోపలికి వెళ్ళేవారు.

## రైల్వే ఉద్యోగం నుండి పదవీ విరమణ

మార్చి 1941లో ఫరీద్ కోట రైల్వేస్టేషన్ నుండి రిటైర్ కావలసి ఉంది. పూర్వీకుల నుండి వస్తున్న ఇంట్లో ఉండాలనుకోవటం లేదు. ఎందుకంటే వారి తండ్రి వడ్డీవ్యాపారం చేసేవాడు. వడ్డీ డబ్బు ఇస్తున్న రుణగ్రహీత సంతోషంగా వడ్డీ చెల్లించడు. తప్పనిసరై బాధపడుతూ ఇవ్వక తప్పదు గనుక ఇస్తాడు. అట్లా సంపాదించిన డబ్బుతో కొన్న స్థలంలో ఇంటిని కట్టించాడు తండ్రి. "ఈ ఇంట్లో ఎవరూ ఉండజాలరు" అన్నారు మహారాజ్. అలాగే జరిగింది. ఇప్పటివరకు ఆ ఇల్లు నిర్జనమై, శిథిలమైపడి ఉంది. అయాతంగా వచ్చిన డబ్బు వలన సరైన పరిణామం ఉండదని మహారాజ్ ఆలోచన. భూమిని పొందటంలో ఇతరుల మనసు నొప్పించబడింది. కనుక ఆ ఇంట్లో ఉండకూడదనుకున్నారు. తమ సంపాదనతో హోషియార్‌పూర్‌లో రైల్వే మండీలో స్థలం కొనుక్కుని 1941 జూన్‌లో ఇల్లు కట్టించుకున్నారు.

1941 ఏప్రిల్‌లో రిటైరై హోషియార్‌పుర్‌కు వచ్చేశారు. అద్దె ఇంట్లో ఉంటూ కొత్త ఇల్లు కట్టించారు. 19 జూన్ నాడు చాలామంది సత్సంగీయ సోదరులను పిలుచుకుని ఇంట్లో గృహ ప్రవేశం చేశారు. కొత్త ఇంట్లో వందలాది మందికి భోజనం వడ్డించారు. సత్సంగం చేశారు. నివసించటం ప్రారంభించారు.

ఒక సత్యమైన సంత్, ఫకీర్ ఏ విధంగా సత్సంగీయులతో ఆట ఆడతాడో, తన క్రియాత్మక జీవన వ్యవహారంతో సత్సంగీయుల హృదయంలో ప్రేమ జాగృతం చేస్తాడో, మనసు నిర్మలం కావటంలో, సాధనలో ఎలా సహాయం చేస్తాడో ఒకటి రెండు ఉదాహరణలు పరిశీలిద్దాం.

గృహ ప్రవేశ సమయంలో మహారాజ్ కొందరు సత్సంగీయులను పిలిచారు. దాదాపు యాభైమంది సత్సంగీయులు ఒకేసారి భోజనానికి కూర్చున్నారు. రెండు, మూడు రోజుల ముందు నుండి మహారాజ్ ఆరోగ్యం బాగాలేదు. జ్వరంతో బాధపడుతున్నారు. అయినా సత్సంగీయులందరికీ తనే వడ్డించారు. వడ్డించిన తరువాత ఒక విస్తరాకు చేతిలోకి తీసుకుని ప్రతి ఒక్క సత్సంగి ఎదుటికి వెళ్ళి వారి విస్తరాకులో నుండి వారి చేతి నుండి ఒక్కో తులం భోజనం అడిగి పెట్టించుకున్నారు. తరువాత ఆ భోజనాన్ని తీసుకుని సత్సంగీయుల మధ్య కూర్చుని తిన్నారు. ఓ గంట తరువాత సత్సంగీయులతో పాటే కూర్చుని మామిడి పండు తిన్నారు. మధ్యాహ్నం దాదాపు రెండు గంటలకు జ్వర తీవ్రత పెరిగింది. గుడ్డ కప్పుకుని సమాధి స్థితిలోకి వెళ్ళారు.

దాతా దయాల్ ఆజ్ఞను జ్ఞాపకం చేసుకున్నారు. తన నిజ అనుభవం ఆధారంగా 'హిదాయత్ నామా' వ్యాఖ్యానం రాసి ప్రచురించారు. వేలాదిమంది సత్సంగీయులు చదివారు. భ్రమల తెరలు తొలగిపోసాగాయి. సత్సంగీయులు మహారాజ్ సాంగత్యంలోకి రాసాగారు.

అందరి కోసం సాధారణ సత్సంగం ప్రారంభించాలా వద్దా అనేది ఇంకా ఆయన నిర్ణయించుకోలేదు. ఒక్కోసారి సత్సంగం జారీ చేయాలనుకుంటారు. మరోసారి వద్దు అనిపిస్తుంది. అబద్ధం చెప్పటం తన వల్ల కాదు. తెరలు ఉంచి

మాట్లాడటం అనగా సత్యానికి పరదాలు కప్పి అబద్ధాలు చెప్పడానికి మనసు ఒప్పుకోదు. సత్యాన్ని గ్రహించే వారెవరూ లేరు. సత్యం చెప్పేవారి తలపై దెబ్బలు పడతాయి. ఈ ఆలోచనలతో కొన్నిరోజులు గడిచాయి.

దాతా దయాల్ రూపంగా బాబా సావన్ సింగ్ జీ మహారాజ్‌ను భావించి ఆయనతో ఈ విషయం ప్రార్థించాలనుకున్నారు. బాబా సావన్‌సింగ్ జీ మహారాజ్ వ్యాస్ సత్సంగం ఆచార్యుడు. ఆయన ఏ ఆజ్ఞ ఇచ్చినా దానిని దాతాదయాల్ జీ ఆజ్ఞగా భావించి పాటిస్తాను అనుకొని రైలెక్కి బాబా జైమల్‌సింగ్ డేరాకు వెళ్ళారు. మహర్షి దాతా దయాల్ మహారాజ్‌కు బాబా సావన్‌సింగ్ మహారాజ్‌కు మధ్య అత్యధిక ప్రేమ, గౌరవాలున్నాయి. బాబాజీ మంచంపై కూర్చుని ఉన్నారు. మహారాజ్ ఆయన ఎదుటికి వెళ్ళారు. ప్రేమావేశాలతో తన ఆలోచనను వ్యక్తం చేశారు. కళ్ళలో నుండి ప్రేమాశ్రువులు కురుస్తున్నాయి. తనువు గురించిన స్పృహే లేదు. 20–25 నిమిషాల పాటు ఇదే స్థితి. కళ్ళు తెరిచి చూస్తే బాబాజీ మంచం దిగి వచ్చారు. మహారాజ్ దగ్గర కూర్చున్నారు. వీపుపై చేతితో నిమురుతూ ఓదారుస్తూ, "గురువాజ్ఞ ముఖ్యం. సత్సంగ క్రమం ఆపకుండా నిర్వహించు. సత్యాన్ని ఘోషించు. నేను నీ వెంట అండగా ఉంటాను" అన్నారు.

మహారాజ్ రాబోయే సమస్యను, ఆపదను వివరించారు. హోషియార్‌పుర్‌లో సత్సంగీయుల సంఖ్య అత్యధికంగా ఉండేది. వారికి మహారాజ్ తన ఇంట్లోనే భోజనం ఏర్పాటు చేసేవారు. సత్సంగం ఇచ్చేవారు. చాలామంది సత్సంగీయులతో సంబంధ బాంధవ్యాలున్నాయి. ఆదాయ మార్గం లేదు. సత్యం వ్యక్తం చేయాలనే కాంక్ష ఉంది. డేరా లేదు. ధామం లేదు. ఎవరి వద్దా ఏమీ తీసుకునేదీ లేదు. పని జరగాలంటే ఎలా జరుగుతుంది?

బాబా సావన్‌సింగ్ మహారాజ్ "లాహోర్ కో, ఫిరోజ్‌పుర్‌కో వెళ్ళి సత్సంగం నిర్వర్తించు. దైవేచ్ఛ ఏదో ఒక ఏర్పాటు చేస్తుంది" అన్నారు. మహారాజ్ అక్కడినుండి లాహోర్‌కు వెళ్ళారు. కొన్నిరోజుల తరువాత అక్కడినుండి ఫిరోజ్‌పుర్‌కు వెళ్ళారు.

# మిలిటరీలో మళ్ళీ ఉద్యోగం

ఫిరోజ్‌పుర్‌లో వెంటనే ఉద్యోగం వచ్చింది. మిలిటరీ కార్యాలయంలో ఉద్యోగం లభించింది. ఇది 1943 నాటి మాట. వేతనం ఎక్కువగానే వచ్చేది. ఆఫీసులో అందరూ గౌరవించేవారు. నగరంలో స్వాగత సత్కారాలు లభించేవి. ప్రతి ఆదివారం జనరల్ సత్సంగం జరిగేది. దూర తీరాల నుండి సత్సంగీయులు వచ్చేవారు. ఆదివారం మాత్రమే గాక ఇతర రోజుల్లోనూ సత్సంగీయులు వచ్చేవారు. వారికి ఆఫీసు నుండి వచ్చాక సత్సంగం ఇచ్చేవారు. మొదట్లో కొన్నిరోజులు పండిత్ వలీరామ్ సాహబ్ హకీమ్ గారి దగ్గర సత్సంగం ఏర్పాటు చేశారు. అక్కడ స్థలం కొద్దిగా ఉంది. వచ్చీపోయేవారి సంఖ్య అధికం కాసాగింది. కాశీనగరిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. ఇది నగరం పొలిమేరల్లో విశాలమైన ఖాళీస్థలంలో ఉంది.

ఈ రోజుల్లోనే "బారహ మాసా", "సురత్ సంవాదం - మాయా సంవాదం"లకు వ్యాఖ్యానం రాశారు. ఫిరోజ్‌పుర్‌లో వేడిమి ఎక్కువగా ఉండేది. వేడి గాలులు వీస్తున్నాయి. ప్రజలు ఇళ్ళల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. మధ్యాహ్న వేళ! జ్వరం! మహారాజ్ ఆఫీసు నుండి ఇంటికి కాలినడకన రావలసి వచ్చింది. నడవటం కష్టంగా ఉంది. మహారాజ్ వెంట స్టేషన్ మాస్టర్ శ్రీ బుధరామ్ ఉండి, నడుముపై చేయివేసి నడిపిస్తున్నాడు. మహారాజ్ మనసులో "ఈ వయసులో ఇది ఎంత కష్టమైన పని" అనే ఆలోచన కలిగింది. మనసులో ఉదాసీనత వ్యాపించింది. ఇంతలో బలహీనంగా ఉన్న ఓ వృద్ధుడు, అంధుడు చేతి కర్ర సహాయంతో వస్తున్నాడు. మహారాజ్‌కు ఆలోచించడానికి అవకాశం వచ్చింది. దాతా దయాల్‌జీకి ధన్యవాదాలర్పించారు. ఈ అంధుని కంటే తన స్థితి ఎంతో బాగుందని పించగానే చిత్తంలోని ఉదాసీనత తొలగిపోయి, ఉత్సాహం, సాహసం ప్రవేశించాయి. సంతోషంగా ముందుకు సాగారు.

ఒకరోజు సాయంకాలం ఫిరోజ్‌పుర్‌లో పండిత్ వలీరామ్ ఔషధాలయంలో సత్సంగం ఇస్తున్నారు. ప్రసాదం పంచడానికి ఏమీ లేదు. మహారాజ్ జేబులో కొంచెం రెజ్‌గారీ ఉంది. పండిత్ వలీరామ్‌తో "కొన్ని పైసలున్నాయి" అన్నారు.

ఆయన రెండు మూడు రూపాయల రేజ్‌గారీ తీసిచ్చాడు. మహారాజ్ దానిని ప్రసాదంగా పంచిపెట్టారు.

సత్సంగం ముగిశాక భోజనం చేశారు. ఏప్రిల్ మాసం చాలా ఉక్కపోతగా వుంది. పండిత్ వలీరామ్ ఇంట్లో రెండవ అంతస్తులో మహారాజ్ పడుకునేవారు. స్థానికంగా ఉన్న సత్సంగీయులు తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. పీరేముగాం సాహబ్, బాబూ రామ్ ప్రకాశ్, శ్రీ ఆనంద దయాల్, భగవాన్ సింగ్ శర్మ మిగిలారు. ఇవాళ మనమంతా కలిసి విశ్రాంతి తీసుకుందాం" అన్నారు మహారాజ్. భగవాన్ సింగ్ శర్మకు జలుబుగా ఉన్నందున ఆయనను మంచంపై పడుకోమన్నారు. వరండాలో మంచం వేయించారు. పరమ దయాల్‌జీ ఇంకా మిగిలిన ముగ్గురు జంపఖానా పరిపించి నిద్రించారు.

"నాకూ, సత్సంగీయులకు తేడా ఏమీ లేదు. నేనేదై ఉన్నానో వారూ అదే! నా భ్రమలు, అజ్ఞానం తొలగిపోయాయి. వారివి తొలగిపోలేదు. కనుక సత్సంగం చేయించేటప్పుడు నేనా మంచంపైనో లేక ఏదైనా ఎత్తయిన స్థానం పైనో కూర్చోవడానికి నేనిష్టపడను. కానీ ప్రాపంచిక సభ్యత, రీతి రివాజులు వివశుణ్ణి చేస్తాయి. తప్పనిసరై సత్సంగీయుల భావాలకు అనుగుణంగా కుర్చీపైనో, మంచంపైనో కూర్చుంటాను" అంటారు పరమ దయాల్‌జీ.

నాలుగైదు సంవత్సరాల తరువాత ఆయనకు బెంగుళూరుకు బదిలీ అయింది. దాదాపు ఒకటిన్నర సంవత్సరం పాటు అక్కడున్నారు. "హయాత్ నౌ" అనే పుస్తకం అక్కడే రాశారు. అది ప్రచురించబడింది కూడా!

పరమ దయాల్ జీ మహారాజ్ శరీరం దుర్బలమవుతూ వచ్చింది. 63 సంవత్సరాల వయసు. ఉద్యోగంలో ఎక్కువ సంవత్సరాల కాలం గడిచింది. కనుక 1948 ఆగస్టు మాసంలో మహారాజ్‌ను రిటైర్ చేశారు. మహారాజ్ ఎంతో బాగా తన విధి నిర్వహణ చేసినా ప్రభుత్వ నియమాల ప్రకారం ఇంకా మరికొంత కాలం పనిచేయడానికి అవకాశమివ్వలేదు. బెంగుళూరులో కూడా అటు ఆఫీసులో, ఇటు ప్రజలలో మహారాజ్‌కు గౌరవాదరాలు పుష్కలముగా

లభించాయి. వందలాది మంది మహారాజ్ నుండి సత్సంగ లాభం పొందారు. చాలామంది నామ దీక్ష తీసుకున్నారు. రెండు మూడేళ్ళ కాలంలోనే ఈ ప్రాంతంలో సంత్ మతం మహిమను చాటారు.

పరమ దయాళ్ జీ మహారాజ్ ఉదార హృదయులు. దయా సాగరులు. శ్రద్ధాళురైన సత్సంగీయుల కోసం పెద్ద పెద్ద త్యాగాలు చేయడానికైనా వెనుకాడేవారు కాదు. జీవుల దుఃఖాలను అర్థం చేసుకునేవారు. "నా బాధ్యతను గుర్తిస్తుంటాను" అని సత్సంగంలో తరచుగా చెప్పేవారు. వేలాదిమంది సత్సంగీయులు బయటి ప్రాంతాల నుండి ఖర్చులు పెట్టుకుని వస్తారు. వారి ఉదాసీనత, బాధను చూసి ఆయన హృదయం భారమవుతుంది. వారి మానసిక శక్తిని పెంపొందింప చేసేటందుకు ప్రసన్నం చేసేటందుకు హితవు కోరుతూ, ఆయన ప్రేమ అనే సహాయం అందించేటందుకు ప్రయత్నం చేస్తారు. సత్యవాక్ దురంధరత, స్పష్టమైన వర్ణన ఆయన జీవన సిద్ధాంతాలు. హితం, అభిమతం తప్ప నా దగ్గరేమీ లేదు అనేవారు. "ఎవరైనా అసలు విషయాన్ని అర్థం చేసుకుని నా హితం, అభిమతములను తీసుకుని, క్రియాత్మక జీవనంలో, ఆచరణ జీవనంలో తమ స్నేహితునిగా చేసుకుంటే వారి దుఃఖం దూరమైపోవాలని నా విశ్వాసం. ఒకవేళ అలా కాకుంటే నేను సత్యమైన ఫకీర్‌ను కానని భావిస్తాను." ఆయన వచనం – వాక్కు వేలసార్లు సత్యమైనదని రుజువైంది. వేలాదిమంది తమ తమ కోరికలను పూర్తి చేసుకున్నారు. సిద్ధింప చేసుకున్నారు. ఒక సంఘటన! ఢిల్లీ వాస్తవ్యులు శ్రీ ఆనంద దయాల్‌కు అన్నగారు శ్రీ రామ్ ప్రకాశ్ 1942లో ఆయన మహారాజ్ దగ్గర నామదానం – దీక్ష తీసుకున్నాడు. ఆయన ఎంతో శ్రద్ధాళువు. భక్తుడు. భారతదేశ విభజనకు పూర్వం లాహోర్‌లో ఉండేవాడు. హిందూ ముస్లిముల జగడాల భయం ఉండేది. శ్రీరామ్ ప్రకాశ్‌తో "మర్చిపో నీవు ఏదో ఒక పార్టీ లేక సమాజంతో సంబంధం కలిగి ఉన్నావనే విషయం మరిచిపో. ద్వేషభావం పెట్టుకోకు. మనసు, వాక్కు కర్మలతో శుచిగా, శుద్ధిగా ఉండు. భగవంతునిపై పూర్తి విశ్వాసం కలిగి వుండు. ఆయన దయ చూపుతాడు. నీకు ఆవగింజంత నష్టం, కష్టం కలగదు. నిన్నెవరూ ఏమీ చేయలేరు" అన్నారు మహారాజ్.

శ్రీరామ్ ప్రకాశ్‌గారు మహారాజ్ సూచనను, మార్గదర్శకత్వాన్ని నియమంగా, సత్యంతో పాటించాడు. 1947లో దేశ విభజన సమయంలో ఆయన సామాను గురించి చింతించలేదు. ప్రాణం కాపాడుకోవడానికి సామానునంతా ఇంట్లోనే వదిలి పెట్టి భార్యను వెంటబెట్టుకుని ఢిల్లీకి వచ్చేశాడు. "నా సామాను అంతా లాహోర్‌లో ఉండిపోయింది. నేను నీ ఆజ్ఞాపాలన చేశాను. అన్నీ వదిలి ఢిల్లీకి వచ్చేశాను" అని మహారాజ్‌కు ఉత్తరం రాశారు.

మహారాజ్‌కు చాలా దుఃఖమన్పించింది. రామ్ ప్రకాశ్‌కు ఇలా జవాబు రాశారు – "నేనొక సాధారణ గృహస్థుడిని. నీ నష్టాన్ని పూర్తిచేయగల సామర్థ్యం నాకు లేదు. ఎందుకంటే నీవు నా ఆజ్ఞను పాటించావు. దాని వలన నష్టం జరిగింది. నేను ఒక వెయ్యి రూపాయలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. కానీ శరతేమిటంటే ఇకపైన నీవు నాపై విశ్వాసం పెట్టుకోవద్దు. నాతో నీ ప్రాపంచిక, ఆత్మిక సంబంధాలు కొనసాగించవద్దు"... రామ్ ప్రకాశ్ అభ్యాసికుడు, అనుభవజ్ఞుడు. మహారాజ్‌పైన సంపూర్ణ విశ్వాసం కలవాడు. ఉత్తరం చదివి చకితుడయ్యాడు.

కొన్నిరోజుల తరువాత రామ్ ప్రకాశ్ బంధువొకరు ప్రభుత్వ కార్యనిర్వహణ కోసం లాహోర్‌కు వెళ్ళాడు. అక్కడ అతనికి ఓ ఆలోచన వచ్చింది. రామ్ ప్రకాశ్ ఇల్లు ఎలా ఉందో చూడాలి. ఏమైనా కొంచెం సామాను లభిస్తే తీసుకువెళ్ళాలి అనుకున్నాడు. పోలీసును వెంట బెట్టుకుని ఆ ఇంటికి వెళ్ళాడు. ఆ ఇంట్లో ఎవరో ముస్లిములు నివసిస్తున్నారు. కానీ రామ్ ప్రకాశ్ సామాను ఏ గదిలో ఉంచారో అది చెక్కు చెదరకుండా అట్లాగే ఉంది.

అతడు సామానును వెంట తీసుకుని అమృతసర్‌కు వచ్చాడు. "నీ సామాను అంతా తీసుకొచ్చేశాను" అని రామ్ ప్రకాశ్‌కు ఉత్తరం రాశాడు. రామ్ ప్రకాశ్ విశ్వాసం మరింత దృఢపడింది. మహారాజ్ మూర్తి చరణాలలో శిరసు వంచాడు. తులసీరామ్‌జీ అంటారు – ఇలా –

***"జో కోయీ కహే సంత్ కో చీతా ! తులసీ హాథ్ కాన్ ధర్ లేతా ॥***

ఉద్యోగ విరమణ తరువాత పరమ దయాల్ జీ మహారాజ్ అక్టోబరు 1948లో ఢిల్లీకి వచ్చేశారు. ఖాళీగా, పనిచేయకుండా కూర్చోవటం మహారాజ్‌కు ఇష్టం లేదు. రెండు నెలల పాటు శ్రీహర్ స్వరూప్ గుప్తా గారి క్వార్టర్‌లో ఢిల్లీలో ఉన్నారు. అక్కడి నుండి హోషియార్‌పుర్‌కు వచ్చారు. 'విశ్వశాంతి' అనే పుస్తకం అక్కడే రాశారు. మహారాజ్‌గారి మిత్రుడు శ్రీ ఖుశీరామ్ సూద్‌కు పిండిమర యంత్రం వుంది. అక్కడ నెలకు 60 రూపాయల జీతానికి పని చేశారు. ఉదయం 7 గంటలకు గిర్నీకి వెళ్ళేవారు. సాయంకాలం 7 గంటలకు ఇంటికి బయల్దేరేవారు. ఈ వయసులో 12 గంటలు డ్యూటీ. రేశన్ పని చేసేవారు. కేవలం ఆదివారం శలవు దొరికేది. ఆ రోజు దూరం నుండి వచ్చేవారికి, నగరంలోని సత్సంగీయులకు సత్సంగం ఇచ్చేవారు.

సర్దార్ బహాదుర్ జగత్‌సింహ జీ వ్యాస్ సత్సంగ ఆచార్యుడు. మహారాజ్‌ను చాలా ప్రేమించేవాడు. హోషియార్‌పుర్ వైపు నుండి వెళ్ళటం సంభవిస్తే తప్పనిసరిగా మహారాజ్‌ను కలిసి వెళ్ళేవారు. సర్దార్ బహాదుర్ సంతులలో ఒక సత్యమైన సంత్ అని అంటారు పరమ దయాల్‌జీ. ధాన్యాన్ని పిండి గిర్నీలో వేసి పిండి చేసిన తరువాత దానిని తూకం వేసేవారు. ఎప్పుడైనా అజాగ్రత్త వల్ల కొంచెం పిండి నేలపై పడిపోయేది. అప్పుడాయన దానిని తీసి మళ్ళీ బస్తాలో వేసేవారు కాదు. బయట పశు పక్ష్యాదులకు వేయించేవారు. ఆ లోటును సరిచేయడానికి తన జేబులో నుండి డబ్బు తీసిచ్చేవారు. "ప్రజలకు శుభ్రమైన పిండి ఇవ్వటం నా కర్తవ్యం. మట్టి కలిసిన చటాకు పిండి అయినా బస్తాలో వేస్తే నేను నా కర్తవ్యం నుండి పతనమైనట్లే. పొరపాటు నా వల్ల జరిగింది. నష్టం నేనే భరించాలి" అనేవారు. ప్రేమ, సానుభూతుల వలన గిర్నీలో పనిచేసే ఉద్యోగులందరూ మనస్ఫూర్తిగా మహారాజ్‌ను అభిమానించేవారు.

వయసు పెరుగుతోంది. శారీరిక శక్తి తగ్గుతోంది. తన కర్తవ్యం నెరవేర్చుకునే టందుకు ఇతరులను కష్టపెట్టడం, వారి నుండి సహాయం పొందటం ఆయనకు తెలియదు. ఒకరోజు పిండిగిర్నీ యజమానితో "ఈ బస్తాలు తీసి మరోచోట

పెట్టటం నాకు సాధ్యం కావటం లేదు. ఉద్యోగం వదిలిపెట్టాలనుకుంటున్నాను" అన్నారు. "మహారాజ్! అలాంటి ఆలోచన పెట్టుకోకండి. బస్తా లేవనెత్తడం, దించడం వంటి పనికి మరో మనిషిని నియమిస్తాను" అన్నాడు యజమాని ఖుషీరామ్ జీ. "ఇలా అయితే ఒక నౌకరుకు నీవు జీతం ఎక్కువ ఇవ్వాల్సి ఉంటుంది. కనుక ఒక షరతుపై పనిచేయగలను. మీరు నాకు నెలకు 60రూ. ఇస్తున్నారు. నేను 20 రూపాయలకు పనిచేస్తాను. మిగతా 40 రూ. బస్తాలు లేవనెత్తే పనికోసం ఆ మనిషికివ్వండి" అన్నారు. యజమాని ఇందుకు అంగీకరించాడు.

మహారాజ్ జీవితాన్ని దగ్గరగా చూసే అవకాశం నాకు లభించింది కనుక ఆయన జీవన వృత్తాంతాన్ని ఖచ్చితంగా తెలిపేటందుకు సాహసిస్తున్నాను. ప్రారంభం నుండే ఆయన జీవనం సత్యపాలన, నిజాయతీ, పరోపకార గుణాలతో నిండి ఉంది. ఇలాంటి ఉదాహరణ చరిత్రలో వెదికినా దొరకదు. మహర్షి దాతా దయాల్ మహారాజ్ తను చెప్పిన అమూల్య వచనాలు "జీవనంలో నీవు సంపాదించుకోవటం, నీ సంపాదనతో తినటం, ఇతరుల సహాయం ఎప్పుడూ తీసుకోకపోవటం" అనే అంశాలను దృఢ నిశ్చయంతో జీవితమంతా పాటించారు.

ఉద్యోగం చేసే కాలంలో ఆఫీసుకు సంబంధించిన సిరాతో తన వ్యక్తిగత ఉత్తరం సైతం రాసుకోలేదు. ప్రభుత్వ సమయాన్ని ఎన్నడూ వృధా చేయలేదు. ఒకనాటి విషయం! మహారాజ్ ఫిరోజ్‌పుర్‌లో మిలిటరీ ఆఫీసులో ఉద్యోగి. మరో ఆఫీసర్‌కు మహారాజ్ ఓ సంత్ అని తెలిసింది. ఒకరోజు ఆయన మహారాజ్‌ను తన గదికి ఆహ్వానించి ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడాలనుకున్నాడు. మహారాజ్ నిర్భయుడై, "మహాశయా! రెండు విషయాలు! తమరు కుర్చీపైన కూర్చుని ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నారు. రెండవది ఇది ఆఫీసు టైము. ఆ సమయాన్ని ప్రైవేటు మాటలలో నష్టపరిచితే నేను దీనిని మోసం, అధర్మం అని భావిస్తాను" అన్నారు. ఆఫీసర్‌గారు చకితుడై మహారాజ్ ముఖంవైపు ఆశ్చర్యంగా చూడసాగాడు.

15 రూపాయల వేతనంతో ఒక దుకాణంలో లెక్కలు రాసేవారు. రెండు నెలలు పనిచేశాక దుకాణం యజమానితో "నీ దగ్గర పని తక్కువగా వుంది. కనుక నెలకు కేవలం 10 రూపాయలే తీసుకుంటాను" అన్నారు. ఇదీ ఆయన జీవన ఆదర్శం.

ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేసే ఒక రేషన్ దుకాణానికి సంబంధించిన ఫ్లోర్ మిల్లులో మహారాజ్ పనిచేశారు. పని చేస్తూ చేస్తూ ఎన్నో నెలలు గడిచాయి. ఒకరోజు మిల్లు యజమాని ఒక మనిషిని పంపించి పదిసేర్ల పిండి ఇంటికి తీసుకు రమ్మని చెప్పాడు. అతనికి జవాబుగా పిండికి బదులు మిల్లు తాళం చెవులు యజమాని దగ్గరికి పంపించారు మహారాజ్. మిల్లు యజమాని ఘ్రాన్పడిపోయాడు. అయనే వచ్చి "నేను పిండి అడిగాను. మీరు తాళం చెవులు ఎందుకు ఇచ్చారు" అని అడిగాడు. "ఈ గోధుమలు ప్రభుత్వానివి. నేను దీనికి లెక్క చెప్పాలి. మీరు స్వయంగా తీసుకుని వెళ్ళవచ్చు. నేను పని చేయను" అన్నారు మహారాజ్. యజమాని మహారాజ్‌ను చాలాకాలం నుండి చూస్తున్నాడు. ఆయన గురించి బాగా తెలుసు. సిగ్గుతో తలవంచుకుని శరణాగతుడయ్యాడు.

మిల్లులో గోధుమలు పాడైపోతే లేదా తక్కువగా తూచడం వల్ల పిండి కట్టడంలో ఎంత తగ్గాలో అంతేగాకుండా ఎక్కువగా తగ్గసాగింది. ఆ లోటును మహారాజ్ తన జేబులో డబ్బుతో గోధుమలనో, పిండినో కొని నింపిపెట్టేవారు. మహారాజ్ ఆ మిల్లులో 9 సంవత్సరాలు పనిచేశారు. కానీ మిల్లు యజమానులకు గానీ, జమా ఖర్చులు రాసే మునీమ్‌గానీ చెప్పలేదు. కానీ మునీమ్‌కు ఇది తెలుసు. రేషన్ బంద్ అయ్యాక ఆయన మిల్లు యజమానికి ఈ విషయం చెప్పాడు. ఆయన మహారాజ్‌తో "ఇది నిజమేనా? పిండి తగ్గితే మీరు మీ డబ్బుతో లోటు పూడ్చారా?" అని అడిగాడు. మహారాజ్ ఏ జవాబూ చెప్పలేదు. "ఇప్పుడు ఉద్యోగం చేయను" ... అని ఉద్యోగం వదిలి పెట్టారు. ఇదీ మహారాజ్ సత్య సంధత, నిజాయితీల సత్యమైన ఆదర్శం. సంతులు తమ జీవనాన్ని ఆదర్శవంతంగా గడుపుతారు.

వశిష్ట మహర్షికి తన శిష్యుడైన హరిశ్చంద్రుణ్ణి చూస్తే ఎంతో గర్వంగా ఉండేది. ఎందుకంటే హరిశ్చంద్రుడు సదా సత్యంపై దృఢంగా నిలిచి ఉన్నాడు.

విశ్వామిత్రుడు ఎన్ని కఠిన పరీక్షలు పెట్టినా ఆయన తన సత్యసంధతను విడనాడలేదు. "నాకు ఫకీర్‌ను చూస్తే గర్వంగా ఉంటుంది" అని మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ కూడా ఇదే మాట అన్నారు. పరమ దయాల్ జీకి కూడా తన గురువుపైన సంపూర్ణ విశ్వాసం ఉంది.

మహర్షి చరణాలలోకి రాకముందు జరిగిన సంఘటన. మహారాజ్ టాగాన్‌వాలా స్టేషన్‌లో పని చేసేవారు. రామాయణం పఠించేవారు. ఒకసారి పఠనం ముగిశాక నైవేద్యం పెట్టవలసి వచ్చింది. మహారాజ్ గారి అన్నగారు పండిత్ రామనారాయణ రెండుసేర్ల హల్వా తయారు చేశాడు. ఈ నగరంలో ఆర్య సమాజానికి చెందిన ఒక ఓవర్‌సియర్ ఉండేవాడు. అతడు మహారాజ్‌గారి భగవత్ప్రేమ, రామాయణం పట్ల ఉన్న శ్రద్ధ చూసి చీదరించుకునేవాడు. మహారాజ్‌ను అవమానించాలని అవకాశం కోసం చూస్తున్నాడు. మహారాజ్ నైవేద్యం పెడుతున్నారని తెలియగానే ఎక్కువ ఖర్చు పెట్టించాలనే ఉద్దేశంతో తన కూలీ వాళ్ళందర్నీ తీసుకుని నివేదన సమయంలో వచ్చాడు. కూలీలంతా కలిసి 400 మంది ఉన్నారు. అందర్నీ తీసుకునొచ్చాడు. పండిత్ భగవాన్‌దాస్ "ప్రసాదం కొంచెం ఉంది. జనం చాలామంది వచ్చారు" అని చెప్పాడు మహారాజ్‌తో. "కొంచెం కొంచెంగా అందరికీ పంచిపెట్టు. ప్రసాదం మొత్తం సమాప్తమైపోతే సమాప్తమైపోయిందని చెప్పు. మనం పేదలం. ఇందులో పాపమేముంది?" అన్నారు. భగవాన్‌దాస్ ఉదాసీనుడై మనకు "చెడుపేరు వస్తుంది" అన్నాడు.

"ఒక పని చేయి. ప్రసాదాన్ని గుడ్డతో కప్పి ఉంచు. గుడ్డ తీయొద్దు. దాని కింద చేయి పెట్టి ప్రసాదం పంచి పెట్టు" అన్నారు మహారాజ్.

భగవాన్‌దాస్ ఇలాగే చేశాడు. కూలీలు పంతానికి, వీరిని కష్టపెట్టాలని రెండు రెండు, మూడు మూడుసార్లు ప్రసాదం తీసుకున్నారు. కానీ ప్రసాదం సమాప్తం అయిపోలేదు. అందరూ ప్రసాదం తీసుకుని వెళ్ళి పోయారు. బట్టతీసి చూస్తే ఇంకా కొంచెం ప్రసాదం మిగిలి ఉంది. ప్రేమ, విశ్వాసముల ఆట లీల ఇదీ!

ఇక్కడి దాకా మహారాజ్ జీవన సంఘటనలను ఇవ్వడం జరిగింది. వీటివలన తెలుస్తోందేమిటంటే మహారాజ్ ప్రపంచానికి మార్గ దర్శనం చేయడానికి

ప్రకటమయ్యారు. సంత్ అవసరాన్ని బట్టి ప్రకటమవుతుంటారు. అవతరించారు. అవతరిస్తారు. వారు కేవలం వాచక జ్ఞానంతో మాత్రమే లోకానికి బోధించకుండా తమ ఆచరణయుక్తమైన, క్రియాత్మకమైన జీవనంలో చూపిస్తుంటారు. ప్రతి మనిషీ కర్మ చేస్తూ తన జీవితాన్ని సుఖశాంతులతో గడిపి పరమశాంతి లేదా సత్‌పద పదమును ప్రాప్తించుకోగలుగుతాడు. ఇప్పటివరకూ అవతరించిన సంతులందరూ గృహస్థాశ్రమంలో ఉన్నారు. గృహస్థుల జీవితం గడిపారు. దీనివలన కూడా ఒకటి రుజువవుతున్నది. అదేమిటంటే సంతుల బోధన కేవలం విరక్తులకు, సాధువులకు, జపాలు, తపాలు చేసే వారికే కాదు గృహస్థులకు కూడా ఇది అన్వయిస్తుంది. ఎందుకంటే మహారాజ్ అన్ని విధాలుగా సత్యసంధత, నిజాయితీ, గృహస్థ ధర్మం, సేవా ధర్మములను క్రియాత్మక రూపంగా, ఆచరణ యుక్తంగా పాటించారు. కనుక గృహస్థులకు ఆయన జీవితం ఆదర్శంగా వుండి మార్గదర్శనం చేస్తుంది.

*ఫకీరా! రూప్ తేరా అతిప్యారా॥*

*తూ సత్ చిత్ ఆనంద కీ మూరత్, తూ తీనోఁ సే న్యారా ।*
*తేరీ గతి మతి బుద్ధి న జానే, అటక్ రహీ మంఝధారా ॥*

*కర్మ కియా సత్ కీ చఢా ఘాటీ, చిత్ మే వివేక్ విచారా ।*
*సత్ చిత్ ఆనంద విలాసా, చహుఁ దిశ్ హర్ష పసారా ॥*

*తీన్ త్యాగ్ చౌథే కో ధారే, సో సబ కా ఆధారా ।*
*ద్వంద జగత్ త్రిపుటీ కీ త్రికుటి, ఛోడ్ చలా ఘర్ బారా ॥*

*నహీఁ తూ దోయ్ న తీన్ చార్ హై నహీఁ తూ సహస్ హజారా ।*
*ఏక్ ఏక్ హై ఏక్ ఏక్ హై, జానే జానన్ హారా ॥*

*ఏక్ అనేక్ కహాఁ హై తుఝ మే, యహ భీ భూల్ వికారా ।*
*రాధాస్వామి రూప్ లఖ్ అపనా, తూ వ్యాపక్ సంసారా ॥*

# ద్వితీయ ప్రకరణం

## ఆశ్చర్యకర సంఘటనలు-అద్భుతాలు

ఆశ్చర్యకరమైన, అద్భుతమైన సంఘటనలు సంత్ మతంలో, ఇతర సంప్రదాయాలలో కనిపిస్తుంటాయి. అద్భుతాలు, చమత్కార సంఘటనలు జరగని, చూడని పంథ, మతం, సంత్ మత శాఖ, సాధువు ప్రపంచంలో కనిపించరు. చాలావరకు నిజమే అవుతుంటాయి. చాలా సంఘటనలు శ్రద్ధాళురైన సత్సంగీయులు తమ విశ్వాసం లేక సంప్రదాయాల్ని వ్యక్తం చేయడానికి, లేదా పెంపొందించుకోవడానికి కావాలనే కల్పించి చేరుస్తుంటారు. కొన్ని అద్భుతాలను బౌద్ధిక జగత్తులోని మనిషి ఏ స్థితిలోనూ నమ్మడానికి, అంగీకరించడానికి సిద్ధంగా ఉండదు కానీ ప్రపంచంలో ప్రతి విషయమూ సాధ్యమే. కలలో కూడా ఊహించని సంఘటనలు కొన్ని జరుగుతుంటాయి. బుద్ధిమంతులు వీటిని చూసి చకితులవుతుంటారు. పరమ దయాల్ ఫకీర్ చంద్ జీ మహారాజ్ వలన కూడా ఇలాంటి అద్భుత సంఘటనలు జరిగాయి. ఈ విషయం గురించి మహారాజ్ ప్రమాణ సహితంగా వ్యాఖ్యానించారు. దానిని చదివిన సత్యాన్ని ఇష్టపడే వారు ఈ విషయాలను గురించి మహారాజ్ తమ రచనలలో వర్ణించకున్నా ఆలోచించడానికి వివశుడవుతారు. మహారాజ్ గారి మేధస్సుపై రామాయణం, మహాభారతం వంటి వాటి సంస్కారాలున్నాయి. ప్రాచీన కాలంలో ఋషులు, మహాత్ములు దూరంలో జరిగే విషయాలను చెప్పేవారు. తమ శక్తితో చేతితో నిమిరి దుఃఖితుల దుఃఖాలను, రోగాలను దూరం చేసేవారు. భవిష్యవాణి తెలిపేవారు. ఇలాంటి సంఘటనలు సంభవించడానికి మనిషిలోపల అంతటి శక్తి ఉందా? అది ఎలాంటిది అనేది తెలుసుకోవాలని ఉండేది. వీటిలోని రహస్యం ఏమిటో తెలుసుకోవాలనుకునేవారు మహారాజ్.

మనిషికి బుద్ధి, వివేకం, అర్థం చేసుకోగల శక్తి, తెలివిని ఇవ్వాలి. దేనిని ఆచరించి, క్రియాత్మక జీవనం గడిపితే మనిషి తన శారీరిక, మానసిక, ఆత్మిక

శక్తులను వశం చేసుకుని ప్రాపంచిక జీవనములో సుఖంగా ఉండగలిగేలా చేసుకోగలిగితే అదే అతి పెద్ద అద్భుతమని, విశేషమని మహారాజ్ భావిస్తారు. ఏ మనిషిలోనైనా సత్యమైన తపన, విరహం, పిపాస ఉద్భవిస్తే వారికి ఒక మార్గం చూపించాలి. దానిపై నడవటం వలన, ఆచరించటం వలన తమ శరీరం, మనసు, ఆత్మ నుండి వేరై తమ అసలు స్వరూపంలో లయం కాగలుగుతారు. అలాంటి దారి చూపాలి.

సంత్ మతంలో అభ్యాసంలో మన లోపల ప్రకటమయ్యే అద్భుతాలకు, సంఘటనలకు, చమత్కారాలకు ఎక్కువ గొప్పదనం, ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అభ్యాసంలో శబ్ద, ప్రకాశాల దృశ్యాలను ధృవీకరించటంలో సద్గురువు లేదా పూర్ణ పురుషుడు ఇచ్చిన సంస్కారాలు అభ్యాసికి పథ ప్రదర్శన చేస్తాయి. అతనిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తాయి. మనిషి యొక్క విశ్వాసం, శ్రద్ధాభావములతో మిగతా అన్ని విషయాల సంబంధం ఉంటుంది.

పరమ దయాల్ జీ అనుభవాలను గురించి రాయడానికి ముందు కొన్ని వాస్తవాలను చెప్పటం అవసరమన్పిస్తున్నది. ఎందుకంటే సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవటంలో అది ఎంతైనా సహాయ పడుతుంది. మహారాజ్ పొగడ్తలకు, గౌరవాలకు దూరంగా ఉంటూ సాధారణమైన జీవితం గడిపేవారు. తను సంపాదించుకుంటారు, తింటారు. నేటివరకు ఎవరి ఎదుట చేయి చాచలేదు. సత్యాన్వేషణలో సమస్త జీవనం గడిపారు. కనుక మహారాజ్ తన పంథాను పెంచుకోవడానికో, ధనం సంపాదించుకోవడానికో లేక పేరు ప్రతిష్ఠల కోరికతోనో ఈ మాటలు రాశారని ఎవరూ అనుకోకూడదు.

మహారాజ్ హృదయ ఉదారత, నిస్వార్థం కారణంగా అన్ని శాఖలకు చెందిన సత్సంగీయులు, సంప్రదాయాలకు చెందిన భక్తులు ప్రసన్నతతో వచ్చి ఆయనను కలుసుకుంటుంటారు. మహారాజ్ వారి వారి దృష్టి కోణాల నుండి వారి భ్రమలు, అజ్ఞానాన్ని దూరం చేసి, ఆత్మిక సంతుష్టిని ప్రాప్తించుకునే ఉపాయం చెబుతారు. ఎక్కడ ఎవరిపైన విశ్వాసం ఉంటే వారినే విశ్వసించమని ఆయన

చెబుతారు. "ఏ నామం పొందారో దాని సహాయాన్నే తీసుకొనండి. దేనిని ధ్యానిస్తావో దానితోనే సంబంధం కలిగి ఉండాలి. నా నుండి ఒక సోదరుని రూపంలో సమ్మతిని పొంది దానిని ఆచరించు. అదే నామం, ధ్యానం నీకు లాభదాయకమవుతుంది. నీవు అంతరంలో సత్యవంతుడవై ఉండు. భగవంతుడు అన్ని ప్రాణుల లోపల ఉండి సహాయపడతాడు. ప్రతి ఒక్కరూ ఆయన నుండే వెలువడినవారు. ఆయనలోనే లయమవుతారు. ఎవరు ఏ భావంతో, ఏ విచారంతో ఆయన్ని స్మరణ చేస్తారో అదే రూపంలో ప్రకటమై సహాయం చేస్తాడు. మనిషి ఎంత నిస్పక్షపాతంగా, నిష్కామయుక్తంగా ఉండి తన అంతరంలో సత్య సంధుడై ఉంటే అంతే లాభం కలుగుతుంది.

ఒకసారి మహారాజ్ రైల్వేమండీ హోషియర్‌పుర్‌లో ఇల్లు కట్టిస్తున్నారు. ప్రతిరోజూ సాయంకాలం అక్కడినుండి రెండు మైళ్ళదూరంలో వున్న ఒక గ్రామానికి పండిత్ పురుషోత్తమదాస్ గారి ఇంటికి వచ్చేవారు. ఒకనాడు చీకటైంది. ఒక కాలువలో మహారాజ్ కాలుజారింది. కిందపడిపోయారు. బట్టలన్నీ బురద అంటుకుని పాడయ్యాయి. అలాగే ఇంటికి వెళ్ళారు. పండిత్ పురుషోత్తమ దాసు గారి కుమార్తె ఇంట్లో ఉంది. ఆమె మహారాజ్‌గారి గుడ్డలు ఉతికి ఆరవేసింది. స్నానానికి నీళ్ళు పెట్టింది. మంచం వాల్చి పరుపు పరిచి విశ్రాంతి తీసుకోమని ప్రార్థించింది. ఆమె సేవా భావం మహారాజ్‌ను ప్రభావితుడిని చేయగా ఆమె ముఖం పైకి దృష్టి మళ్ళింది. "బిడ్డా! నీవు ఉదాసీనంగా ఎందుకున్నావు" అని అడిగారు. ఆమె ఏ జవాబూ ఇవ్వలేకపోయింది. కళ్ళలో నీళ్ళు ఊరాయి. పండిత్ పురుషోత్తమదాస్ ఆమె ఉదాసీనతకు కారణం "అమ్మాయి భర్త ఐదు సంవత్సరాల క్రితం ఎటో వెళ్ళిపోయాడు. ఎంత వెదికినా దొరకటం లేదు" అని చెప్పారు. మహారాజ్ చిత్తంలో దయ ఉప్పొంగింది. ఆ అమ్మాయి దుఃఖం దూరం కావాలనిపించి పండిత్ పురుషోత్తమదాస్‌ను అడిగి ఆమె భర్త ఫోటో తెప్పించారు. దానిని తదేకంగా చూసి సమాధిలోకి వెళ్ళారు. సమాధి నుండి లేచి "పండిత్ జీ! మీ అల్లుడు కలకత్తాలో ఉన్నాడు. ఒక పసుపు రంగు ఇంట్లో, రెండో అంతస్తులో ఉంటున్నాడు. రెండు మూడు నెలల్లో తనే వస్తాడు" అని

చెప్పారు. మహారాజ్ అన్నట్లే అల్లుడు తనకు తానుగా వచ్చేశాడు. ఇంటి గురించి అడగ్గా మహారాజ్ చెప్పిన మాటలను సమర్థించాడతడు.

మహారాజ్‌ను తరచుగా సందర్శించుకునే వారిలో సేవాసింహ ఉన్నాడు. "నేను చాలామంది సాధు మహాత్ములను చూశాను. వీరంతా మోసగాళ్ళు" అంది అతని భార్య. ఈ మాటలు విని మహారాజ్‌కు బాధనిపించింది. లోకుల మనసులలో సంతుల పట్ల విశ్వాసం తగ్గుతోంది. కొందరు దొంగ గురువుల కారణంగా లోకం అందర్నీ అట్లాంటివారే అనుకుంటుంది అనే ఆలోచన కలిగింది.

సర్దార్ సేవాసింగ్‌కు తనకు పుత్రుడు కలగాలనే కోరిక ఉండేది. "రేపు ఉదయం నేను ధ్యాన సమాధి నుండి లేచే సమయానికి ఒక మామిడి పండు తీసుకుని రండి" అని చెప్పారు మహారాజ్. వారిని గురించి ఆలోచనతో సమాధిలోకి వెళ్ళారు. సర్దార్ సాహబ్, అతని భార్య మామిడి పండు తీసుకుని వెళ్ళారు. సమాధి నుంచి లేచి మామిడి పండును చేతుల్లోకి తీసుకున్నారు మహారాజ్. దానిపైన ఊహల ఆధారంతో కుర్రవాని చిహ్నం గీసి తన దృష్టిని దానిపై నిలిపారు. "దీనిని తినండి. భగవంతుడు దయ చూపుతాడు" అని పండును వారికిచ్చారు. సర్దార్ సాహబ్ వారింట సంవత్సరం నాటికి పసివాడు జన్మించాడు. ఇప్పుడతనికి పదకొండేళ్ళు. మహారాజ్ తన మనసు యొక్క శక్తితో ఇచ్ఛాపూర్వకముగా చేసిన ప్రసాద ఫలితం అది.

ఇదేవిధంగా దాదాపు 50 మంది స్త్రీలు అన్ని రకాల చికిత్సలు చేయించుకున్నా ఫలితం దక్కనిది మహారాజ్‌గారి దయతో, ఆశీర్వాదంతో సంతానం కలిగింది.

ఒకసారి మహారాజ్ అలీగఢ్ జిల్లాలోని ఊటాసానీ అనే గ్రామానికి వచ్చారు. అక్కడ సత్సంగానికి వచ్చి మహారాజ్‌ను దర్శించుకున్న ఓ మహిళ ఎందుకో రోదించసాగింది. మహారాజ్ ఆమె వైపు చూసి, "అమ్మా! ఎందుకేడుస్తున్నావు? నీకేం కష్టం వచ్చింది?" అని అడిగారు. ఆమె ఏడుస్తూనే "మహారాజ్! యమునా నది వరద నా పొలం దాకా వచ్చింది. ఇదిలాగే ఉంటే నా పొలం, బావి

యమునా నదికే కానుకగా అర్పితమవుతాయి. . నాకే ఆధారమూ మిగలదు" అంది. "యమున అంగీకరించేది కాదు. సరే! నేను నీకు ఈ పూలమాల ఇస్తాను. దీనిలోని పువ్వుల్ని లెక్కపెట్టు" అన్నారు. ఆమె వాటిని లెక్కించి "మహారాజ్! ఇవి పధ్నాలుగు ఉన్నాయి" అంది. "ఈ మాలను యమునా నదికి అర్పించు. పధ్నాలుగు సంవత్సరాల వరకు నీ పొలం, బావి ఉన్న చోటకి నది రాదు" అన్నారు అలానే జరిగింది. ఈ సంఘటన 1955–56లో జరిగింది. చాలామంది రోగులు రోగ విముక్తులయ్యారు. నిరుద్యోగులు ఉద్యోగస్తులయ్యారు. అభ్యాసం సఫలం కావటం లేదని సంవత్సరాల తరబడిగా ఫిర్యాదు చేస్తున్న వారి భ్రమలు తొలగిపోయి వారి అభ్యాసం సరైనరీతిలో కొనసాగింది. ఎందుకంటే ఇటువంటి విషయాలు ప్రచారం కావాలని మహారాజ్ భావించరు కనుక ఇంకా ఎక్కువ సంఘటనలను నేను రాయటం లేదు. వాటినన్నింటినీ రాస్తే ఒక పెద్ద ఉద్గ్రంథమే అవుతుంది.

కొన్ని సంఘటనలు 'మనుష్యబనో' హిందీ మాసపత్రికలో ప్రచురిత మయ్యాయి. ప్రచురితమవుతుంటాయి. మహారాజ్ నిజ అనుభవాల ఆధారంగా వర్ణించే సంఘటనలను అక్షరబద్ధం చేసే ప్రయత్నం జరుగుతూ ఉంది.

మహిమలకు, చమత్కార సంఘటనకు మూలం ఇచ్ఛ, సత్యసంధత, తపన, తన ఇష్టదైవంపై పరిపూర్ణ విశ్వాసం. ఇవి అవసరమైనవి. మనిషి పూర్ణపురుషుడైనా, వలీ, అవతారం, ఇంకెవరైనా కానీ! పై విషయాలు కలిగి వుండటం తప్పనిసరి! మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే తన కోరిక నేరవేర్చుకునే ప్రయత్నంలో ఇతరులకు హాని కలగాలనే ఆలోచన ఏ మాత్రం ఉండకూడదు. ప్రబలమైన ఇచ్ఛ, సంపూర్ణ విశ్వాసం ఉంటే 90 శాతం సఫలత లభిస్తుంది. దానితోపాటే మనిషి ఆశావాది అయి ఉండటం అవసరం. దీని గురించిన ఒక సంఘటన చదవండి.

ఒకసారి మాతా భాగవతీ దేవి (మహారాజ్ గారి ధర్మపత్ని) మహారాజ్‌తో "మీరు మీ వందలాది సత్సంగీయుల కోరికలు నెరవేర్చారు. నాపై కూడా కొంత

దయ చూపండి" అన్నారు. "నా వద్దకు వచ్చేవారు తమ తమ భక్తి భావం, విశ్వాసముల ఫలితాన్నే పొందుతారు. నేనెవరికీ ఏమీ ఇవ్వను" అన్నారు మహారాజ్. మాతాజీకి సంతృప్తి కలగలేదు. అనుకోకుండా అప్పుడే ఒక సజ్జనుడు ఏదో ఒక కోరికతో అక్కడికి వచ్చాడు. మహారాజ్ మాతాజీ వైపు సైగచేసి చూపించి "ఆమెను అడుగు" అన్నారు. అతడు మాతాజీని ప్రార్థించసాగాడు. "నాకేమీ తెలియదు" అంది మాతాజీ. అయినా వచ్చిన వ్యక్తి పదే పదే ప్రార్థించసాగాడు. చివరికి ఆమెకు విసుగుపుట్టగా "నీ కోరిక నెరవేరుతుంది" అంది. కొన్నాళ్ళ తరువాత ఆ సజ్జనుడు మళ్ళీ వచ్చాడు. కొన్ని పువ్వులు, పళ్ళు తీసుకొచ్చి మాతాజీ చరణాల వద్ద ఉంచి కృతజ్ఞతలు చెబుతూ "మాతాజీ! మీరిచ్చిన వరం సఫలమైంది. నా పని నెరవేరింది" అన్నాడు. మహారాజ్ అక్కడే ఉన్నారు. ఇదంతా చూస్తున్నారు. కొంచెంసేపటి తరువాత తమ ధర్మపత్ని దగ్గరకు వెళ్ళి "నాకు కూడా ఏమైనా ఇవ్వు" అన్నారు. ఆమె నవ్వసాగింది. త్రికుటి స్థానంపై అభ్యాసం చేసే అభ్యాసి మానసిక శక్తి ప్రబలమవుతుంది. ఏ ఇచ్ఛతో ఈ స్థానంపై చిత్తవృత్తిని ఏకాగ్రం చేస్తే అది ఫలిస్తుంది. కొందరు అభ్యాసికులు తప్పు కోరిక కారణంగా తమ జీవితాన్ని పాడుచేసుకుంటారు. ఉదాహరణకు జబల్‌పుర్‌లో నివసించిన ఒక మహిళ ఉదంతం మహారాజ్ అనేక సందర్భాలలో సత్సంగాలలో వివరించారు. అనేకసార్లు పుస్తకాలలో అది ప్రచురించబడింది కూడా! (జబల్‌పుర్‌లో నివసించే ఓ మహిళ మహారాజ్ వద్ద నామదానం తీసుకుంది. త్రికుటిలో సాధన చేసేది. ఆమె సాధన కొనసాగడానికి ఆమె ముగ్గురు పిల్లలు అడ్డుపడుతున్నారని మహారాజ్‌కు చెప్పింది. ఆమె భర్త ఉదయం ఎనిమిది గంటలకు ఉద్యోగానికి వెళ్ళి రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చేవాడట. అత్త, ఆడపడుచులాంటి వాళ్ళు సహాయ పడటానికి ఎవరూ లేరు. ఆ విషయం మహారాజ్‌కు చెప్పిందామె. ఆమె వెళ్ళిపోయాక "వలీ రాం! ఈమె పిల్లల నుండి తప్పించుకోవాలనుకుంటోంది. ఈ ముగ్గురు పిల్లలూ చనిపోతారని నాకు అన్పిస్తోంది" అన్నారు మహారాజ్. అలాగే జరిగింది.)

పూర్ణ పురుషుడు దుఃఖితుల దుఃఖాన్ని దూరం చేయగలుగుతాడు. ఈ విషయంలో మహారాజ్ అంటారు ఇలా –"తన ఎదుటికి వచ్చిన మనిషి పట్ల సంత్ హృదయంలో స్వాభావికంగానే సానుభూతి పుదుతుంది. అతనికి మేలు జరగాలనే ఆలోచనతో తన అంతరంలోకి వెళ్తాడు. ఆయన ధ్యానం లేదా సానుభూతి ధార ఇచ్ఛా పూర్ణమయ్యే శక్తి కేంద్రమును ఢీకొంటుంది. అక్కడినుండి లహరులు, లేదా ధారలు సృష్టి రచనలోకి వచ్చి అతని దుఃఖాన్ని దూరం చేస్తుంటాయి. సఫలత లభిస్తుంది" అంటారు మహారాజ్.

మహారాజ్ తమ నిజ అనుభవ ఆధారంపై ఒక నిష్కర్షకు చేరుకున్నారు. అదేమిటంటే సృష్టి రచనలో ఏ సంఘటన జరగవలసి ఉందో అది జరుగుతుంది. చాలాసార్లు నాకు కూడా సాఫల్యం లభించలేదు. కనుక మహారాజ్ స్పష్టంగా చెబుతుంటారు. సంత్ కూడా దైవేచ్ఛ ఆధీనుడై పనిచేస్తాడు. ఒక వ్యక్తి పుత్రుడు టి.బి., క్షయ రోగంతో బాధపడుతున్నాడు. అతడు ఈ విషయాన్ని మహారాజ్‌కు చెప్పాడు. "అతడికి ఏ జబ్బూ లేదు. నిక్షేపంగా ఉన్నాడు" అని మహారాజ్ నోటివెంట క్షణకాలంలో వచ్చింది. కొద్ది రోజులలోనే ఆ పిల్లవాడు ఆరోగ్యవంతుడయ్యాడు. కొన్నిరోజుల తరువాత మహారాజ్‌గారి బంధువులలో ఒకరికి క్షయ సోకింది. అతడు వచ్చి మహారాజ్‌కు ఈ విషయం చెప్పాడు. మహారాజ్ కూడా అతనికి మేలు కలగాలని ప్రయత్నించారు గానీ సఫలత లభించలేదు. "పని జరగవలసి లేకుంటే నా ఏకాగ్రత, సురత్ హితవు కోరే ఆలోచనలో అంతరంలోకి వెళ్ళదు. సఫలత లభించేలా అయితే దైవేచ్ఛతో సురత్ ఏకాగ్రమవుతుంది" అంటారు మహారాజ్. చివరికి మహారాజ్ ఈ కింది మాటలనక తప్పలేదు.

**"హోయ్ హై వహీ జో రామ రచి రాఖా"**

మనిషి లేదా సాధువు సాధన స్థితిలో విభిన్న శక్తుల భండాగారమైన బ్రహ్మాండీయ స్థానాలలో అభ్యాసం చేస్తుంటే అతడు తన శక్తితో, హితం కోరి ప్రాపంచిక పనులలో సఫలత నిప్పించగలుగుతాడు. రోగులను ఆరోగ్యవంతులనుగా చేయగలుగుతాడు. కానీ బ్రహ్మాండ స్థానాలను దాటి తన

నిజస్వరూపంలో విలీనమైపోతే అతడు ఇలాంటి లాభాలు కలిగించజాలడు. ఎందుకంటే అతని సురత్ బ్రహ్మాండీయ కేంద్రాలలో నిలువదు. అందుకే మహారాజ్ అంటారు – ప్రాపంచిక కార్యాలలో సఫలత లభించాలంటే సాధువును ఆశ్రయించాలి. నిజరూప సాక్షాత్కారం చేసుకోగోరితే ఎవరైనా బ్రహ్మాండ స్థానాలను దాటిన పూర్ణ పురుషుని శరణు పొందాలి. ఇప్పుడు నా వలన ప్రాపంచిక సహాయం లభించజాలదు. పూర్ణత సంస్కారాలు లభించగలుగుతాయి. ఎందుకంటే నేనిప్పుడు చాలా ఎత్తుకు వెళ్ళిపోయాను.

ఇదిగాక ప్రబలమైన కోరిక, శక్తిశాలి అయిన ఇచ్ఛాశక్తి బ్రహ్మాండంలో అలలను, తరంగాలను ఉద్భవింపచేస్తుంది. అనుకూలమైన సామగ్రిని తీసుకుని సఫలత ప్రాప్తించుకోగలుగుతుంది. ఎందుకంటే భగవంతుని శక్తి ప్రతి జీవికి అనుక్షణం అండదండగా ఉండి అతని విశ్వాసం, భక్తి భావానుసారం సహాయం చేస్తుంటుంది.

చాలామంది కష్ట కాలంలో తమ ఎదుట మహారాజ్ నిల్చుండటం, వారికి సహాయపడి అదృశ్యమవటం చూశారు. వాళ్ళు మహారాజ్‌కు మీరు మాకు సహాయపడ్డారని ఉత్తరాలు రాశారు. కానీ ఆ విషయాలేవీ తనకు తెలియవంటారు మహారాజ్. "నేను హోషియార్‌పుర్‌లో ఉన్నాను వేరే ఊళ్లో ఉన్న వారికి ఎలా సహాయపడ్డాను?" అంటారు. ఈ విషయంపై మహారాజ్ "మనిషి యొక్క విశ్వాసం, భక్తి భావం, ఆలోచనా విచారం, నా రూపంలో కనిపించి వారికి సహాయం చేస్తుంది"... ప్రపంచంలోని ఏ మత సంప్రదాయంలో ఎక్కడా ఇలాంటి సత్యబోధ కనిపించదు. మహారాజ్ ఆధ్యాత్మిక జగతిలో అందరికంటే గొప్ప వైజ్ఞానికుడు. ఆయన ఏది వర్ణించినా నిజ అనుభవాధారంగానే చెబుతుంటారు.

ఆపదల్లో ఆదుకుంటేనో, మహిమలు చూపి, అద్భుతాలు చేస్తేనో గురుచరణాలలో విశ్వాసం పెట్టుకునే సత్సంగీయులకు ఎదురుదెబ్బ తగులుతుంటుంది. మహిమలకు, వింత చమత్కారాలకు, అద్భుతాలకు సత్సంగి అభిమాని కారాదు. సంత్ మతంలో చమత్కారాలు, మహిమల ప్రదర్శనలు ఒక

రతంగా పరీక్షల వంటివి. సత్సంగి ఎలాంటి వాడో తెలుసుకోవడానికి ఉపకరిస్తాయి. అచంచలమైన విశ్వాసం గలవారి సంగతి వేరు. ఇతర ప్రాపంచికులు ఏ కోరిక కోసమో గురువును ప్రార్థిస్తే గురువు ఆశీర్వదించినా అది ఫలించకుంటే వారి విశ్వాసానికి అఘాతం కలుగుతుంది.

***

విశ్వాసానికి ఎదురుదెబ్బ తగిలేసరికి వారి మనసు గురువు వైపు నుండి పక్కకు తొలగిపోతుంది. కనుక సంత్ మతంలో జాగ్రత్తగా అడుగులు వేయవలసి వుంటుంది. సంతులందరూ సురత్ శబ్ద యోగసాధనను, పూర్ణ పురుషుని సాంగత్యంలో సత్సంగాన్ని ముఖ్యంగా భావించారు. కానీ (ఇవాళ రేపటి సంత్ మతంలో ముఖ్యంగా విశేషించి రాధాస్వామి మతంలో గురువుల, ఆశ్రమాల ఆధిక్యం వుంది.) ఒకటే బోధన, అయినందున పరస్పరం ప్రేమ, సానుభూతి ఉండాలి. కానీ ఇందుకు వ్యతిరేకంగా పక్షపాతం, ఈర్ష్య, ద్వేషం, ఎంతగా పెరిగాయంటే ప్రతి గద్దె లేక డేరా – ఆశ్రమానికి సంబంధించిన వారు తమ ఆచార్యుడినే సద్గురు వక్త్ అనుకుంటారు. ఇతరులను తక్కువగా చూస్తారు. తప్పు లెన్నటం సామాన్య విషయంగా మారింది. ఒకరు మరొకరి గురువును నిందిస్తూ విశ్వాసానికి విఘాతం కలిగిస్తుంటారు. కొందరు ఆచార్యులు కూడా వారి ఈ చేష్టలను గౌరవప్రదమైన దృష్టితోనే చూస్తుంటారు.

“ఇతరుల మంచి గుణాలనే చూడాలి. అవగుణాలను చూడకు” అనే నియమంతోనే సంత్ మత బోధ ప్రారంభమవుతుంది. ప్రపంచంలో ప్రతి వస్తువుకూ చీకటి, వెలుతురు అనే రెండు పార్శ్వాలుంటాయి. ఆధ్యాత్మిక విద్యార్థి ఉజ్వలమైన వెలుగు వైపే దృష్టి ఉంచాలి. విషాన్ని మించి హానికరమైన వస్తువు మరొకటి లేదు. కానీ బుద్ధిమంతుడైన వైద్యుడు అందులో కూడా అసాధ్య రోగాలను తగ్గించే గుణాన్ని చూస్తాడు. “నా డేరా– ఆశ్రమం అన్నిటికంటే గొప్పది. ఆధ్యాత్మిక బాధ్యతను మేమే తీసుకున్నాం. వేరేచోట దీనికిలోటు ఉంది” అని ప్రతి సత్సంగి భావిస్తుండటం బాధాకరం. సత్సంగాలలో కేవలం తమ ఆచార్యుని వచనాలను

చదవటం ముఖ్యంగా భావించబడుతుంది. నా దేరా - ఆశ్రమంలోని కోడి మరో గూటికి వెళ్ళకూడదని ప్రయత్నాలు జరుగుతుంటాయి. సత్పురుషుడు స్పష్టంగా చెప్పే వెళ్ళాడు ఇలా -

*సింహోంకే లంహడే నహీం, హంసోంకీ నహి పాతి ।*
*లాలోం కీ సెహీం బోరియా, సాధ్ న చలే జమాత్ ॥*

ఇవాళ రేపు నామదీక్ష అనధికారులకు, అనర్హులకు ఇవ్వబడుతున్నది. నామ దీక్ష కోసం విజ్ఞప్తి చేస్తుంటారు. రోగం ఒకటి కాగా చికిత్స మరొకటి. కడుపులో రొట్టెలేదు. దుఃఖంతో ఉన్నాడు. రోగంపట్ల వైరాగ్యం లేదు గానీ నామం ఇవ్వబడుతున్నది. మనసులో ఇంకా ఇప్పటికీ ప్రాపంచిక వాసనలు ఉన్నవారికి నామం ఏ లాభాన్ని అందిస్తుంది? ఎవర్కైతే ఇంకా ప్రాపంచిక క్షేత్రంలో విహరించే తృప్తి పొందాలని ఉందో వారికి నామం ప్రదానం చేసి వారి మనసులలో కృత్రిమ వైరాగ్యం కలిగించే ప్రయత్నం చేయబడుతుంటుంది. దీని ఫలితంగా వారు గృహస్థ జీవనంలోకి వచ్చాక అనేక కష్టాలను ఎదుర్కొన వలసి వస్తుంది.

రోగగ్రస్తుడే ఆసుపత్రికి వెళ్తాడనడంలో సందేహం లేదు. మాసిన బట్టలే చాకలిరేవుకు వెళ్తాయి. సత్సంగమనే సబ్బుతో మాసిన బట్టలు ఉతికి శుభ్రం చేయకుంటే వాటికి భక్తి అనే రంగు ఎలా పట్టుకుంటుంది? ఎలా అంటుకుంటుంది? కానీ ఇక్కడ ఆచరణ బాగాలేని భ్రష్టాచర పరులకు, ఉదయం, సాయంత్రం ప్రపంచాన్ని దోచుకునే 420 చేసేవారికి, నామం యొక్క ఆసరా తీసుకుని తోడేళ్ళు వలె పనిచేసేవారికి నామం ఇవ్వబడుతోంది. ఇవాళ రేపు తమ శిష్యుల సంఖ్యను పెంచుకోవాలనే ప్రయోజనం కోసమే నామదీక్ష ఇవ్వడానికి కారణం అవుతున్నది.

ఓ మానవా! ఇప్పుడే జాగ్రత్తపడు! గృహస్థ జీవనాన్ని సరిచేసుకో. సంతోషంగా జీవించు. వృధాగా ఉండవద్దు. సత్సంగాలు విను. గురుసేవలో ఉండు. గురుసేవ అంటే గురు వచనాలను అంగీకరించి పాటించటం. ప్రాపంచిక కాంక్షలను, వాసనలను అనుభవించి నివృత్తి, విశ్రాంతి లభించాక వైరాగ్యం

పుడుతుంది. అప్పుడు నామం యొక్క ఘర్షణ అవసరమవుతుంది.

దీనికంటే ముందు నామం తీసుకోవాలనే పేరెత్తవద్దు. మంచి కోరికలతో ప్రారంభిక సాధన, స్మరణ చేయవచ్చు. ఇది ఫలితమిస్తుంది. శాస్త్రాలలో ప్రారంభంలో పిల్లలకు ఇచ్చే బోధ, శిక్షణ గాయత్రి మంత్రం. తరువాత అర్హులైన వారికి ప్రాణాయామ మంత్రం ఇవ్వబడేది. సంత్ మతంలో ప్రారంభ సాధన సుమిరణ, ధ్యానం, శబ్దం యోగ శిక్షణ బోధన కొందరికోసమే ఉంది.

పరమ సంత్ పరమ దయాల్ ఫకీర్ చంద్ జీ మహారాజ్ అత్యంత స్వతంత్ర భావాలు, స్వతంత్ర్య ఆలోచనా విచారాలు గల విశాల హృదయుడు. ఏ ఇష్టునితో నీకు విశ్వాసం ఉందో అక్కడే ఉండమని" స్పష్టంగా చెబుతారు. "ఇష్టుని అనగా ఆరాధ్య దైవాన్ని మార్చకూడదు. ఆరాధ్య దైవాన్ని, నామాన్ని ధ్యానాన్ని మార్చవద్దు. అవసరమనుకుంటే ఓ సోదరుని వలె ఆ సలహా తీసుకో. నీ పని పూర్తి చేసుకో" అంటారు. ఆయన ఎవరికీ నామదానమివ్వరు. సంత్ మతంలోని అన్ని శాఖల వారిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి మానవతను గురించి ప్రచారం చేయటం తమ ముఖ్య కర్తవ్యంగా భావిస్తారు. కనుకనే మహారాజ్‌గారి సత్సంగానికి ఒక్కసారి వచ్చిన వ్యక్తి ఆయన సత్యసంధతకు, అనుభూత శిక్షణకు ప్రభావితులవుతుంటారు. "నేనొకవేళ పొరపాటు పడితే, తప్పుమార్గంలో ఉంటే అందరి ఎదుట నా బోధనలను వ్యతిరేకించి విమర్శించండి. ఖండించండి. లేదా మానవతా ప్రచారంలో నాతో చేయి కలపండి" అంటారు మహారాజ్.

సంతులలో ఏ భేదం ఉండదు. అందరూ ఆ పవిత్ర స్వరూపం (మూలం)లో తేడా లేనివారే, విడదీయలేనివారే అయి ఉంటారు. దారి ఒకటే! బోధన, శిక్షణ ఒకటే. అర్హుని అర్హతననుసరించి నేర్పించే పద్ధతి వేర్వేరుగా ఉంటుంది. గురువు అనేది మనిషి పేరు కాదు. గురు నామం ఒక ఆదర్శానిది. పూర్ణ వివేకం పేరే గురువు. ఆదర్శం-ఇష్టదైవం సదా ప్రతి మనిషి లోపల ఉంటుంది. అది ప్రతి మనిషి యొక్క వారి వారి నిజస్వరూపం.

***గురు కో మానుష్ మానతే, తే నర కహియే అంధ్ ।***

*దుఃఖీ హోయ్ సంసార్ మే, ఆగే యమ కా ఫంద్ ॥*

*గురు కియా హై దేహ కో, సద్గురు చీన్హా నాహిఁ ।*
*కహే కబీర్ తా దాస్ కో, తీన్ తాప్ భర్ మాహిఁ ॥*

*బంధువే సే బంధువా మిలే, బంధా బంధ్ బధాయ్ ।*
*సేవాకర్ నిర్బంధ్ కీ, పల్ మే లేయ ఛుడాయ్ ॥*

అంతరంలో శబ్ద ప్రకాశాలు ఉద్భవించనంతవరకు బాహ్య గురువు సహాయం అనివార్యం. సంస్కారాలు పూర్ణపురుషుని నుండి స్వీకరించి ఉంటే కొంత సమయం తరువాత అంతరీయ అనుభవ సహాయం చేస్తూ ధుర్ ధామం వరకు తీసుకువెళ్తుంది. నియమమేమిటంటే మనిషి తనలో తాను సత్య సంధతతో ఉండాలి.

పక్షపాతం ఆధ్యాత్మిక రోగం. సత్య అనుభవం కానంతవరకు బాహ్య గురువు సేవ, గౌరవం, సత్సంగం అవసరం. దీని తరువాత కృతజ్ఞుడై ఉండటం అవసరం.

*కామీ తరే క్రోధీ తరే, పాపీ తరే అనంత్ ।*
*ఆన్ ఉపాసక్ కృతఘ్ను, తరే న నామ్ రటంత్ ॥*

భార్యాభర్తల కలహం, ఇంట్లో అశాంతి వలన ఆపదలు సంభవిస్తాయని మహారాజ్ చెబుతారు. అనేక ఉదాహరణలు విస్తృతంగా చూసి ఈ నిర్ధారణకు వచ్చారు మహారాజ్. ఆయన మిలిటరీ ఉద్యోగంలో ఉన్న రోజుల్లో ఫిరోజ్‌పూర్‌లో నివసించేవారు. పక్కింట్లో ఒక సర్దార్జీ కుటుంబం ఉండేది. సర్దార్జీ భార్య అతణ్ణి వేధించేది. ఇంట్లోని పోట్లాటల కారణంగా సర్దార్జీ చాలా దుఃఖించేవాడు. ఒకరోజు సర్దార్జీ లేడు. చుట్టూ కూర్చున్నవారితో “ఈ భార్యభర్తల కలహాలు వారి పుత్రుడిని చంపుతాయి” అన్నారు మహారాజ్. 14 రోజుల తరువాత కుర్రవాడు మృతి చెందాడు. పిల్లవాడు మరణిస్తాడని మహారాజ్ ముందుగానే భవిష్యవాణి చెప్పారని సర్దార్జీకి చెప్పారు. సర్దార్జీ మహారాజ్ దగ్గరకొచ్చాడు. పిల్లవాడి మృత్యువుకు కారణం చెప్పారు మహారాజ్. సర్దార్జీ సత్య ప్రియుడు. నిజాన్ని అంగీకరించాడు.

కొన్ని రోజుల తరువాత సర్దార్జీ ఇంట్లో అమ్మాయి పుట్టింది. ఆ శిశువు రాత్రింబగళ్ళు ఏడుస్తుండేది. ఎన్నో ప్రయత్నాలు చేశాడు. డాక్టర్లకు, హకీమ్‌లకు చూపెట్టారు కానీ ఏడుపు ఆగలేదు. చివరికి వాళ్ళు మహారాజ్ దగ్గరికి వచ్చారు. "21 రోజులైంది. నిరంతరం రోదిస్తూనే ఉంటుంది" అని చెప్పారు. "డాక్టరుకు చూపించారా?" అడిగారు మహారాజ్. "ముగ్గురు డాక్టర్లకు, హకీములకు చూపించాం. పాప ఆరోగ్యంగా ఉందంటున్నారు" అన్నాడు సర్దార్జీ. "ఈ పాప పుట్టిన సమయంలో ప్రసూతి గృహంలో ఎవరో దుఃఖితులై ఏడుస్తూ ఉండి ఉండవచ్చు. వివరాలు కనుక్కోండి" అన్నారు మహారాజ్. వివరాలు కనుక్కున్నప్పుడు తెలిసినదేమిటంటే ప్రసవ సమయంలో పిలవగా వచ్చిన దాయి సోదరుడు అంతకు ముందురోజు చనిపోయాడట. సోదరుణ్ణి తల్చుకుని ఏడుస్తూనే సర్దార్జీ ఇంటికి వచ్చిందామె. దాయి శోక ప్రభావం పాపపైన పడిందన్నారు మహారాజ్. అందుకే రాత్రింబవళ్ళు పాపాయి ఏడ్చింది. మహారాజ్ ప్రసాదం ఇచ్చారు. దానిని ప్రయోగించాక పాప ఏడవటం ఆపేసింది.

సంస్కారాల చమత్కారం ఇదే! పాప నిర్దోషి. కానీ దాయి చేయి తగిలినందు వలన గాఢమైన ప్రభావం పడింది. ఎలాగైతే కలరా, ప్లేగు వంటి రోగాల కీటాణువులు ఒక రోగి నుండి మరో రోగిపై ప్రభావం చూపుతాయో అదే విధంగా శోకం, హర్షం, వీరత్వం, పిరికితనం, శాంతి, అశాంతుల భావాలు కూడా దగ్గర కూర్చున్న వారిపైన ప్రభావం వేసి వారి స్థితిలో పరివర్తన తెస్తాయి. "తుఖ్మ్ తాసీర్ సుహబత్ కా అసర్" అనే సామెత ఉంది. సాంగత్య ప్రభావం వ్యర్థంగా పోదు. ఈ కారణంగానే సంతు, మహాత్ముల దర్శనం ఎంతో లాభదాయకమవుతుంది. దీనివలన మనసులో శాంతి, ఏకాగ్రత, ఆనందం లభిస్తుంది. మనిషి ప్రభావాన్ని గ్రహించేటందుకు కూడా మొదటి నుండే తత్పరుడైతే లాభం వెనువెంటనే కలుగుతుంది.

ఇదేవిధంగా వాతావరణ ప్రభావం పడుతుంది. మద్యం తాగే ప్రదేశంలో ఎవరికీ భగవంతుడు జ్ఞాపకానికి రాడు. కానీ మందిరం మసీదు, గురు ద్వారాలకు

వెళ్ళాక మనిషి మనసులో జ్ఞానం, భక్తి, ప్రేమ భావం పొంగుతుంది. మనిషి శుభం వైపు మొగ్గుతుంటాడు.

మహారాజ్‌కు డబ్బుపైన ఆశ లేదు. లాలూచీ లేదు. అవసరమైతే ఆయన ఇతరులకు సహాయం చేస్తారు. తన దగ్గరున్నదేదైనా అవసరం ఉన్నవారికి ఇచ్చేస్తారు. ఇతరుల దుఃఖాన్ని ఆయన చూడజాలడు. చివరికి తన ఒంటిమీది బట్టలు కూడా ఇచ్చేస్తారు. ఒకవేళ తన దగ్గర ఆ క్షణాన ఏమీ లేకుంటే వారి కష్టం తొలగించడానికి అవసరార్థుల అవసరం తీరేటందుకు ఏదో ఒక ఉపాయం, సాధనం ఇమ్మని భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. ఇక దైవేచ్ఛ వల్ల ఏదో ఒక ఏర్పాటు జరిగిపోతుంది. ఒకనాటి సంఘటన. నకోదర్ దగ్గర నివసించే ఒక స్త్రీ కూలి చేసుకుని బతుకుతూ కొడుకును చదివించు కుంటోంది. అందుకు కొంత డబ్బు అప్పు తీసుకోవలసి వచ్చింది. కొడుకుకు ఉద్యోగం వచ్చిన తరువాత ఆ ఋణం తీర్చుకోవచ్చనుకుంది. పిల్లవాడు మెట్రిక్ పాసయ్యాడు గానీ ఉద్యోగం దొరకలేదు. అప్పు ఇచ్చినవాడు అది తీర్చమని సతాయించ సాగాడు. పాపం ఆ స్త్రీ దుఃఖితురాలైంది. ఆత్మహత్య శరణ్యమని ఇంటినుండి బయల్దేరింది. రైలు కింద పడి చావాలని రైల్వేస్టేషన్ వైపు నడవసాగింది. దార్లో ఒక స్త్రీ కలిసి “ఎందుకు బాధపడుతున్నావు” అని ఆరా తీసింది. ఆమె తన గోడు వెళ్ళబోసుకుంది. “నువ్వు ఆత్మహత్య చేసుకోకు. హోషియార్‌పుర్‌లో ఉండే బాబా ఫకీర్ దగ్గరికి వెళ్ళు. ఆయన పరమ దయాలుడు. నీ కష్టం దూరం చేస్తాడు” అని సలహా చెప్పింది. ఆ స్త్రీ నేరుగా హోషియార్‌పుర్‌కు వచ్చింది. ఆ రోజుల్లో మహారాజ్ నారాయణదాస్ వద్ద పనిచేస్తున్నారు. కళ్ళనిండా నీళ్ళూరుతుండగా ఆ స్త్రీ మహారాజ్ ఎదుటికి వచ్చి తన బాధ చెప్పుకుంది. ప్రస్తుతం తన దగ్గర డబ్బులేదు. ఆమెకు రూపాయలు అవసరం. నచ్చచెపితే సమస్య తీరదు. ఏం చేయటం అని ఆలోచించి “నువ్వు నా కోసం ఏం తెచ్చావు? ప్రసాదం ఏమైనా తెచ్చావా” అని అడిగారు. పాపం! ఆమెకు ప్రసాదం గురించేం తెలుసు? “నువ్వు మధ్యాహ్నం తరువాత రా! ప్రసాదం తీసుకునిరా” అన్నారు మహారాజ్. ఆమె వెళ్ళిపోయింది.

ఈమెకు ఎలా సహాయం చేయాలి అని మహారాజ్ ఆలోచించసాగారు. అంతలో పోస్ట్‌మాన్ రెండువందల రూపాయల మనీ ఆర్డర్ తీసుకుని వచ్చాడు. మనియార్డర్ నారాయణ దాస్ పేరుతో ఉంది. కూపన్ మీద – "మహారాజ్ రూపాయలు వెనక్కి తిప్పి పంపించేస్తారు. కనుక ఈ రూపాయలు నీ పేరుతో పంపుతున్నాను. ప్రస్తుతం మహారాజ్ ఆరోగ్యం బాగాలేదు. ఆయన చికిత్స కోసం ఈ పైకం ఖర్చు చేయవచ్చు" అని రాశారు ఆ డబ్బును పంపించిన సత్సంగి సుందరదాసు. నారాయణదాసు మహారాజ్‌కు అది చూపించి "ఏం చేయమంటారు" అని అడిగాడు. "మనీ ఆర్డర్ తీసుకో"అన్నారు మహారాజ్. అంతలో ఆ బీద స్త్రీ వచ్చింది. ప్రసాదంలో రెండు వందల రూపాయలు పెట్టి పొట్లం కట్టారు మహారాజ్. దానిని ఆ స్త్రీ చేతిలో పెట్టి "అమ్మా! ఇంటికి వెళ్ళాక ఈ పొట్లం విప్పు నీ పని నెరవేరుతుంది" అన్నారు.

"నా జీవితంలో వందలాది సంఘటనలు ఇలాంటివి ఎదురయ్యాయి. దుఃఖితులకు సహాయం చేయటంలో నేను వివశుడనై చేయలేనప్పుడు కూడా ప్రార్థించిన మనిషి నిరాశగా వెళ్ళిపోయే అవసరం రానీయలేదు పరమాత్మ. ప్రాపంచిక కష్టాలలో దైవేచ్ఛ తప్పనిసరిగా నాకు సహాయపడుతూనే ఉంది" అంటారు మహారాజ్.

మార్చి 1961 నాటి సంఘటన. నేను మహారాజ్ సత్సంగం కోసం ఢిల్లీకి వెళ్ళాను. మహారాజ్ నాతో "నేను ఎక్కడికి వెళ్ళినా సత్సంగీయులు కొత్త బట్టలు నాకు ఇస్తుంటారు. నేను వాటిని ఒకరోజు తొడుక్కుని వారికి తిరిగి ఇచ్చేస్తాను. కానీ ఈ విషయం వారికి నచ్చటం లేదు. బాధపడుతున్నారు. కనుక ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నాకు వాళ్ళిచ్చే బట్టలు మానవతా మందిరానికి తీసుకువెళ్ళు. నిరుపేదలకు పంచి పెడతాను. తీసుకోవటం కంటే ఇవ్వటంలో చాలా ఆనందం కలుగుతుంది" అన్నారు. మీరు ఇంటి వ్యవహారాలను చూడండి. చిన్న పిల్లలకు బజారు నుండి బట్టలు తెచ్చి తొడిగించటంలో మీకు ఎంతో సంతోషం కలుగుతుంది. తినటం కంటే తినిపించటంలో ఎక్కువ ఆనందం లభిస్తుంది. ఈ ఆనందాన్ని పొందే వారు అదృష్టవంతులు.

జలంధర్‌లో నివసించే ఓ ప్రొఫెసర్ హోషియార్‌పుర్‌కు మహారాజ్ ఇంటికి వచ్చాడు. కుర్చీ చూపించి కూర్చోమన్నారు మహారాజ్. సాధారణమైన మాటలు కొన్ని మాట్లాడాక "మీ రాకకు కారణం" అడిగారు మహారాజ్. "నా మనసు అశాంతిగా వుంటుంది. మిమ్మల్ని కలుసుకోమని ఒక మిత్రుడు సలహా ఇచ్చాడు. అందుకే వచ్చాను" అన్నాడతడు. మహారాజ్ ఆలోచించారు. ఇతడు ప్రొఫెసర్. వేతనం ఎక్కువగానే లభిస్తుంది. ఆరోగ్యంగా ఉన్నాడు కనుక "మీరు తప్పుగా అనుకోకండి. మీరొక వ్యభిచారి, మీ అశాంతికి కారణం ఇదే" అన్నారు మహారాజ్. ఆ ప్రొఫెసర్‌కు కోపం వచ్చింది. "నేనేనాడూ పరాయి స్త్రీ దగ్గరకు వెళ్ళలేదు" అన్నాడు.

"మీరు నిజమే చెబుతున్నారు. కానీ కాలేజీ రోజులలో నీవు గడిపిన జీవితం గురించి చెప్పు" అన్నారు మహారాజ్. "అప్పట్లో నేనొక ఆల్బమ్ దగ్గర పెట్టుకునే వాణ్ణి. అందులో వందలాది నగ్న యువతుల చిత్రాలు ఉండేవి. వాటిని ప్రతిరోజూ రెండు మూడుసార్లు చూసేవాణ్ణి" అన్నాడు గుర్తు తెచ్చుకుంటూ.

"చూడు! శారీరిక వ్యభిచారం కంటే మానసిక వ్యభిచారం చాలా చెడు చేస్తుంది. శారీరకంగా బలహీనుడయ్యాక మనిషి శారీరిక వ్యభిచారం వదిలి పెడతాడు. కానీ మానసిక వ్యభిచారం సంస్కారాలను వదిలి పెట్టడం కష్టమైన పని. మీకో ఉపాయం, పద్ధతి చెబుతాను. నలభై రోజులు దీనిని ఆచరించి తరువాత నన్ను కలువు. ఉదయం, సాయంకాలం ఏకాంతంగా కూర్చుని కళ్ళు మూసుకో. దృష్టిని భ్రూ మధ్యంలో నిలుపు. నాలుక కదిలించకుండా ఒకటి నుండి వంద వరకు, వంద నుండి ఒకటి వరకు కనీసం అరగంటపాటు లెక్కపెడుతూ ఉండు" అని చెప్పారు మహారాజ్. ఆ తరువాత ప్రొఫెసర్ దీనిని ఆచరించి వచ్చి తన అశాంతి తొలగిపోయిందని చెప్పాడు.

జలంధర్ ఛావనీ నుండి భార్యాభర్తలిద్దరూ మహారాజ్ దగ్గరకు వచ్చారు. ప్రాతః కాలంలో భార్య ఇంటి నుండి బయల్దేరి మందిరానికో, గురుద్వారాకో వెళ్ళేది. గంటల తరబడి సత్సంగంలో గడిపేది. భర్త ఎంతగానో నచ్చచెప్పాడు.

కానీ ఆమె వినలేదు. అతడికి విసుగొచ్చి ఇల్లు వదిలి బయటికి వెళ్ళిపోయాడు. వీరి కొడుకు బుద్ధిమంతుడు. అతడికి అన్ని సంగతులూ తెలుసు. అతడూ నచ్చచెప్పాడు. కానీ ఏ ప్రభావమూ కన్పించలేదు. చేసేది లేక కుర్రవాడు కూడా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. తన భార్య నడక, ఆచరణ బాగా లేదని భర్త ఆలోచన.

ఓరోజు ఏదో అవసరం ఉండి ఇంటికి వచ్చాడు. పక్కింట్లో ఉంటున్న ఓ సజ్జనుడు వీరిని చూస్తున్నాడు. వాళ్ళిల్లు యిలా నాశనమవటం చూసి బాధపడ్డాడు. భార్యభర్తలను కూర్చోబెట్టి "మీ ఇల్లు ఇలా అస్తవ్యస్తం చేసుకోకండి. హోషియార్‌పుర్‌కు వెళ్ళండి. అక్కడ బాబా ఫకీర్ ఉంటారు. ఆయనను దర్శించుకొని ఆయన ఇచ్చే ఆజ్ఞను పాటించండి. మీ అన్ని పనులూ సవ్యంగా కొనసాగుతాయి" అన్నాడు. ఇద్దరికీ విషయం అర్థమైంది. వాళ్ళు హోషియార్‌పుర్‌కు మహారాజ్ దగ్గరకు వచ్చారు.

భర్త తన బాధనంతా వెళ్ళబోసుకున్నాడు. ఇద్దరూ ఏడవసాగారు. భార్యకు భర్త ప్రవర్తన పైన అనుమానం ఉంది. మహారాజ్ ఇద్దరు చెప్పినవీ విని "మీరు నన్ను ఏమని భావించి వచ్చారు?" అని అడిగారు. "సంత్ మహాత్ముడవని నమ్మి వచ్చాం"అన్నారు ఇద్దరూ. "చూడండి. సంత్ మహాత్ములు ఎప్పుడూ అబద్ధం చెప్పరు. నా మాటలను విశ్వసిస్తారా?" అన్నారు మహారాజ్. భార్యాభర్తలిద్దరూ అంగీకరించారు. మహారాజ్ సంతోషించి ఆ మహిళ చేయి పట్టుకుని ఆమె భర్త చేతికి అప్పగించి "ఈమె నా కూతురు. ఉన్నతశ్రేణికి చెందిన పతివ్రత. నీవీమెను ప్రేమగా చూడు" అన్నారు. మళ్ళీ తనే ఆ మహిళతో "నీవు నా కూతురివే అయితే నేటి నుండి ఎప్పుడూ ఏ మందిరానికీ లేక గురుద్వారాకు వెళ్ళనని ప్రతిజ్ఞ చేయి" అన్నారు. ఆమె కూడా అంగీకరించింది. భార్యాభర్తలిద్దరూ ప్రసన్నులై ఇంటికి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిన కొద్దిసేపటికి నేను మహారాజ్‌గారి వద్దకు వెళ్ళాను. నాతో "దుర్గియా! అబద్ధం చెప్పవలసి వచ్చినా ఇవాళ నేనొక శుభకార్యం చేశాను. ఒక ఇంటిని నిలబెట్టాను. నేను చాలా సంతోషంగా ఉన్నాను" అన్నారు. ప్రియమైన

పాఠకులారా! పతనమైన ఇంటిని నిలబెట్టడం, చెడిపోయిన పనిని సక్రమ మార్గాన పెట్టడం, మనసు యొక్క పాపాలను పారదోలటం, విరిగిపోయిన మనసులను కూడా కలపటం ఒక పరమసంత్ మాత్రమే చేయగలడు.

***ఆగ్ లగీ అసమాన్ మే, ఝుర్ ఝుర్ పడే అంగార్ ।***
***జో న హోతే సంత్ జన్, జల్ మరతా సంసార్ ॥***

నా కళ్ళతో చూసిన సంఘటన. వివాహమై చాలా సంవత్సరాలైనా సంతానం కలగలేదంటూ ఒక యువకుడు, ఒక సత్సంగీయుని వెంట మహారాజ్ ఇంటికి వచ్చాడు. బయట నిల్చున్నాడు. కొంచెం సేపయ్యాక మహారాజ్ బయటికి వచ్చారు. వెనుక సత్సంగి ఉన్నాడు. బయట నిలబడిన యువకునితో "నువ్వు బయట ఎందుకు నిలబడ్డావు" అని అడిగారు. "ఇతనికి సంతానం కలగలేదు. బాధపడుతుంటాడు" అని చెప్పాడు సత్సంగి. "కొన్నిరోజులు బ్రహ్మచర్య పాలన చేయి. సంతానం కలుగుతుంది" అన్నారు మహారాజ్. ఆ యువకుడు కొన్నాళ్ళపాటు బ్రహ్మచర్యం పాటించాడు. ఇప్పుడతనికి ఇద్దరు కుమారులు కలిగారు.

రఘువీర్ సింగ్ అనే సత్సంగికి పిల్లల్లేరు. మహారాజ్‌ను ప్రార్థించాడు. కొన్నాళ్ళ తరువాత అతనింట్లో శిశువు జన్మించాడు. "మహారాజ్! ఏదైనా సేవచేసే అవకాశమివ్వండి" అని ప్రార్థించాడు రఘువీర్‌సింగ్. నిరాకరించారు మహారాజ్. అయినా రఘువీర్‌సింగ్ మళ్ళీ మళ్ళీ అడగసాగాడు. రఘువీర్ ఉండే ఊళ్ళో పొగాకు చాలా బాగా ఉంటుంది. కనుక పొగాకు తీసుకురావడానికి అనుమతి నిచ్చారు మహారాజ్. ఎనిమిది సంవత్సరాలపాటు రఘువీర్ ఖచ్చితంగా తెచ్చి ఇచ్చేవాడు. ఎనిమిది సంవత్సరాల తరువాత రఘువీర్ సింగ్ నడుముకు పుండు అయింది. శరీరమంతటా క్యాన్సర్ వ్యాపించింది. డాక్టర్లు పరీక్షించి వ్యాధి నయం కావటం అసాధ్యం అన్నారు. కొన్నాళ్ళ తరువాత అతడు మరణించాడు. అతని జన్మపత్రికను భృగుసంహిత పండితులకు చూపించగా వాళ్ళు కొన్ని విషయాలు వెల్లడించారు. అనేక జన్మలకు పూర్వం రఘువీర్‌సింగ్ ఒక షావుకారు దగ్గర ఉద్యోగం చేసేవాడు. షావుకారు పిల్లలు చిన్నవాళ్ళు. అకస్మాత్తుగా షావుకారు

మృతి చెందాడు. రఘువీర్‌సింగ్ అతని ఆస్తినంతటినీ స్వంతం చేసుకోగా షావుకారు పిల్లలు కూలీ చేసుకుని బతకసాగారు. ఈ అపరాధానికి బదులుగా అతనికి ఈ శిక్ష పడింది. ఇంతకుముందు అనేక జన్మలలో ఇతనికి ఈ రోగం సోకింది. ఇతడు తన భార్యాపిల్లలు విలపిస్తుండగా శరీరం విడిచాడు. ఈ విషయాలు మహారాజు పైన అమితమైన ప్రభావాన్ని చూపాయి. పొగాకు సేవను స్వీకరించి పాపం చేశాననిపించింది. కనుక మహారాజ్ రఘువీర్‌సింగ్ ఇంటికి వెళ్ళారు. తనకు రఘువీర్‌సింగ్ ఇచ్చిన పొగాకుకుగాను లెక్కకట్టి అతని భార్యకు 410 రూపాయలు ఇచ్చి వచ్చారు. ఈ విషయం గురించే నేను అడగ్గా "అతడు ఏదైనా శారీరిక సేవచేస్తే ఫరవాలేదు. కానీ నేను లోభానికి లోనై రెండు, మూడు రూపాయలు మిగులుతాయని పొగాకు స్వీకరించాను. కనుక దీనిని ఒక రకమైన ఋణంగా భావించి తీర్చేయవలసి వచ్చింది. ఋణం ఎవరిదైనాకానీ అది చెరుపే! తప్పే! దీనినుండి మనిషి జాగ్రత్తగా ఉండాలి" అన్నారు..

ఒకరోజు మాటల సందర్భంలో "నేను జీవితమంతా ఎవరి ఎదుటా చేయి చాచలేదు. నేను సంపాదించుకున్నాను. తిన్నాను. ఉద్యోగం చేయటమేగాక కొన్నిసార్లు కూలీ పని కూడా చేయవలసి వచ్చింది. కానీ ఇప్పుడు మానవతా మందిరం కారణంగా వార్ధక్యంలో ఇతరుల ఎదుట చేయి చాచవలసివస్తోంది" అన్నారు. నాకు బాధనిపించింది. ఆ రోజు ఒక మీటింగ్ ఏర్పాటు చేశాను. ప్రతి సత్సంగి రెండు రూపాయలను నెలనెలా చందా రూపంలో మందిరానికి ఇవ్వాలని నిర్ణయం జరిగింది. అదే క్షణాన దాదాపు 500 రూపాయలు పోగయ్యాయి. మీటింగ్ గురించి మహారాజ్‌కు చెప్పాను. ఇవాళ్టి నుండి మీరు ఎవరు కనుకగా ఇచ్చినా తీసుకోవద్దని చెప్పాను. కొన్నాళ్ళ తరువాత సత్సంగ సమయంలో ఒక వృద్ధురాలు రెండు రూపాయలను మహారాజ్‌కు భేంట్ కానుక చేసింది. మహారాజ్ తీసుకున్నారు. "మహారాజ్! మీరు తీసుకోకండి" అన్నాను నేను. "ఈమె దగ్గర నుండి పైసలు తీసుకోకుంటే ఈమెకు ఎలా మేలు జరుగుతుంది? ఇవ్వని వారికి ఏమీ లభించదు. తీసుకోవటం, ఇవ్వటంలో హాని లేదు. తీసుకుంటే ఇస్తుండాలి. ఇది తప్పనిసరి. తింటే తినిపిస్తుండాలి. సహాయం అందుకుంటే

సహాయం చేస్తుండాలి. మన అపరాధాల క్షమ కోరుతూ ఉండాలి. ఇతరుల తప్పులను క్షమిస్తూ ఉండాలి. రెండు వైపులూ సమానంగా వుంటే తప్పు కాదు" అన్నారు. నేను మౌనం వహించాను.

శిష్యులు గురువులకు డబ్బులిచ్చి సేవ చేయటం అన్ని చోట్లా జరుగుతుంది. గురువు కూడా శిష్యుని డబ్బుతో శిష్యునికి సహాయం చేయటం ఎప్పుడైనా విన్నారా? నేను మీకొక నిజమైన సంఘటన చెబుతాను. ఏ విధంగా ఆధ్యాత్మికతను ప్రదానం చేస్తూ శిష్యుని ప్రాపంచిక స్థితిని కూడా బాగుచేస్తాడో, ఎన్నిరకాలుగా సహాయ మందిస్తాడో చూడండి.

***దాస్ దుఃఖీ తోమై దుఃఖీ, ఆది అంత్ తిహుం కాల్ ।***
***ఛిన్ మే ప్రగట్ హోయ్ కర్, పల్ మే కరూం నిహాల్ ॥***

ఉజ్జయిని ప్రాంతంలో సేఠ్ దామోదర్ దాస్ నివసిస్తాడు. ఇతని వ్యాపారం దివాళా తీయగా దుకాణం మూసేశాడు. అప్పుల వాళ్ళు వేలాది రూపాయలు చెల్లించమంటూ నిలదీస్తున్నారు. ఇతనికి డబ్బు ఇవ్వవలసిన వారు ఇవ్వటం లేదు. ఇల్లు గడవటం కష్టమైంది. ఈ విషయం నాకు తెలిసినప్పుడు చాలా బాధనిపించింది. ఇందౌర్ స్టేషన్ నుండి రైలు బయలుదేరవలసి వుంది. నేను ఆ సమయంలోనే దామోదర్‌దాస్ కష్టాల గురించి మహారాజ్‌తో చెప్పాను. ఇకనేం? దయ ఉప్పొంగింది. అటూ ఇటూ ఊగిసలాడుతున్న అతని నావను తీరానికి చేర్చేశారు. అది ఎలా?

పిల్లలతో సహా తన దగ్గరికి హోషియార్‌పుర్‌కు వచ్చేయమని దామోదర్ దాస్‌ను ఆజ్ఞాపించారు. అతడు రాగానే మహారాజ్ సర్దార్ సంతోఖ్ సింగ్‌కు వకాలత్ నామా ఇచ్చారు. అతడు దామోదర్‌దాస్ వ్యవహారాలు, ఇచ్చి పుచ్చుకునే వ్యాపార వ్యవహారాలు, వాటి సమస్యలను తీర్చేస్తారని చెప్పారు. అతని ఇల్లు గడవటం కోసం దుర్గాదాస్ పని ఇచ్చారు. వారు కొన్నిరోజులు మహారాజ్ ఇంట్లోనే ఉన్నారు. ఇక బయల్దేరతానని దాసుకోరినప్పుడు మహారాజ్ తన దగ్గరున్న పదకొండు వందల రూపాయలు అతనికిచ్చారు. అతడు మళ్ళీ ఉజ్జయినికి

వెళ్ళాక సమస్యలన్నీ తీరిపోయాయి. అతడు అన్నివిధాలా సుఖంగా ఉన్నాడు. గురువు శిష్యుణ్ణి ఏవిధంగా తరింపచేస్తాడో చెప్పేటందుకు ఇదొక ఉదాహరణ.

దాతా దయాల్ శబ్దం ఉంది–

*"గురుతారేంగే యహ..హమ్ జానీ"*
*'గురు సమరథ దాతా తారేంగే"*

ఇది మనోమయజగత్తు అంటారు మహారాజ్. ఇక్కడ జరుగుతున్నదంతా మనసు యొక్క లీలలే! జైసా ఖ్యాల్ వైసా హాల్, జైసీ మతి వైసీ గతి. మనసు ఎల్లప్పుడూ ఆనందాన్నే కోరుకుంటుంది. వ్యాపారం గురించిన ఆలోచన వచ్చినప్పుడు రాత్రింబగళ్ళు అదే తలపై స్వారీ చేస్తుంది. మరోవ్యక్తి దానధర్మాలు చేస్తాడు. దీనినే తన జీవిత లక్ష్యం అనుకుంటాడు. ఇతడు భోజనశాల ఏర్పాటు చేశాడు. ఆసుపత్రులు కట్టించాడు. నిర్ధనుల స్థితిని చూసి సహాయం చేస్తాడు. అతని కలలో కూడా అవే సంఘటనలు కన్పిస్తుంటాయి. ఇతని ప్రపంచం ఇతని ఆలోచనా విచారాలననుసరించి ఏర్పడింది.

నీవు సంతోషంగా ఉండాలనుకుంటే సుఖదాయకమైన ఆలోచనా విచారాలను కలిగి ఉండాలి. చెడువైపు పొరపాటున కూడా ఆలోచనను పోనివ్వకు. మనసు శక్తి ఒక ఆలోచన పైనే, ఒక భావంపైనే నిలిచి ఉంటే నీకు విజయమే లభిస్తుంది. ఒక శిరస్సు, ఒకటే వ్యాపారం ఉండాలి. ఒక శిరసు వెయ్యి వ్యాపారాలైతే సఫలత లభించటం చాలా కష్టం. విచారశక్తి, ఆలోచనాశక్తిని గురించి మహారాజ్ ఒక సంఘటన వినిపించారు. "మియానీ స్టేషన్‌కు బదిలీ అయి వచ్చినప్పుడు నివాసానికి ఒక ఇల్లు చూశాను. అందులో భూతం ఉంటుందని చుట్టుపక్కల వారి అభిప్రాయం. ఎక్కడైతే రాధాస్వామి నామస్మరణ జరుగుతుందో అక్కడ భూతం ఉండదని నాకు సంస్కారాలు లభించాయి. కనుక నేను ఆ ఇంట్లోనే ఉండాలని నిశ్చయించుకున్నాను. ఒకటిన్నర సంవత్సరం పాటు అందులో నివసించాను. కానీ అందులో ఏమీ కన్పించలేదు. ఒకరోజు నా తమ్ముడు గదిలో ఆడుకుంటున్నాడు. ఉన్నట్లుండి "అమ్మా! నేను చచ్చిపోయాను" అని

గట్టిగా అరిచాడు. వెళ్ళి చూస్తే స్పృహతప్పి పడిపోయి కన్పించాడు. నాకు స్టేషన్‌కు కబురొచ్చింది. నేను ఇంటి కివచ్చి ఏం జరిగిందని మాతాజీని అడిగాను. ఆమె జరిగిందంతా చెప్పింది. నేను చుట్టూ మూగిన ఇరుగు పొరుగు స్త్రీలను బయటికి వెళ్ళిపొమ్మన్నాను. గది తలుపు మూశాను. లోపలికి ఎవరూ రావొద్దని చెప్పాను. మా తమ్ముడితోనే ఆడుకోవటం ప్రారంభించాను. కళ్ళు మూసుకున్నాను. పాటలు పాడుతూ గదిలో తిరగ సాగాను. కొంచెంసేపయ్యాక ఎవరో నా కాలిపై కొట్టినట్లనిపించింది. వెంటనే కళ్ళు తెరిచాను. ఓ ఇనుప కడియం గదిలో పడివుంది. నా కాలు కడియంపై పడినప్పుడు అది ఎగిరి కాలికి తగిలింది. బహుశా తమ్ముడికి కూడా ఇలాగే జరిగి వుంటుంది. ఎందుకంటే వాడి మనసులో భూతం ఉందన్న విషయం నాటుకుని ఉంది గనుక భయపడి స్పృహ కోల్పోయినట్లున్నాడు. నేను వాడి ముఖంపై నీళ్ళు చిలకరించాను. స్పృహ రాగానే ఇక్కడ భూతమేదీ లేదనీ, కాలికి తగిలింది ఇనుప కడియమని చెప్పాను. ఆ ఇంట్లో భూతం ఉందని అతని నిష్క్రియ మనసుపైన ఒక నమ్మకం నిలిచినందున స్పృహ కోల్పోయాడు. నీవు ఎవరికైనా ఏదైనా ఒక ఆలోచనను ఇవ్వు. సమయం వచ్చినప్పుడు అది వెంటనే పనిచేస్తుంది. "నా సోదరుడు శత్రువు" అని నీవు భావిస్తే అతడు నీ పట్ల ఎంత సద్భావంతో ఉన్నా నీకు అతడు శత్రువులాగే కన్పిస్తాడు. మహర్షి దాతా దయాల్ జీ ఒకసారి ఒకమాటన్నారు. "నాతో శత్రుత్వం కలిగి ఉన్న వారి వలన ఏ కష్టమూ కలగలేదు. నా మిత్రులనుకున్న వారి వల్లనే సమస్యలు ఎదురయ్యాయి. వ్యాకులం చెందాను. పిల్లలకు ఎప్పుడూ బలహీనమైన ఆలోచనలివ్వకు. ఎందుకంటే వారి మనసు కోమలమై ఉంటుంది. ఒకసారి వారి మనసు పై ఏదైనా ఆలోచన, మాట నిలిచిపోతే దానిని తొలగించటం చాలా కష్టమవుతుంది. మరి నేనేం చేస్తాను? నా వద్దకు వచ్చే దుఃఖితులకు ఉత్సాహవంతమైన ఆలోచనలిస్తాను. భావనలిస్తాను. వాటిని నమ్మినవారి పనులు నెరవేరుతాయి.

విచారశక్తి ప్రభావం ఎంత అధికంగా ఉంటుందో ఒక ఉదాహరణ ద్వారా తెలుస్తుంది. ఒక మనిషి ప్రాతఃకాలంలో కొంచెం చీకటిగా ఉన్నప్పుడే నిద్రలేచాడు.

బహిర్భూమికి వెళ్ళవలసి ఉంది. చెంబుతో నీళ్ళు నింపుకుని బయల్దేరాడు. అడవివైపు నడిచాడు. పని ముగించుకుని చేతులు కడుక్కునేసరికి తెల్లవారింది. అప్రయత్నంగా కిందికి చూచాడు. నేలమీద రక్తం పడిందనుకున్నాడు. అరిచాడు. స్పృహ తప్పాడు. అటువైపు వచ్చిన వారు అతనిని ఎత్తుకుని ఇంటికి తీసుకుని వచ్చారు. ఎలా మెలకువ తెప్పించాలా అని ఆలోచించారు. అప్పుడే అతని చిన్నకూతురు ఇటు వచ్చింది. అంతా వింది. "నాన్నగారు నా చెంబును బహిర్భూమికి తీసుకెళ్ళారు. రాత్రి అందులో నేను ఎరుపురంగు కలిపి పెట్టాను" అంది. అమ్మాయి మాటలు తండ్రి చెవిన పడ్డాయి. స్పృహలోకి వచ్చాడు.

మహారాజ్ కర్రలు చీల్చే మెషీన్ వద్ద పనిచేసేవారు. ఒక పెద్ద కర్ర–దూలాన్ని చీల్చడానికి తోస్తున్నారు. ఇద్దరు మనుషులు మహారాజ్ దర్శనార్థం వచ్చారు. మహారాజ్ చాలా గొప్ప సంత్ అని వారు విన్నారు. ఇలా కఠినంగా శ్రమించే పనిని చేస్తున్న ఈయన సంత్ ఎలా కాగలడు అని వచ్చిన వారిలో ఒకరు మనసులో ఆలోచించారు. సంత్ అంటే ఆశ్రమానికి యజమాని. గద్దెకు యజమాని. అనేకమంది శిష్యులు ఆయన సేవకు హాజరవుతారు. అతడు నిరాశకులోనై మరలిపోయాడు. రెండవవాడు ఆలోచించాడు – ఇలా– "ఈయన ఇంత పరమ సంత్ అయి ఉండి కూడా ఇంతగా కష్టపడి పనిచేస్తున్నాడు. నేను కూడా శ్రమించి పనిచేయాలి" – అనుకుని ఏమీ మాట్లాడకుండానే తనింటికి వెళ్ళిపోయాడు. అన్యమనస్కంగా చేసే పనిని మనసు పెట్టి చేయసాగాడు.

ఒక సంవత్సరం తరువాత అతడు మళ్ళీ దర్శనానికి వచ్చి పాదాలకు మొక్కి "సంవత్సరం క్రితం కూడా నేను తమ దర్శనానికి వచ్చాను" అన్నాడు. "నాకు జ్ఞాపకం లేదు. అప్పుడు ఎందుకు వచ్చావు? ఇవాళ ఎందుకొచ్చావు" అడిగారు మహారాజ్. "నేనొచ్చేసరికి మీరు పనిలో నిమగ్నమై శ్రమిస్తున్నారు. అదిచూసి నాకొకటి అనిపించింది. ఒక సంత్ కూడా ఇంతగా శ్రమించి పనిచేస్తుండగా నేను నిర్లిప్తంగా, మనసు పెట్టకుండా పని చేయటం ఎందుకు అన్పించింది. నేను బాగా మనస్ఫూర్తిగా, ఏకాగ్రతతో నా వృత్తిపట్ల అంకితభావంతో పనిచేశాను. ఈ రోజు నా పనిలో నాకు సఫలత లభించింది. ఈ సంవత్సరం

నా ఆదాయం కూడా చాలా పెరిగింది” అన్నాడతడు.

సాధన స్థితిలో మహారాజ్ శిరస్సు చల్లగా అయ్యేది. మెదడు నుండి చందనం యొక్క సుగంధం వస్తుండేది. మహారాజ్ దీనిని గురించి మహర్షి దాతా దయాల్ జీ మహారాజ్‌కు ఉత్తరంలో రాశారు. “నాకు ఇలాంటి అనుభవం ఎదురు కాలేదు” అని జవాబు రాశారు మహర్షి మహారాజ్. సత్యాన్ని వ్యక్తం చేయటంలో ఆయన ఎప్పుడూ ఆలస్యం చేయలేదు.

స్వప్న స్థితి ప్రతి వ్యక్తికీ ఎదురవుతుంది. జాగ్రదవస్థలో ఏ వస్తువు యొక్క కోరిక మనిషిలో అధికంగా ఉంటే, ఏ వస్తువు పట్ల ప్రేమ అధికంగా ఉంటే అదే వస్తువు స్వప్నంలో కనిపిస్తుందని తరచుగా వింటుంటాం. మనం ప్రపంచాన్ని సత్యమని భావిస్తాం. ఎందుకంటే ఏ పనిని మిగిల్చి స్వప్నంలోకి వెళ్తామో, మెలకువ వచ్చాక దాని క్రమం చేయవలసే ఉంటుంది. కనుక మనం దీనిని సత్యం అని విశ్వసిస్తాం. ఈ ప్రపంచం కర్మక్షేత్రం, ఇక్కడ కర్మ చేయటం అవసరం. ఏ మనిషీ కర్మ చేయకుండా ఉండజాలదు. అవసరాలు మనిషిని కర్మ చేసేటందుకు వివశుణ్ణి చేస్తాయి. చేయక తప్పని పరిస్థితులు ఎదురవుతాయి. కర్మ ఉన్నచోట దాని ఫలితం కూడా ఉంటుంది. గత జన్మల కర్మల ఫలితాలే ఈ జన్మలోనో లేక భావి జన్మలలోనో అనుభవించవలసి వుంటుంది. సృష్టి నియమానుసారం ప్రతి వస్తువులో పరివర్తనం జరుగుతుంటుంది. ప్రపంచంలో ఏ వస్తువూ ఒకేస్థితిలో ఉండజాలదు. పరివర్తన సదా జరుగుతూ ఉంటుంది. శ్రద్ధగా గమనించి చూస్తే ఈ జీవితం కూడా ఒక స్వప్నమే!

జాగ్రదవస్థలో మనిషి స్థూల శరీరంతో పనిచేస్తాడు. దీని ప్రతిబింబం మనసుపైన పడుతుంది. ఎందుకంటే స్వప్నంలో మానసిక బలం పెరిగిపోతుంది. కనుక జాగ్రత స్థితి యొక్క ప్రభావాలు తమ ఆట ఆడిస్తాయి. ఈ ఆట పేరే స్వప్నం.

తనకు వచ్చే స్వప్నాలలో రైలు బండ్లు రావటం, పోవటం, టెలిగ్రాఫ్ దృశ్యాలు తప్పనిసరిగా వస్తాయని ఒక సందర్భంలో మహారాజ్ తన స్వప్నాల

గురించి చెప్పారు. ఎందుకంటే చిన్నతనం నుండి పేదరికం అనుభవించిన కారణంగా పొట్టకోసం, జీవితం గడవటం కోసం ఉద్యోగం చేయవలసి వచ్చింది. రైల్వే సర్వీస్‌లో చేరాక తన పనిని అత్యంత నిజాయితీగా, మనస్ఫూర్తిగా శ్రమించి పనిచేశారు. ఈ పని వెనుక శారీరిక మానసిక సంబంధాలున్నాయి. కనుక రైల్వే నుండి రిటైరై చాలా కాలం గడిచినా ఇప్పటికీ వాటి సంస్కారాలు తనలో ఉన్నాయి. ఆ కారణంగానే స్వప్నంలో రైళ్ళు వస్తాయి. భార్య, పిల్లలు, మానవతా మందిరం, సత్సంగీయులు ఎప్పుడూ కలలోకి రాలేదంటారాయన. మనిషికి ఏ వస్తువుతో ఎంత గాఢమైన, లోతైన సంబంధం ఉంటే అది స్వప్నంలో అవశ్యం కనిపిస్తుంది. ఏ మనిషికైనా కలలు రావటం లేదంటే అతనికి ఏ వస్తువుతోనూ గాఢమైన సంబంధం లేదని తెలుసుకోవాలి.

మాస్టర్ మోహన్‌లాల్ ఇంట్లో సత్సంగం జరుగుతోంది. అక్కడ ఐదుగురు వృద్ధ సన్యాసులు కూర్చుని ఉన్నారు. సత్సంగాన్ని శ్రద్ధగా విన్నారు. సత్సంగం ముగిశాక వాళ్ళు మహారాజ్ ఇంటికి వెళ్ళారు. ఒకరికి మనసులో ఒక సందేహం ఉండేది. దానికి జవాబు దొరకటం లేదు. నేటి సత్సంగంలో అది లభించింది. అదేమిటంటే ఆయన సన్యాసం తీసుకుని చాలా కాలం గడిచింది. అడవిలో ఉండేవాడు. వార్ధక్యం వచ్చింది. అయినా స్వప్న దోషం అయ్యేది. దీనికి కారణమేమిటో ఎవరూ చెప్పలేదు. ఈ రోజు మహారాజ్ సత్సంగంలో భోజన నియమం పాటించకపోవటం, జీర్ణ శక్తి బలహీనమవటం వంటి వాటిని వివరించారు. “నా వయసు ఎనభై ఏళ్ళు గడిచినా అప్పుడప్పుడూ ఈ ఫిర్యాదు బాధపెడుతుంది” అని మహారాజ్ తన దోషాన్ని చెప్పి ఆ సన్యాసుల వ్యాకులతను తొలగించారు.

ఒకసారి మహర్షి దాతా దయాల్ జీ హుక్కా నింపమన్నారు. మహారాజ్ లేచారు. చూసేసరికి కుంపటిలో నిప్పులు లేవు. నిప్పు రాజేయడానికి చుట్టుపక్కల ఏ వస్తువూ కనిపించలేదు. మహారాజ్ తన తల పాగా చించి కుంపటిలో వేసి అంటించారు. నిప్పు రాజేసి హుక్కా నింపి తెచ్చారు. ఎవరో సత్సంగి ఈ

విషయాన్ని మహర్షి దాతా దయాల్ జీకి చెప్పారు. "మంచిది! ఫకీర్ యొక్క తలపాగా – పగిడీ (గౌరవం) జీవితాంతం క్షేమంగా ఉంటుంది" అన్నారు మహర్షి మహారాజ్.

మహారాజ్ సత్సంగంలో వచనాలు చెబుతున్నప్పుడు మహర్షి దాతా దయాల్ పేరు పదే పదే ప్రస్తావిస్తుంటారు. ఎంతో ప్రేమగా, గౌరవంగా జ్ఞాపకం చేస్తారు. దాతా దయాల్ జీ దయను చెబుతుంటే మహారాజ్ కళ్ళు కన్నీళ్ళతో నిండుతాయి. కృతజ్ఞత వ్యక్తం చేస్తుంటారు. మహర్షి వంటి పవిత్ర విభూతి ఎక్కడ? ఒక సాధారణ ఫకీర్ ఎక్కడ? అంటుంటారు.

నీ మేలు కోరేవారికి నీవు కూడా మేలు కోరుకో. నీవొకవేళ వారికి చెడుకోరితే నీకు ఎప్పటికీ మేలు కలుగదు. కృతఘ్నునికి రెండు లోకాలలోనూ ఎప్పటికీ శాంతి లభించదు. తండ్రితో శత్రుత్వం పెట్టుకునేవాడు పితృద్రోహి, రాజుకు ద్రోహం చేసేవాడు రాజద్రోహి, దేశద్రోహం చేసేవాడు దేశద్రోహి అనబడతారు. గురుద్రోహికి ప్రపంచంలో ఎన్నటికీ సుఖం లభించదు. ఎందుకంటే గురువే శిష్యునికి సత్యమైన హితైషి. ఈ ద్రోహులందరికీ వారి వారి పాపాలకు దండన అవశ్యం లభిస్తుంది.

మహారాజ్ దగ్గరికి ఓ వ్యక్తి వచ్చి "చాలా దుఃఖపడుతున్నాను" అన్నాడు. "నీకేం కష్టమొచ్చింది? ఎందుకు దుఃఖపడుతున్నావు" అని అడిగారు మహారాజ్. "మా పెళ్ళికి ముందు నా భార్యకు మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉంది. ఈ విషయం తెలిసి నేను ఆమెను ఇంటి నుండి వెళ్ళగొట్టాను" అని చెప్పాడతడు.

మహారాజ్ బాధ వ్యక్తం చేసి "నీవు సరైన పనే చేశావు. కానీ నాకు ఒక విషయం చెప్పు. నన్నేమనుకుని నా దగ్గరికి వచ్చావు?" అని అడిగారు. "సంత్ అని భావించి వచ్చాను" అన్నాడతడు. "సంతుల ఎదుట అబద్ధం చెప్పటం మహాపాపం. నేను ఇప్పుడు నిన్నేది అడిగినా సత్యమే చెప్పాలి" అన్నారు మహారాజ్. అతడు అంగీకరించాడు. "నీ వివాహానికి ముందు నీవు పరాయి యువతులతో వ్యభిచరించలేదా?" అని అడిగారు మహారాజ్. ఆ వ్యక్తి సిగ్గుపడ్డాడు. "ముగ్గురు

స్త్రీలతో వ్యభిచారం చేశాను" అని చెప్పాడు. "ఐతే నీవే నిర్ణయం చెయ్. పెద్ద అపరాధివి నీవా? నీ భార్యనా? నీవు ముగ్గురమ్మాయిలను భ్రష్టు పట్టించావు. నీవు నీ భార్య అపరాధాన్ని క్షమించలేకపోతే నీ అపరాధం ఆమె కంటే ఎక్కువగా వుంటుంది. ఇక మరి నీవు ఎలా క్షమను ఆశిస్తున్నావు? కనుక నీ భార్య తప్పును క్షమించు. ఆమె ఏదో తప్పు చేసిందన్న విషయం మర్చిపో. ఆమెను నీ ఇంటికి తీసుకురా. ప్రేమగా ప్రవర్తించు. ఇద్దరూ సత్యసంధులై జీవితం గడపండి" అన్నారు మహారాజ్. ఆ వ్యక్తి మహారాజ్‌గారి చరణాలపై పడి క్షమాపణ వేడుకున్నాడు. వెళ్ళి తన భార్యను తెచ్చుకున్నాడు. ఇద్దరూ ప్రేమతో జీవితం గడపసాగారు.

పాపాలను నశింపచేయాలనుకుంటే అందుకు సరైన ఉపాయం వాటిని స్వీకరించటమే! అంగీకరించటమే అంటారు మహారాజ్. తన పాపాలను అంగీకరించటమే పాపాలను ప్రక్షాళన చేసుకోవడానికి సులభమైన మార్గం. మనిషి తన గురువు ఎదుట తన తప్పులను ఒప్పుకోవటం అన్నిటికంటే మంచి విషయం. అతని తప్పులు ఆ క్షణమే నశించిపోతాయి. చిత్తవృత్తి తేలికపడుతుంది. ఒకవేళ సద్గురువు ఎదుట అంగీకరించడానికి ధైర్యం సరిపోకుంటే ఎవరైనా సత్సంగి ఎదుట ఒప్పుకో. అంతకూడా చేయలేకుంటే గది తలుపులు మూసుకో. ఏకాంతంలో సద్గురువును ధ్యానించి గట్టిగా - బిగ్గరగా గొంతెత్తి నీ పాపాన్ని ఒప్పుకో. ఒకవేళ ఇది కూడా చేతగాకుంటే నీ మనసు ఎదుటనే పాపాన్ని ఒప్పుకో. పశ్చాత్తాపపడు. భవిష్యత్తులో ఇలాంటి పాపాన్ని ఇక చేయనని ప్రతిజ్ఞ చేయి. దీనివలన పాపవిముక్తి కలుగుతుంది. 1925 నాటి మాట! పండిత్ మనసారామ్ బగ్దాద్ నుండి మహర్షి దాతా దయాల్‌జీకు ఉత్తరం రాశాడు. అందులో ఏదో తన పాపాన్ని ప్రస్తావించాడు. మహర్షి మహారాజ్ జవాబిచ్చారు -

*'బాజ్ ఆ "బాజ్ ఆ" ఆంచ్ హస్తీ బాజ్ ఆ ।*
*గర్ కాఫిర్ వ గర్ వ బుత్ పరస్తీ బాజ్ ఆ ॥*

*ఏన్ దర్‌గాహ ఆ, దర్‌గాహ న ఉమ్మేదీ నేస్త్ ।*
*గర్ సద్ వార్ తో బా శికనీ బాజ్ ఆ ॥*

ఇది ఒక ముసల్మాన్ ఫకీర్ వచనం. ఈశ్వరుడు భక్తునికి బోధిస్తూ. "నీవు నీ పాపాలకు క్షమ యాచిస్తే, తప్పు ఒప్పుకుంటే భవిష్యత్తులో ఇలా చేయనని మాటిస్తే నేను నిన్ను క్షమిస్తాను. నా సభలో, నా సన్నిధిలో నిరాశ లేదు. నీవు కూడా ఆశ యొక్క కొంగును చేతితో విడిచిపెట్టకు. ఏదైనా కుకర్మ నీవల్ల జరిగితే పశ్చాత్తాపపడు. క్షమను యాచించు. ముమ్ముందుకై చెంపలు వాయించుకో. నేను నిన్ను క్షమిస్తాను" అంటాడు ఈశ్వరుడు..

మహారాజ్ హుజూర్ రాయ్ సాలిగ్‌రామ్ మహారాజ్‌ను చాలా ప్రశంసిస్తారు. ఆయన రాధాస్వామి మతానికి పునాది వేశారు. ప్రారంభంలో మహర్షి మహారాజ్ హుజూర్ మహారాజ్ జీవన చరిత్ర చదువుమని తనను ఆదేశించారన్నారు మహారాజ్. ఆ పుస్తకం చదివినందువలన ఆయన పవిత్ర జీవనం యొక్క విశేష ప్రభావం తనపై పడిందంటారు. తనకు హుజూర్ మహారాజ్ దగ్గరి నుండి లభించిన బోధన అదే పద్ధతిలో పరమ దయాల్‌జీకి అందించారు మహర్షి దాతా దయాల్. మహారాజ్ రాధాస్వామి మతంలోకి ప్రవేశించినప్పుడు అన్నిటికంటే ముందుగా మహారాజ్‌కు 'సారబచన్' పద్యాను చదవమని ఇచ్చారు దాతా దయాల్. అందులో రామకృష్ణులు, ఋషులు, మునులు అందరిపైనా విమర్శ ఉంది. ఖండన ఉంది. మహారాజ్ సనాతన సంప్రదాయవాది. రాముణ్ణి ఆరాధించేవాడు. రామ భక్తుడు. కనుక వాటిని చదవగానే బాధనిపించింది. ఈ విషయాన్నే మహర్షి దాతా దయాల్‌కు చెప్పగా అయితే సార్‌బచన్ చదవటం ఆపేసి హుజూర్ మహారాజ్ జీవిత చరిత్ర చదువుమన్నారు. మహారాజ్ దానిని అనేకసార్లు చదివారు. ఆయన క్రియాత్మక జీవనం నా జీవితానికి మార్గదర్శనం చేస్తున్నదంటారు మహారాజ్.

హుజూర్ రాయ్‌సాలిగ్‌రామ్ మహారాజ్ జీవితంలో జరిగిన ఒక సంఘటన ఇలా ఉంది. ఆయన ఒకసారి రైల్లో ప్రయాణిస్తున్నారు. రైలు ఒకస్టేషన్‌లో చాలాసేపు ఆగింది. తపాలా సంచులు అధికంగా ఉన్నందున సమయం పడుతోందని తెలిసింది. ఆయన తపాలాకు సంబంధించిన కాబిన్‌వైపు వెళ్ళి తపాలా సంచుల్ని స్వయంగా తన భుజంపైకి ఎత్తుకుని డబ్బా లోపలికి విసిరివేయ

సాగారు. ఆ రోజుల్లో ఆయన పంజాబ్, రాజస్థాన్‌లకు పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా ఉన్నారు. ఎవరో అడగ్గా ఈ బాధ్యత నాది అన్నారాయన. ఈ ఆదర్శాన్ని పరమ దయాల్‌జీ మహారాజ్ తను కూడా పాటించారు.

1965లో మహారాజ్‌కు హుజూర్ రాయ్ సాలిగ్‌రామ్ మహారాజ్ పవిత్ర చరణాలలో శ్రద్ధాంజలి అర్పించే అవకాశం లభించింది. చాలా రోజులు నుండి ఆయనకు ఆ అభిలాష ఉంది. హుజూర్ రాయ్‌సాలిగ్‌రామ్ మహారాజ్ సమాధి వద్ద ఆచార్య శ్రీ అగమ్ ప్రసాద్ గారు సత్సంగం చేసేవారు. ఆయన ఆగ్రాకు రమ్మని మహారాజ్‌ను ఆహ్వానించారు. మహారాజ్ ఆగ్రాకు వెళ్ళారు. సమాధి వద్ద సత్సంగమిచ్చారు. శ్రద్ధతో పుష్పాలర్పించారు. "నేను ఈ శుభ సందర్భంలో ఈ పవిత్ర స్థానానికి యాత్రచేసి వచ్చాను. జీవులకు సుఖ శాంతిమయ జీవన మార్గం చూపిన ఆ పరమ పవిత్ర విభూతికి నా శ్రద్ధాంజలి" అన్నారు.

ప్రాపంచికులు ప్రాపంచిక సుఖాలను పొందాలనే లాలసతో నా దగ్గరికి వస్తారు. కొందరికి సంతానం కావాలని ఉంటే మరికొందరికి ధనం కావాలనే కోరిక ఉంటుంది. ఇంకొందరు రోగాల నుండి విముక్తి పొందాలని వస్తారు. అసలైన వస్తువును కోరి వచ్చేవారెవరూ లేరు. కాలం మాయల చక్రం నుండి బయటికి తీయడానికి రాధాస్వామి మతం వచ్చింది. ఇప్పుడు అది కూడా కాలం, మాయల పూజారిగా మారింది. ఎక్కడి రాధాస్వామి మతం? ఎక్కడి సమాధికి పూజ? గురువుల సమాధులు నిర్మాణమవుతున్నాయి. వారి బట్టలు, పాదరక్షలు, మంచం పూజించడానికి జాగ్రత్త పరచబడుతున్నాయి. ఇది మూర్తి పూజ కాదా? ఇలాంటి స్థితిలో మూర్తి పూజను విమర్శించి ఖండించడానికి రాధాస్వామి మతం వారికి ఏం హక్కు ఉంది? ఇందులో జీవుల దోషమేముంది? సత్సంగీయులవి శ్రేణులుంటాయి. సాధారణ స్త్రీలు, పిల్లలు, సాధారణ ప్రజలు ఈ ఉన్నత శ్రేణి బోధనను అర్థం చేసుకోజాలరు. మూర్తి పూజ చేయడమే వారి శ్రద్ధ, ప్రేమ, భక్తిని పెంపొందించి, ఆనందం పొందే పద్ధతి.

కళ్ళారా చూసిన విషయం. జలంధర్ లోని భైరోఀ బజార్‌లో నివసించే దాదాపు నలభై సంవత్సరాల వయసున్న ఒక వ్యక్తి భార్యతో కలిసి మహారాజ్

దగ్గరికి వచ్చాడు. "పెళ్ళయి 12 సంవత్సరాలు దాటింది. కానీ ఇంకా సంతానం కలగలేదు. మీరు దయ చూపండి" అన్నాడు. "నువ్వేం పనిచేస్తావు?" అని అడిగారు మహారాజ్. "నేను వైద్యుణ్ణి" అన్నాడతడు. "నీకు పుత్రుడు కావాలంటే ఒక పనిచేయి. డబ్బులేని బీదరోగులకు ఉచితంగా చికిత్సచేయి. బయటినుండి నిన్ను పిల్చుకు పోవడానికి రోగుల బంధువులో, మిత్రులో వస్తే, వారు పేదవారైతే వారింటికివెళ్ళి ఉచితంగా వైద్యం చేయి. కొడుకు పుడతాడు" అన్నారు మహారాజ్.

అతడు మహారాజ్ ఆజ్ఞను పాటించాడు. ఓ సంవత్సరం తరువాత మాస్టర్ మోహన్‌లాల్ ఇంట్లో సత్సంగం అవుతున్నప్పుడు ఆ వైద్యుడు, అతని భార్య అక్కడికి వచ్చారు. వారి చేతుల్లో పసివాడున్నాడు. "మీరు వీడికి నామకరణ సంస్కారం నిర్వహించండి" అని ప్రార్థించారు. "ఎవరు మీరు" అడిగారు మహారాజ్. అతడు తన కథ విన్పించాడు. "నేను ఈ కుర్రవాణ్ణి మీకివ్వలేదు. నిరుపేదలకు నీవు ఉచితంగా వైద్యం చేసినప్పుడు వాళ్ళిచ్చిన దీవెన ఫలితం ఇది. మంచిది. ఈ శిశువుకు ఫకీర్‌చంద్ అని పేరు పెడుతున్నాను" అన్నారు. పేదవారికి ఉచితంగా వైద్యం చేసినందున శిశువు జన్మిస్తాడని వారికి విశ్వాసం కలిగింది. ఆ విశ్వాసం ఫలించింది.

లాలా గోపాల్‌దాస్ అమృతసర్ నుండి మహారాజ్ కోసం ఒక రిక్షా తయారు చేయించుకొని తెచ్చాడు. దానిని చూసి మహారాజ్ క్రోధితులయ్యారు. "రిక్షా కోసం ఐదువందల రూపాయలు ఖర్చు పెట్టిన గోపాలదాసు మూర్ఖుడు" అన్నారు. ఆ రోజు మహారాజ్ గారి దగ్గర గోపాలదాసుకు ఇవ్వడానికి 500 రూపాయలు లేవు. గోపాలదాసు ప్రతినెలా మహారాజ్‌గారి దగ్గరకు వస్తుంటాడు. మహారాజ్‌గారు తమ నౌకరు జుగేందర్ సైకిల్‌పై వెనుక కూర్చుని మానవతా మందిరానికి రావటం అతడు చూస్తుంటాడు. రిక్షాపై వెళ్ళడానికి మహారాజ్ సిద్ధంగా లేరు. రిక్షాను అద్దెకిచ్చి ఆ అద్దె డబ్బును గోపాలదాసుకు ఇచ్చేయ్యాలని ఆలోచించారు.

గోపాలదాసుకు డబ్బు మొత్తం తీర్చేవరకు ప్రతినెల దానివడ్డీ ఇవ్వాలన్నాను నేను. అప్పుడు మహారాజ్ ప్రతినెలా 15 రూపాయలు గోపాలదాసుకు ఇవ్వాలని

నిర్ణయించారు. రిక్షా నడపమని జుగేంద్రకు ఎందుకు కష్టం కలిగించటం అన్నారు మహారాజ్. జుగేంద్ర ఆజ్ఞాకారి, శ్రద్ధాళువు అయిన నౌకరు. సత్యమైన మనసుతో మహారాజ్ గారి సేవ చేస్తుంటాడు. ఇతరులు ఎవరూ వెళ్ళకుండా తను ఒక్కరే రిక్షాపై వెళ్ళడానికి మహారాజ్ అంగీకరించారు.

మనిషి చేసిన కర్మ ఎప్పుడూ నశించదు. అది సంస్కారంగా మారి మనిషి మస్తిష్కంపై ముద్రితమవుతుంది. సమయం వచ్చినప్పుడు తన ప్రభావం చూపిస్తుంది. కర్మ స్థూలమైనా, మానసికం సూక్ష్మమైనా అన్నిటి ప్రతిబింబం మస్తిష్కంపై ఉంటుంది. ఎప్పుడైనా మనిషి శరీరం బలహీనమైనప్పుడు ఆ సంస్కారాలు ఉబికి వస్తాయి. గతకర్మలు మనిషి జ్ఞాపకంలో తాజా అవుతాయి. మనిషి కర్మ ఫలాన్ని అనుభవించనంతవరకు అది నశించదు. కొంత కాలం వరకు అణగి వుంటుంది కానీ దాని ప్రభావం మనసుపై ఉంటుంది. తరచుగా దాని చిత్రం జ్ఞాపకాలలో కదులుతూ ఉంటుంది. శారీరిక, మానసిక రూపాలలో తను చేసినదంతా మనిషి ఎదుటికి తప్పనిసరిగా వస్తూ ఉంటుంది.

మనసును ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలంటారు మహారాజ్ గారు. క్షణక్షణం ఇరవై నాలుగు గంటలు, ఇరవై నాలుగు గంటలలో ఒకసారి ఏకాంతంలో తను చేసిన కర్మలపై దృష్టి మళ్ళించాలి. ఏదైనా పొరపాటు పని జరిగితే, తప్పుడు ఆలోచన మనసులోకి వస్తే పశ్చాత్తాపపడి భవిష్యత్తులో అలాంటి పని చేయకుండా తప్పించుకుంటానని ప్రతిజ్ఞ చేసుకోవాలి. శుభ విచారాలు కలిగి ఉండటానికి ప్రయత్నం చేస్తుండాలి. ఇలా ఆచరిస్తే మనసుపై పడిన చిత్రాల ప్రభావం తగ్గే వీలుంది.

పాత సంస్కారాలను అణచి ఉంచటం మంచిది. నీవు వాటిని మరిచిపో. నీ మనసులో శుద్ధ సంకల్పం పెట్టుకో. దానివలన పాత సంస్కారాలు అణగి ఉండి నెమ్మది నెమ్మదిగా వశంలోకి వస్తాయి. పాత సంస్కారాలు అనుకూల సామగ్రి లభించినప్పుడు నాలుగువైపుల నుండి చుట్టుముడతాయి. కబీర్ సాహబ్ అంటారు ఇలా –

## జబ్ లగ్ దరేం సంత్ జన్, జబ లగ్ పింజర్ సాథ్

1961 నాటి విషయం. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వం ఆహ్వానించగా ఒక అమెరికన్ ప్రొఫెసర్, అతని భార్య భారత దేశానికి వచ్చారు. వాళ్ళు యావద్భారతం పర్యటించారు. అనేక ప్రదేశాలలో వారి సాహిత్యంపై వ్యాఖ్యానాలు జరిగాయి. వారి ప్రోగ్రామ్‌లో హోషియార్‌పుర్ కూడా ఉంది. వాళ్ళు హోషియార్‌పుర్‌కు వచ్చాక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భరద్వాజను వారికి స్వాగత సత్కారాలు చేయడానికి నియమించాడు. వాళ్ళు అక్కడ ఉపన్యసించారు. బయల్దేరడానికి ముందు వాళ్ళు హోషియార్‌పుర్ ఊరు చూడాలనుకున్నారు. శ్రీ భరద్వాజ వారిని ఊరంతా తిప్పి చూపించారు. "అంతా చూశామా? లేక ఇంకేమైనా మిగిలి ఉందా?" అడిగాడు అమెరికన్ ప్రొఫెసర్. "మరొక ప్రదేశం మీకు చూపవలసి ఉంది. ఇక్కడ ప్రపంచంలో అందరికంటే గొప్ప వ్యక్తి...?" అంటూ ఈ వాక్యాన్ని చాలాసార్లు పలికాడు. శ్రీ భరద్వాజగారు అమెరికన్ ప్రొఫెసర్‌ను మహారాజ్ పనిచేసే చోటికి తీసుకు వెళ్ళాడు.

అమెరికన్ ప్రొఫెసర్ కారును రోడ్డు పైన నిలిపి భరద్వాజ వెంట లోపలికి నడిచాడు. అక్కడ ఆయన మరింత ఆశ్చర్యానికి లోనయ్యాడు. ఎక్కడి కట్టెల దుకాణం? ఎక్కడి ప్రపంచంలో అందరికంటే గొప్ప మనిషి? మహారాజ్ ఎదుటికి వెళ్ళబోతూ అమెరికన్ ప్రొఫెసర్ చెప్పులు విప్పబోయాడు. "ఫరవాలేదు ఉండనీ" అని భరద్వాజ ఆపాడు. అతడు కానుక చేయడానికి కొన్ని రూపాయలు తీశాడు. "ఇక్కడ వాటి అవసరం లేదు" అని వారించాడు భరద్వాజ. మహారాజ్ ఒక మంచంపై పడుకొని విశ్రాంతి తీసుకుంటూ హుక్కా పీలుస్తున్నారు. అమెరికన్ ప్రొఫెసర్‌కు ఈ వాతావరణం చూసి చాలా ఆశ్చర్యం కలిగింది. "ప్రపంచంలో అందరికంటే గొప్ప మనిషి ఈయనేనా?" అడిగాడు. భరద్వాజ అవునని కుర్చీలు తెప్పించాడు. ఇద్దరు ప్రొఫెసర్లూ కూర్చున్నారు. సంభాషణ ఆంగ్లంలో కొనసాగించారు. ప్రొఫెసర్ సంభాషణ సమయంలో తననుతాను మరిచి ఆవేశానికి లోనయ్యారు. సమయం తెలియనే లేదు. "మీరు డా॥ సర్దారీ లాల్ ఇంటికి

తేనీటి కోసం వెళ్ళాల్సి ఉంది" అంటూ భరద్వాజ జ్ఞాపకం చేశాడు. 5 గంటలకు వస్తామని సమయమిచ్చారు. అతను ఉలికిపడి లేచి బయటికివచ్చి కార్లో డాక్టర్ సర్దారీలాల్ ఇంటికి చేరారు. అమెరికన్ ప్రొఫెసర్ ఒక విధమైన ఆవేశంలో, ఆనందంలో ఉన్నాడు. ఇంట్లోకి అడుగు పెడుతుండగా తలుపుపై భాగానికి తల కొట్టుకుంది. బొడిపె కూడా వచ్చింది. రక్తం కారసాగింది. డాక్టర్‌గారు పరుగెత్తుకుని వచ్చారు. తలకు పట్టీ కట్టారు. అమెరికన్ ప్రొఫెసర్ భార్య ఎంతో బాధపడి, "ఎలా ఉంది"? "ఎలా ఉంది"? అని అడగసాగింది. అమెరికన్ ప్రొఫెసర్ తన భార్యతో 'I am alright. I am in a trance that old man has done something to me. Be silent. Let me enjoy that ecstasy - అనగా నీవు నన్ను కదిలించకు. నేనిప్పుడు బాగున్నాను. ఆనంద పారవశ్యంలో ఉన్నాను. నాకు తనువుపై స్పృహ లేదు. ఆ వృద్ధుడు ఏమో చేశాడు. నన్ను ఆనందాన్ని పొందనివ్వు" అన్నాడు. అమెరికాకు వెళ్ళాక ఏడుపేజీల ఉత్తరం రాశాడు. "ప్రపంచంలో అందరికంటే గొప్ప వ్యక్తి హోషియార్‌పుర్‌లో ఉన్నాడు. కానీ భారతీయులు ఆయనకు ఇవ్వవలసినంత గౌరవం ఇవ్వరు" అని అందులో రాశాడు.

# మహారాజ్ గారి అనుభవాలు

## అడగటం - లభించటం

"అడుగు - లభిస్తుంది" అంటారు మహారాజ్. అడగటం, లభించటం (మాంగ్ అవుర్ పూర్తి - Demand and Supply) నియమం పనిచేస్తుంది. ఇతర పదాల్లో చెప్పాలంటే మనం దీనిని ప్రార్థన అనవచ్చు. ప్రార్థనలో చాలా శక్తి ఉంది. సత్యమైన హృదయంతో, తపనతో చేసిన ప్రార్థన ఫలదాయకమవుతుంది. హుమయూన్ ఆరోగ్యవంతుడు కావాలని బాబర్ ప్రార్థించాడు. అతడు స్వస్థత పొందాడు. ద్రౌపది పిలిచింది. ఆమె మాన సంరక్షణ జరిగింది. విశ్వాసం, దృఢంగా ఉండి, మనసులో తపన గలవారి ప్రార్థన వినబడుతుంది. కబీర్ కథనం ఇలా ఉంది -

*దాస్ దుఃఖీ తో మై దుఃఖీ, ఆది అంత్ తిహూఁ కాల్ ।*
*పల్ మే ప్రగట్ హోయ్ కర్, ఛిన్ మే కరూఁ నిహాల్ ॥*

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మనకు ప్రార్థించటం రాదు. మన మనసులో ప్రేమ లేదు. శ్రద్ధ, విశ్వాసం లేదు. ఆ భగవంతుడు నీ అంతరంలో ఉన్నాడు, నీ వెంటే, నీతో, నీలో ఉన్నాడు. ఆయన అవశ్యం నిన్ను సంభాళిస్తాడు. ఇది నా అనుభవం.

## మరణించే సమయంలో తీసుకువెళ్ళడానికి గురువొస్తాడా?

ఇవాళ రేపు అన్ని సత్సంగాలలో ఒక విషయం గురించి ప్రచారం చేస్తుంటారు. మరణ సమయంలో సత్సంగిని తీసుకు వెళ్ళడానికి సద్గురువు వస్తాడనీ, సత్ లోకానికి చేర్చుతాడనీ చెబుతుంటారు. అంధ విశ్వాసపరులు శ్రద్ధాళురు తప్పుడు వివేకం వైపు, భ్రమలకు ఎరవుతున్నారు. దేహధారి గురువు తన శిష్యుడు, సత్సంగి మరణిస్తుంటే తీసుకు వెళ్ళడానికి వస్తాడనో, దర్శనం ఇస్తాడనో అనుకోవటం పొరపాటు. ఇది కేవలం తమకు నిధులు, కానుకలు పెంచుకోవటం కోసం, తమ పరిధిని పెంచుకోవడానికి ఒక రకమైన ప్రచారం మాత్రమే! బాహ్య గురువుతో సత్సంగీయులు సత్సంబంధాలు పెంచుకుని, ద్రవ్యం, కానుకలు అర్పించాలని చేసే అసత్య ప్రచారం తప్ప మరేం కాదు.

ఇది సంత్ మతం వారిలోనే కాదు ఇతర ధర్మ సంప్రదాయాలలో కూడా ఈ విషయం పాతుకుపోయింది. రాముడు, కృష్ణుడు, దేవి, దేవుళ్ళు మనిషి మరణ కాలంలో దర్శనమిస్తారనీ, తమను తీసుకువెళ్తారనీ విశ్వసించటం మామూలైపోయింది. ఈ తప్పుడు ధారణతో, తప్పుడు నమ్మకం కారణంగా దోపిడీకి గురై మోసపోతున్నారు. తమ మతం – తమ ధర్మానికి తామే సంరక్షకులమనే భావం పెంచుకుని కాఠిన్యం వహిస్తున్నారు కొందరు.

ఈ భ్రమలను తొలగించడానికి మహారాజ్ చాలా స్పష్టమైన, పదాలలో

దీనిని విమర్శించి ఖండించారు. లోకులు వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని వాస్తవాన్ని వ్యక్తం చేశారు.

సాధన, అభ్యాసం చేసేవారికి, భక్తులకు అంతరంలో ఆ గురువు, దేవి, దేవుడు, రాముడు లేదా కృష్ణుడు మొదలైన వారి దర్శనం లభిస్తుంది. ఆ రూపం వారికి పథ ప్రదర్శన చేస్తుంది. మార్గం చూపి, సహాయం చేసి, వారి పనిని నిర్వహిస్తుంది. దీని ఫలితంగా లోకులు దానిని సత్ అనీ, దానినే సమస్తం, సర్వంగా భావించే మొండివారిగా తయారయ్యారు. ఎవరికైనా రాముని దర్శనం అయితే అతడు రాముని పూజారి అయ్యాడు. ఎవరికైనా గురువు లేదా ఎవరైనా దేవి, దేవుడు దర్శనమిస్తే వారు ఆయన్ను అంతా అనుకుని ఆ దైవాన్నే విశ్వసించి, పట్టుదలగా స్వీకరించి ఇతరులకు విరోధులయ్యారు. ఈ అంధ విశ్వాసం లేదా పొరపాటు జ్ఞానం భారతదేశాన్ని అనేక ధర్మ సంప్రదాయాలలో విభజించింది. దీని కారణంగా ఒకరు మరొకరికి విరోధులయ్యారు. కలహాలు, జగడాలు జరుగుతుంటాయి.

మహారాజ్ ఈ గుప్త రహస్యం యొక్క పరదాలను తొలగించారు. వాస్తవాన్ని స్పష్టంగా వర్ణించారు. ఇవన్నీ మనుష్యుల వారి వారి శ్రద్ధ, విశ్వాసం లేక మనసు యొక్క ఆటలనీ – లీలలనీ, వాస్తవికంగా వీటిలో సత్యం లేదనీ స్పష్టం చేశారు. రాముడు, దేవి, దేవుడు గురువు ఎవరూ ప్రగటం కారు. సాక్షాత్కరించరు. ఇదాయన నిజ అనుభవం. వేలాది శ్రద్ధాళుర, విశ్వాసపరుల ఉదాహరణలను తమ సత్సంగాలలో మహారాజ్ చెబుతుంటారు.

"మీరు మా అంతరంలో ప్రకటమయ్యారు. ఔషధం చెప్పారు. నేను బాగయ్యాను" అంటారు ఒకరు. "పరీక్ష హాల్లో మీరు నాకు బదులు పరీక్ష రాశారు. అత్యధిక మార్కులతో పాసయ్యానంటారు మరొకరు. ఇలాగే ఒకరి పొలంలో శనగ పంట కోశారనీ, ఇంకొకరు తాను నదిలో మునిగిపోతుంటే రక్షించారనీ చెబుతుంటారు. ఇలాంటివి వేలాది సంఘటనలు సత్సంగీయుల ద్వారా మహారాజ్‌కు తెలుస్తున్నాయి. అమెరికాలో, ఇంగ్లండ్‌లో దర్శనమిచ్చి సత్సంగం

చేయించారని కొందరు చెప్పారు. మరణించే సమయంలో కొందరికి మహారాజ్ పల్లకీ తెచ్చి విమానం తెచ్చారని చెబుతారు. కానీ తను ఎక్కడికీ వెళ్ళలేదనీ, ఈ సంఘటన గురించి తనకు ఏమాత్రం తెలియదనీ మహారాజ్ చెబుతారు. వారి నిజ అనుభవాలు కూడా ఇలాంటివే ఉన్నాయి. మహారాజ్ మొదటి మహాయుద్ధ సమయంలో బస్రా బగ్దాద్‌లో ఉండేవారు. యుద్ధభూమిలో మహారాజ్ చిక్కుకున్నారు. తప్పించుకునే మార్గం లేదు. ఇక సమాధి స్థితిలోకి వెళ్ళారు. అప్పుడు ఆయన గురుదేవులు మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ రూపం ప్రకటమై "నీవు తుపాకీ గుండ్ల యుద్ధం. ఆపెయ్ శత్రువులు తమ మనుషుల శవాలను తీసుకువెళ్తారు" అని చెప్పగా ఆచరించారు మహారాజ్. అదే జరిగి మహారాజ్ రక్షింపబడ్డారు.

ఇదొక రహస్యం. ఈ విషయంపై ఇప్పటివరకు ఏ మహాత్ముడూ ఏమీ చెప్పలేదు. ఈ విషయం గూఢమైనదిగానే మిగిలింది.

దీనిగురించి వివరిస్తూ మహారాజ్, "నేను జీవించి హోషియార్‌పుర్‌లో కూర్చున్నాను. ఎవరి అంతరంలోకీ వెళ్ళలేదు. నేను కనిపించి సహాయం చేశానని మీరంతా చెబుతుంటారు. మీకు సహాయపడింది నేను కాను. అటువంటప్పుడు దేహం వదిలి వెళ్ళిన గురువు, అవతార పురుషుడు, నబీ, పీర్, పైగంబర్‌లు ఎవరి అంతరంలోనైనా ప్రకటమైనారని ఎలా విశ్వసించగలను?" అంటారు. ఈ విధంగా మహారాజ్ ఘోర అంధ విశ్వాసం పరదా తెరలు తీసి వాస్తవాన్ని ఘోషించారు. ఇదంతా మనిషి మనసు యొక్క ఆట–లీల, వారి శ్రద్ధా విశ్వాసం అని వివరించారు.

## సాధన అభ్యాసం

శరీరంలో ఉంటూ శారీరిక కర్మ, మనసులో ఉంటూ మానసిక కర్మ, ఆత్మలో ఉంటూ ఆత్మిక కర్మ కర్మ అనబడుతుంది అంటారు మహారాజ్. మనం ఒక్క క్షణమైనా కర్మ చేయకుండా ఉండజాలం. కర్మ చేయటం సృష్టి యొక్క ప్రాణం. కర్మ నియమం అందరిపైనా పనిచేస్తుంది. అందరికీ అన్వయిస్తుంది. జీవితం ఉన్నంతవరకు కర్మ క్రమం తప్పనిసరిగా పనిచేస్తూంటుంది. పిల్లవాడికి

ఆకలి అవుతుంది. వాడు ఏడుస్తాడు. అరుస్తాడు. ఇది కర్మ. శరీరాన్ని రక్షించుకోవడానికి బట్టలు, పొట్ట కోసం భోజనం ప్రతివారికీ అవసరమవుతాయి. వాటిని వెతుక్కోవడానికి మనిషి బయటికి వెళ్ళి పనిచేస్తాడు. జీవితాన్ని రక్షించుకోవడానికి అది ఆవశ్యకం.

మనసు వృద్ధి చలనం ప్రబలమైంది. విచారాలు, భావాలు, ఆలోచనలు ఉత్పన్నమయ్యాయి. కర్మ విస్తారం పెరుగుతూ పోయింది.

కర్మ చక్రంలోకి వచ్చి మనిషి దుఃఖితుడవుతాడు. దుఃఖం నుండి తప్పించుకోవాలనే ఆలోచన ఉదయించింది. సుఖశాంతులు కావాలనే కోరిక కలిగింది. సతగురువు శరణం లభించింది. ఆయన స్మరణ, ధ్యానం, భజనలను బోధించాడు.

స్మరణ చేయటం శరీరం పని. ధ్యానం చేయడం మనసు పని. భజన చేయడం సురత్ పని. అసలైన నామం యొక్క స్థానం వీటన్నిటికంటే పైన ఉంది.

స్మరణ చేయటం వలన శరీరం శూన్యం అవుతుంది. నిస్పందమవుతుంది. అనగా శరీర స్పృహపోతూ ఉంటుంది. మనసు, ఇంద్రియాలు అంతరం వైపు వెళ్ళిపోతాయి. వృత్తులు తమలోతాము నిల్చుంటాయి. స్మరణ పెదవులు, నాలుక కదల్చకుండా చేయాలి. అలాచేస్తే అది అజపాజపం అవుతుంది. మనసులోనే నామం జపించాలి. ఈ జపంలో సురత్‌ను జోడించి ఉంచాలి. సద్గురు స్వరూపం పైన ప్రేమ ఉండాలి. ఈ యుక్తితో అంతరంలో గురుమూర్తి–గురు రూపం ప్రకటమవుతుంది. రూపం అనగా మూర్తి కన్పించటంతోపాటుగా ప్రకాశం కూడా వ్యాపిస్తుంది. గురుమూర్తి యొక్క లేదా ఏదైనా రూపాన్ని ధ్యానం చేయటం మనసు పని. బౌద్ధిక జగత్తు మనిషి కొంచెంసేపట్లోనే దీనిని అర్థం చేసుకుంటాడు. మనసులో ప్రేమ, శ్రద్ధ, విశ్వాసం కలిగిన వారికి శీఘ్రమే మూర్తి అనగా రూపం ప్రకటమవుతుంది. గురువు దయ, ప్రేమ భావం వలన శీఘ్రమే సఫలత లభిస్తుంది. ఉదాహరణ చెబితే సులభంగా అర్థమవుతుంది. ఒక సౌభాగ్యవతి ఉంది. ఆమె

తన ప్రియతముడైన భర్త ఆలోచనతో సదా నిమగ్నమై ఉంటుంది. తన ప్రియుని ప్రేమ యొక్క ఆనందాన్ని పొందుతుంటుంది. ప్రియుడు తన దగ్గరున్న విశ్వాసం భావం ఆమెకు ఆనందాన్నిస్తుంటుంది. ఆమె మనసు ఎప్పుడూ విచలితం కాదు. అది ఆమె జీవితంలో ఒక అంశంగా, అవయవంగా మారిపోతుంది. ఇక ఆమె ఎప్పుడూ భర్త రూపాన్ని ధ్యానం చేయదు. అతని మూర్తిని - రూపాన్ని ఏర్పరచుకోదు. ఆమె ఎప్పుడూ కళ్ళు మూసుకోదు. ఆమె జీవనం ఆనంద జీవనం అయింది. సత్సంగి లేక సాధకుడు ఈ విధంగా సద్గురువును తన జీవితానికి ఆధారంగా భావించుకుంటే, ఆధారంగా చేసుకుంటే అతని మనసు కూడా స్వయంగా సమతలోకి వచ్చేస్తుంది. ఇక అది సురత్ యొక్క భక్తి చేస్తుంటుంది. సురత్ ఇష్టపదం లేదా చౌథాపదం, నాల్గవ పదం అయి ఉంది.

నామ భక్తి చేసే వారిలో ఎప్పుడైనా మూర్తి అనగా రూపం మాయమైతే, కన్పించకుంటే చింతించే పని లేదు. ఈ సమయంలో అజపాజపంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. శ్రద్ధ, విశ్వాసం, ప్రేమలను ప్రేరేపించాలి. ఇక ఆ లోటు తొలగిపోతుంది.

మూర్తి-రూపం మనసుతోనే ఏర్పడుతుంది కనుక ఆ మనసు జన్మ జన్మాంతరాల నుండి పడి ఉన్న సంస్కారాల ప్రభావంలోకి వచ్చేస్తుంది. మూర్తితో-రూపంతో మాట్లాడటం వలన ఆనందం లభిస్తుంది. కానీ మనసులో బలహీనత వస్తుంటుంది. దానివలన హాని కలుగుతుంది. మనిషి విశ్వాసంలో కూడా లోటు ఏర్పడుతుంది. విశ్వాసం తగ్గుతుంది. ముందుకు సాగటం కష్టమవుతుంది. కనుక మూర్తితో అనగా రూపంతో వార్తాలాపం - సంభాషణలు జరపకూడదు.

మనసు ఏకాగ్రం కావటం, విస్మాధితం కావటం చాలా కష్టం. ఒకవేళ సత్యమైన తపన ఉండి, మనసు నిర్మలమై ఉండి, వాసనల నుండి విశ్రాంతి లభించినట్లయితే పని సులభముగా జరుగుతుంది.

సాధన అభ్యాసం కోసం రోగం లేకుండా ఉన్న శరీరం, నిర్మలమైన మనసు, విశుద్ధ ఆత్మను కలిగి ఉండటం అవసరం. రోగగ్రస్తమైన మనసుతో సాధన

అభ్యాసం చేయడం సాధ్యం కాదు. ఆరోగ్యంగా లేని రోగిష్టివాడు. రోగంతో దుః ఖితుడైన మనిషి ఎప్పటికీ అభ్యాసం చేయలేడు. అతని ధ్యాస, ధ్యానం రోగం పైనే ఉంటుంది. పైకి వెళ్ళనే వెళ్ళజాలడు. శరీరం రోగంతో ఉంటే ఆరోగ్య నియమాలను పాటించాలి. దానితోపాటే పథ్యం ఉండాలి. ఎక్కువగా తినటం వలన శరీరం రోగగ్రస్థం అయినట్లే అనవసరమైన వ్యర్థ విచారాలను మస్తిష్కంలో నింపుకోవటం వలన మనసు కూడా దుర్బలమై, రోగగ్రస్తమవుతుంది. దాని చంచలత్వం పెరిగిపోతుంది. మనసు యొక్క రోగం నుండి విముక్తి పొందడానికి ఎవరైనా సాధువు యొక్క అవసరం ఉంది. ఆయన జ్ఞానం ఇచ్చి వాస్తవాన్ని బోధించి మనసును సరిచేస్తాడు. మనసులో అశాంతి ఉన్నంతవరకు ఏ సాధన అభ్యాసం జరగదు. స్మరణ, ధ్యానం చేస్తే మనసు చాంచల్యం తొలగిపోతుంది.

మనిషి భ్రమల్లో ఉన్నాడు. అతనికి వాస్తవాన్ని గురించిన జ్ఞానం లేదు. సాధన, అభ్యాసం, సత్సంగం వలన ఇతని భ్రమలు తొలగిపోతాయి. అప్పుడు వాస్తవం వైపు మళ్ళుతాడు. భక్తి భావం, ప్రేమ, శ్రద్ధ, విశ్వాసం మనిషి మనసును స్థిరం చేస్తాయి. అప్పుడు అంతరంలో అణగివున్న జన్మ జన్మాంతరాల సంస్కారాలు పెల్లుబుకి వస్తాయి. పది లీటర్ల పాలను పెరుగుగా మార్చడానికి ఒకటి రెండు చెంచాల తోడు చాలినట్లే బాహ్య సాంగత్యం, సత్సంగం చేసే అవసరం ఏర్పడుతుంది. ఈ సాధన సరళం, ప్రాకృతికం. ఇందులో కష్టమేమీ ఉండదు. సహజరీతితోనే చేయాలి. కానీ సాధన బాహ్య గురువు సహాయం లేకుండా చేయకూడదు. కేవలం పుస్తకాలు చదివి సాధనలో ఎప్పుడూ నిమగ్నం కారాదు.

## సంత్ సద్గురు వక్త్

రాయ్ సాలిగ్రామ్ మహారాజ్ సత్సంగంలో ఈ కింది విషయం చెప్పారు - సంత్‌లు చాలా మంది ఉంటారు. తమ గత జన్మల కర్మలను నశింప చేసుకోవడానికి ప్రపంచంలోకి వస్తారు. కానీ గుప్తంగా ఉంటారు. తమను తాము వ్యక్తం చేసుకుని, తమను తాము ప్రగటం చేసుకుని సత్సంగాన్ని ప్రారంభించే వారిని సత్‌గురు అంటారు. వారు ప్రపంచంలో అప్పుడప్పుడు ప్రగటమవు తుంటారు. ప్రపంచంలో దుఃఖితులు, అశాంతిపాలైన ప్రాణులకు తమ ఆవశ్యకత

ఉందనిపించినప్పుడు అవతరిస్తుంటారు. వారి బోధన నిజ అనుభవంపైన ఆధారపడి ఉంటుంది. అర్హులైన వారు తమకు తాముగా వారివైపు ఆకర్షింపబడి వస్తారు. వారి కథనంలో, వారి ప్రవచనంలో వాస్తవికత, నియమాల నుండి ముక్తి పొందిన స్వేచ్ఛ, స్వతంత్ర భావన ఉంటుంది. ఏదో ఒక ధార్మిక గ్రంథ ప్రమాణం ఇవ్వరు. నిస్వార్థ, నిష్కామములు గలవారై, ధార్మిక బంధన రహితులై ఉంటారు. వారి వచనములే ప్రమాణాలై ఉంటాయి.

కబీర్ సాహబ్ సంత్ సద్గురు వఖ్త్ అయి ఉన్నారు. ఆయన ఏదో ఒక మతం-ధర్మంను స్థాపించలేదు. దానికి పునాది వేయలేదు. ఆయన వచనాలు అన్నిరకాల బంధనాలకు అతీతంగా ఉన్నాయి. బంధన రహితమై ఉన్నాయి. ఏం చెప్పినా తన మాటగా చెప్పేవారు. వచనంలో రసం, ఆకర్షణ ఉండేది. ఏ విషయాన్ని గురించి వ్యాఖ్యానించినా పూర్తిగా వర్ణించారు. ఆయన చెప్పిన మాటలు, కథనం సంత్ మతంలో ప్రమాణంగా భావించబడుతుంటాయి.

గురునానక్ సాహబ్ సంత్ సద్గురు వఖ్త్ అయి ఉన్నారు. ఆయన బోధన కూడా ధార్మిక జగత్తులో ఉన్నతమైనదీ, స్వతంత్రమైనది. ఆయన ఎప్పుడూ ఏదో ఒక పంథ లేదా సంప్రదాయానికి పునాది వేయలేదు. ఆయన మాటలు, కథనమే ప్రమాణంగా భావించబడుతుంది.

సత్పురుషుడు రాధాస్వామి దయాలుడు సంత్ సద్గురు వఖ్త్ అయి ఉన్నారు. ఆయన శుభనామం శివ దయాల్ సింగ్. ఆయన బోధన కూడా ధార్మిక జగత్తు కంటే ఉన్నతం, స్వతంత్రమై ఉంది. ధర్మపంథను గురించి ఆలోచించకుండా ప్రతి మనిషికీ లాభం కలిగించారు. ఆయన పేరు రాధాస్వామి దయాల్ అని రాయ్ సాలిగ్రామ్ సాహబ్ పెట్టారు. రాధాస్వామి మతానికి పునాది కూడా ఆయనే వేశారు. స్వామీజీ మహారాజ్ స్వయంగా ఏ ధర్మానికి, పంథకు పునాది వేయలేదు. ఆయన కథనం కూడా ప్రమాణంగా భావించబడుతుంది.

పరమ దయాల్ ఫకీర్‌చంద్ మహారాజ్ సంత్ సద్గురు వఖ్త్ అని నేను నిష్పక్షపాతంగా అంటున్నాను. ఆయన బోధ నిజ అనుభవం ఆధారితమే అయి

ఉంది. ఆయన వచనాలు తమకు తామే ప్రమాణాలవుతాయి. ధార్మిక గ్రంథాలను గానీ, ఇతర సంత్ మహాత్ముల వచనాల ప్రమాణాలివ్వరు. ఆయన తన బోధనలో సమయపు ఆవశ్యకత, లోకుల వాలు - వంపు, ప్రస్తుత వాతావరణాన్ని అనుసరించి పరివర్తనం చేశారు. రోచకమైనవి, భయానకమైన మాటలు చెప్పరు. ఏం చెప్పినా యథార్థమైనవే చెబుతారు. శ్రోతలు అత్యంత ప్రభావితులవుతారు.

ఈ పుస్తకంలోనే మీరు ఒక బందిపోటు దొంగ సంఘటన చదివారు. అతనికి "నీవు భక్తుడవు. దొంగవు కాదు. దొంగలు నిజం చెప్పరు" అనే హెచ్చరిక మాత్రమే సరిపోయింది. కేవలం ఈ వాక్యం ఒక సత్పురుషుని నోటి నుండి వెలువడింది - అంతే! బందిపోటు దొంగ జీవితం పూర్తిగా మారిపోయింది. ఇదేవిధంగా ప్రతి ఒక ప్రాణికి వేర్వేరు బోధన, ఉపదేశం అవసరం. ఉపదేశించేవారు వేర్వేరుగా ఉంటారు. చిన్న పిల్లలకు చదువు చెప్పడానికి ఆడుతూ పాడుతూ నేర్పించగలిగే ఉపాధ్యాయుడు అవసరం. కానీ కళాశాల విద్యార్థికి యోగ్యుడైన, అనుభవజ్ఞుడైన ప్రొఫెసర్ ఆవశ్యకత ఉంటుంది.

సత్సంగంలో మహారాజ్ కొందరిని వివాహం చేసుకోమని ఆజ్ఞాపించటం, మరికొందరిని బ్రహ్మచర్యం పాటించమని చెప్పటం, ఇంకొందరిని స్మరణ, ధ్యానం చేయమని ఆదేశించటం మొదలైనవి చెబుతుంటారు. కనుక నేను ఆయనను సంత్ సతగురు వక్త్ అని అంటాను.

## జగత్ గురువు

మహారాజ్‌గారిని గూర్చి ఉర్దూ పుస్తకంలో జగత్ గురువు అని రాయటం జరిగింది. మహారాజ్ అంటారు- "ఈ పుస్తకంలో నా పేరుకు ముందు జగత్ గురువని రాశారు. ఇది నిజమేనా అని ఆలోచిస్తుంటాను. ఏ స్థానంపై మనం ఉంటామో అక్కడ గురువు లేదు శిష్యుడు లేదు. ఇది శబ్దం. ప్రపంచంలో స్థిరత్వమేదీ లేదు.

***మగర్ జిన్ కీ నజర్ నహీఁ ఇత్ నీ ఊంచీ, ఉన్ కో కహతా హూఁ బర్‌మలా।***

***ఇస్ ప్రకృతి కే ఖేల్ మే హీ హై, గురు చేలా కా వ్యవహార్ బనా ॥***

***ఇస్ కే బిన్ న గుజారా హై, గురు కే బిన్ న ఛుట్కారా హై ।***
***బిన్ గురు కే ఇస్ జహాఁ మే, నహీఁ కోయీ సహారా హై ॥***

అందుకే ప్రపంచానికి పొరపాటు భ్రమలు, సరైన రీతిలో అర్థం చేసుకోలేని పరిస్థితి ఉండకూడదని నాకు లభించిన దానిని స్పష్టమైన పదాలలో చెప్పదలచు కుంటున్నాను." దాతాదయాల్ పరమ తత్వం నా విశ్వాసాన్ని అనుసరించి పరమ పురుష మహర్షి శివవ్రత్‌లాల్ జీ ద్వారా ఈ పదవిని ఫకీర్ చంద్‌కు ఇచ్చారు. ఈ రహస్యం లేదా ఉద్దేశం ఆ భగవంతునికే తెలుసు. కానీ నేను ఈ జీవన పరుగులలో అర్థం చేసుకున్నదేమిటంటే జగత్తు అంటే సృష్టి రచనకు మరోపేరు. అది కారణమైనా, సూక్ష్మమైనా, స్థూలమైనా! గురు నామం జ్ఞానముదే! గురు నామమంటే జ్ఞానం. కనుక దేని ఆధారంపై ఈ సమస్త సృష్టిరచన జరుగుతున్నదో ఆ జ్ఞానం, ఆ విధి పేరు జగత్ గురువు. ఇతర పదాల్లో చెప్పాలంటే అది సంపూర్ణ అనుభవం. సంపూర్ణ జ్ఞానం ప్రతి కణంలో కొలువై ఉంది. సంపూర్ణ సృష్టిని నడిపిస్తున్న ఒక విశ్వవ్యాప్తమైన నియమం ఉంది. ఈ సంపూర్ణ నియమం లేదా రహస్యం లేదా జ్ఞానం గురించిన ఎరుక కేవలం మహాపురుషులకే ఉంటుంది. ఎందుకంటే వారు తమను తాము ఈ స్థూల, సూక్ష్మ, కారణ ప్రకృతి కంటే పైకి, ఉన్నత స్థానానికి తీసుకువెళ్ళి దానిపై అధికారం అర్హత కలిగి వుంటారు. ఈ నిజ అనుభవ ఆధారంపైన పరిస్థితులననుసరించి హితం కోరి, సలహాలనిచ్చి మానవ జీవనం యొక్క మానసిక, ఆత్మిక భావనలను మార్చగలుగుతారు. ఉదాహరణకు ప్రస్తుత వైజ్ఞానికులు స్థూల ప్రకృతిని గురించిన జ్ఞానం కలిగి ఉండి విచిత్ర అన్వేషణ చేసి ప్రపంచంలో పరివర్తనం తీసుకొస్తున్నారు.

ఇదేవిధంగా సంతులు, పూర్ణ పురుషులు మానసిక, ఆత్మిక ప్రకృతి యొక్క రహస్యం తెలుసుకుంటూ తమ అనుసంధాన యుక్తితో ప్రపంచంలో మానసిక, ఆత్మిక జీవనంలో మార్పు తీసుకురాగలుగుతారు. కలియుగంలో పూర్ణ పురుషులు, సంతులు, సత్యవంతులైన సత్పురుషుల ప్రాకట్యం జరిగింది. వారు జీవనంలో

పరివర్తనం తీసుకురావడానికి స్మరణ, ధ్యానం, భజనలను చేసే పద్ధతి చెప్పి సత్సంగం ప్రారంభించారు. దీనివలన మానవజాతి ధార్మిక కలహాలకు దూరమై తమ స్మరణ, ధ్యానం, భజనలతో తమ మానసిక, ఆత్మిక జీవితాన్ని సుఖమయం చేసుకోగలగాలి. చివరికి స్వరూపంలో లయం కాగలగాలి. సంతుల మార్గంలో కూడా గద్దెలు, మండలాలు ఏర్పడ్డాయి కనుక పనిచేసే మహా పురుషులు వీటిని స్థిరంగా ఉంచడానికి సర్వసాధారణ జనంపై ఆధారపడతారు. వాస్తవం లోపించి కనుమరుగు అవుతోంది. తప్పుడు రీతిలో దాని ప్రచారమై ఇది కూడా సంప్రదాయం కాకూడదని నేను సంత్ మతాన్ని స్పష్టంగా వర్ణించాను.

నా అనుభవం, జ్ఞానం సరైనదైతే దేశంలోని తెలివైన వారు, సత్యాన్ని ఇష్టపడేవారు సత్య సంధతవైపు వచ్చి కొద్ది సంవత్సరాలలోనే మన మానసిక, ఆత్మిక, గృహ, రాష్ట్ర, దేశ సంబంధమైన జీవితాలను ఉత్కృష్టంగా, సుఖవంతంగా ఉండే దశను ఉత్పన్నం చేస్తారని ఆశిస్తున్నాను. ధార్మిక పంథల భ్రమలు తొలగిపోయి జీవనం గడిపే మానవ జాతికి సులభమైన మార్గం అర్థమవుతుంది. బోధపడుతుంది.

ఇలాంటి పరివర్తనను తీసుకురావడానికి సంతులు ఈ కలియుగంలో ప్రగటమవుతుంటారు. అందుకోసం వారు సురత్ శబ్ద యోగం బోధిస్తారు. సురత్ తవజ్జ. శబ్దం సారతత్వం. బాహ్య సత్సంగంలో ఎవరైనా పూర్ణ పురుషుని వచనాలే శబ్దం. వారి అసలైన భావాన్ని అర్థం చేసుకోవటమే సురత్ శబ్ద యోగం. ఎందుకంటే మనసు మహా చంచలమైనది. సారాన్ని అర్థం చేసుకోజాలదు. కనుక దీనిని స్థిరం చేయడానికి సాధన పరమావశ్యకం. దాని తరువాత మనిషి ఎవరైనా పూర్ణ పురుషుని మాటను అర్థం చేసుకోగలుగుతాడు. ప్రత్యేకమైన స్థితులలో అర్హత ఉంటే కేవలం సత్సంగం చాలు. గత కాలంలో విదేశీయుల పాలన ఉంది. ఆ రోజుల్లో వర్ణించిన శైలి మరో రకంగా ఉండటం అనివార్యం. ఇప్పుడు మన రాజ్యం. మనపాలన. ఈ రాజ్యం ధార్మిక, పాంథిక (పంథకు సంబంధించిన) ఆధారంపై లేదు కనుక సత్యాన్ని వాస్తవాన్ని ధార్మిక, సాంప్రదాయక,

**పాంథిక పక్షపాతం** లేకుండా చెప్పటం తప్పనిసరి. అజ్ఞానం వలన దేశం, **మండలం**, దేరా, ఆశ్రమం, ధర్మాలలో విభజింపబడింది. అది దుఃఖానికి **కారణమవుతున్నది**. కనుక మహాత్ములు, గురువులు, లీడర్లు, దేశంలోని తెలివైన వర్గం కోసం నా ప్రయత్నం ఎక్కువగా ఉంది. దాతా దయాల్ ఇచ్చిన సంస్కారాలున్నాయి. దైవేచ్ఛ నన్ను ఇటువైపు లాక్కుని వచ్చింది. ఏ నిజ, పాంథిక ప్రయోజనం లేదు. నా ప్రయోజనం, ఉద్దేశం కేవలం మానవ జీవనమును సుఖంగా ఉంచాలి. అంతే. ఈ విచారం, భావంతో ఎవరైనా నా విచారధారను జగత్ గురువని అనుకుంటే అది సత్యమవుతుంది. కానీ ఫకీర్ చంద్ ఒక నశించే శరీరం.

## ధార్మిక స్థితి

"యథారాజా తథా ప్రజా" అనే సామెత సుప్రసిద్ధం. చరిత్ర ఈ సత్యాన్ని రుజువు చేస్తుంది. రాజు ఏ భావనలతో, ఆలోచనా విచారంతో ఉంటాడో ప్రజలు దానినే స్వీకరిస్తారు. తమదిగా చేసుకుంటారు. ఇవాళ రేపు భారతదేశంలో డెమోక్రటిక్ ప్రజాతంత్ర రాజ్యం ఉంది. ధార్మిక బంధనా రహితమై ఉంది.

సర్వసాధారణంగా ధర్మ పరిత్యాగం చేస్తున్నారు. పాత ధార్మిక భావనలు, విచారాలు, మోసంగా, బూటకంగా భావించబడుతున్నాయి. ప్రపంచం బాహ్య సైన్సు వెనుక పరుగెత్తుతోంది. మన పాలకుల కళ్ళల్లో కూడా సైన్స్ కనులు మిరుమిట్లు గొలుపుతోంది. భారతదేశంలో పూర్ణత్వమును చూసిన జ్యోతిష్య విద్య కూడా ఒక రకమైన సైన్సే. ఏ వైజ్ఞానికుడు – శాస్త్రవేత్త సూర్య గ్రహణం, చంద్ర గ్రహణముల గురించి భవిష్యవాణి చెప్పలేకపోయారు. హిందూ ఆచార్యులు వేలాది సంవత్సరాల తరువాత జరగబోయే సూర్య, చంద్ర గ్రహణాల సమయం, రోజులు ముందుగానే ప్రకటించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఈ విద్య కూడా అనర్హుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. వాళ్ళు దీనిని ఉపాధికి వినియోగపడే విద్యగా మార్చుకున్నారు. ధార్మిక సమూహంలో కొద్దిమందే పాల్గొంటారు. సినిమాలకు కిక్కిరిసిన జనం వెళ్తుంటారు. వ్యభిచారం ప్రచారమవుతుంది. మానవత్వం,

సత్య నిష్ఠ ఏదో ఒక మూలకు ముడుచుకుని ఫడి ఉంది.

ధార్మిక బోధ యొక్క ఉద్దేశం మనిషికి శాంతి, ఆనందముల ఉపదేశం ఇవ్వటం. ధర్మం ద్వారా మనిషి నిర్వాణ పదమును ప్రాప్తించుకుంటాడు. ముక్తిని ప్రాప్తించుకుంటాడు. శుభకర్మ చేయడానికి బాధ్యుడవుతాడు. స్వర్గం, ముక్తి, నిర్వాణం అంటే ఇచ్ఛలు, కోరికలు, స్వార్థరహితంగా ఉండటం, ఆనందం, శాంతి వీటన్నిటికి మరోపేరు. కానీ ప్రస్తుతం ధర్మమును తప్పుగా అర్థం చేసుకున్న ఫలితంగా ప్రపంచాన్ని శోకాగారంగా మార్చిపెట్టారు. అడుగడుగునా పోట్లాటలు, కలహాలు జరుగుతుంటాయి. ధర్మం పేరిట బలిదానాలు జరుగుతుంటాయి. ఇతరులపై అత్యాచారాలు చేయబడతాయి. కొందరు క్రిస్టియన్ ధర్మమును పాటించేవారు రెండుసార్లు యుద్ధంతో ప్రపంచానికి నష్టం కలిగించారు. ఇస్లాం ధర్మానుయాయులు ధార్మిక ఉన్మత్తతకు ఆధీనులై రక్తం నదులు పారించారు. విశ్వవ్యాప్త వినాశనానికి సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నారు.

ధర్మం – ఇదే బోధిస్తున్నదా? ధర్మం ఉద్దేశం ప్రపంచాన్ని నాశనం చేయటమేనా? ప్రతి ధర్మం భగవంతుణ్ణి పూజించమనే బోధిస్తుంది. సమస్త మానవజాతిని తన సోదరులని అనుకోమంటుంది. చెడు కర్మలు చేయకు. ఈశ్వరునికి చేసే సత్యమైన పూజ ఆయన భక్తులకు, ప్రజలకు సేవ చేయటమే!

"నేను నీ ఇంటికి దర్శనమివ్వడానికి వచ్చాను. భిక్షగాడినై నీ ద్వారం దగ్గర భిక్ష అడిగాను. నాకు సహాయం చేయమన్నాను. కానీ నీవు నా పిలుపైనా వినలేదు. నన్ను వెదకడానికి పర్వతాలలో, వనాలలో తిరుగుతున్నావు" అంటాడు తన భక్తులతో ఈశ్వరుడు.

*ఆహ బన్‌కర్ కిసీకీ, దస్తక్ దీ తేరే దర్ పర్ ।*
*జబ్ తూ ఢూంఢ్ తా థా, ముఝే కుంజ్ అవుర్ బన్ మే ॥*

మనిషి సాటిమనిషితో ప్రేమగా వ్యవహరించటం, సేవ చేయటమే సత్యమైన ఈశ్వరుని పూజ. మనిషికి ఎప్పుడు భగవంతుని దర్శనం లభించినా మానవ రూపంలోనే లభించింది. ప్రతి మతం – ధర్మ సంస్థాపకులు, పీర్, అవతారాలు,

నవీ, వలీ, ఆచార్యులు అందరూ మనుషులే! తమ తమ అనుభవ ఆధారంగా ప్రతి మనిషికీ సత్యం, శాంతి మార్గం చూపించారు. మానవుని మహిమ గానం చేశారు. ముసల్మానులు కూడా మనిషిని అశరఫుల్ ముఖలూకాత్ అంటారు. హిందువులలో "నర శరీర్ సుర్ కో భీ దుర్లభ్" అంటారు.

హజరత్ ఈసా - ఏసుప్రభువు తనను తాను దేవుని కుమారుడినని ప్రకటించుకున్నాడు. ఇక క్రియాత్మక జగత్తులో దృష్టి ప్రసరిస్తే మనిషి చాలా ఘోరంగా పతనమయ్యాడు. మానవత్వాన్ని కోల్పోయాడు.

## మనుష్యబనో - మనిషివి కా!

15 ఆగస్టు 1947 విభజన కాలం నాటి మాట! మనిషి మనుషత్వంను కోల్పోయి పిచ్చి వాడయ్యాడు. లక్షలాది మంది ఇళ్ళు కోల్పోయారు. పెద్ద పెద్ద శ్రీమంతులు తిండిగింజలకు ముఖం వాచిపోయారు. ' హర హర మహాదేవ' లేదా 'అలీ లేక వాహగురు' నినాదాలు చేస్తూ మతం -ధర్మం పేరుతో అమ్మాయిల శీలం పాడుచేయబడింది. ఇళ్ళకు నిప్పు పెట్టారు. హత్యలతో బజారంతా వేడెక్కింది. ఈ రక్తపుటేర్లు ప్రవహిస్తున్న కాలంలో మానవ జాతి పైన సత్యమైన సానుభూతి పరమ దయాల్ ఫకీర్ చంద్ జీ మహారాజ్ చిత్తం పైన ఈ సంఘటనల ప్రభావం చాలా తీవ్రంగా పడి, ఆయన చాలా దుఃఖితులయ్యారు. హాహాకారాలు మిన్నుముట్టాయి. అనాథల ఆక్రందనలు దైవ సృష్టిలో క్షోభను పుట్టించాయి. పరమాత్మ-దైవేచ్ఛ ఆయన మనసుకు చలనం కలిగించింది. సమాధిలోకి వెళ్ళారు. సమాధి నుంచి ఉత్థానులయ్యాక మనుష్యబనో - మనిషివి కావాలనే నినాదమిచ్చారు. మనుష్యబనో అనే పుస్తకం రాశారు. ఇది హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్‌లలో ప్రచురించబడింది. మనిషి వాస్తవిక రూపంలో ఏమిటనేది అందులో మహారాజ్ వివరించారు. "మనుష్యబనో" జండాను తమ ఇంటిపై ఆవిష్కరించారు. లోకులు ధర్మమును విడిచిపెడుతున్నారు. ఈశ్వరుని విశ్వసించటం లేదు. ఇప్పుడు మనిషికి వర్తమాన పరిస్థితులను అనుసరించి, సైంటిఫిక్ రీతిలో సత్యం యొక్క బోధ చేయకుంటే మానవత బతకటం అసంభవం అంటారు మహారాజ్.

మహారాజ్ తమ నిజ అనుభవ ఆధారంపై అందరూ ఒకే తత్వం నుండి ఉత్పన్నమయ్యారని లోకులకు ఉపదేశించారు. వాస్తవానికి ఎవరూ హిందువులు కారు. ముసల్మానులు కారు. అన్ని మతాలు - ధర్మాలు, పంథాలు, సంప్రదాయ పరులైన మానవులు తమ ఆలోచన వల్లనే రూపొందారు. ధర్మపంథ ఆయా కాలాలలోని ఆవశ్యకతను బట్టి రూపొందాలి. నేటి కాలంలో లోకులలో మానవత్వం రావాలనే బోధన అవసరం.

## మహారాజ్ మిశన్, మనుష్యబనో - మానవత్వం

మానవతా నియమాలను అనుసరించి, ఆచరించే మనిషి ప్రపంచంలో సుఖశాంతులతో ఉండగలుగుతాడని మహారాజ్ చెబుతారు. అప్పటినుండి ఇప్పటివరకు ఈ విషయంపైనే సత్సంగం చేస్తుంటారు. మానవతా నియమాలను పాటించకుండా మనిషి ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్ళజాలడు, ఆధ్యాత్మికతను పొందజాలడని అంటారు మహారాజ్. ఆధ్యాత్మికతను అనుభవంలోకి తెచ్చుకోవడానికి, పరమ పదమును ప్రాప్తించుకోవడానికి, ముక్తిని పొందడానికి, జనన మరణ చక్రం నుండి తప్పించుకుని, రక్షింపబడాలంటే ముందుగా మానవతా నియమాలను పాటించాలి. అప్పుడే అతడు సాధన అభ్యాసం చేసి పై స్థితులను, స్థానాలను ప్రాప్తించుకోగలుగుతాడు. లేకుంటే లేదు. మరో పద్ధతిలో అది అసాధ్యమవుతుంది.

## ప్రపంచంలో సుఖ శాంతులతో కూడిన జీవనం

దైనందిన జీవితం గడపడానికి, మానవతను పొందడానికి మనిషి ఈ క్రింద రాసిన అంశాలను పాటించడం తప్పనిసరి. ఈ మాటలు మహారాజ్ తమ సత్సంగాలలో వర్ణిస్తుంటారు.

1. శారీరిక మరియు మానసిక బ్రహ్మచర్య పాలన - అనగా మనసు, వాక్కు కర్మ, దృష్టి - వీటితో బ్రహ్మచర్య రక్షణ
2. 'శివ సంకల్పమస్తు' అనగా మన ఆలోచనా విచారాలు శుభకరమైనవిగా,

కళ్యాణప్రదమైనవిగా ఉంచుకోవాలి. సదా ఆశావాది అయి ఉండాలి.

3. వృధాగా ఎప్పుడూ ఉండకూడదు. ఎల్లప్పుడూ మనసును పనిలో నిమగ్నం చేయాలి. ఇది ఈశ్వరభక్తి.

4. నీ జీవికను నీవు సంపాదించుకోవాలి.

5. మనసును వశంలో ఉంచాలి

6. ప్రతి పనినీ భగవంతుడు లేదా గురువు గారి పనేనని భావించి చేయాలి. లేదా భగవంతునికి సమర్పణ చేస్తుండాలి.

7. అందరితో ప్రేమగా వ్యవహరించాలి.

8. శరణాగతి

## మానవతా మందిరం

ఈ బోధనను ప్రచారం చేయడానికి ఒక కేంద్రం లేదా స్థానం ఉండటం అవసరమనీ, దానివలన ఈ బోధ సత్సంగ ప్రచారం బాగా జరుగుతుందని మహారాజ్‌కు ఒక ఆలోచన వచ్చింది. ఆయన "మానవతా మందిరం"ను సుతహరీ రోడ్డు, హోషియార్‌పుర్‌లో ప్రారంభించదలచి ఏప్రిల్ 1964లో శంఖు స్థాపన చేశారు.

అప్పటినుండి ఇప్పటివరకు అక్కడ క్రమం తప్పకుండా సత్సంగం జరుగుతూ ఉంటుంది. బయటి నుంచి సత్సంగీయులు వచ్చి అక్కడ బస చేస్తుంటారు. సాధన అభ్యాసం చేస్తుంటారు. దీనులకు, దుఃఖితులకు, భర్తృహీనలకు, నిర్ధనులకు సహాయం లభిస్తుంటుంది. రోగుల కోసం ఒక ఆసుపత్రి కూడా నిర్మించారు. అక్కడ ఉచితంగా వైద్యం, ఔషధం సరఫరా చేస్తారు.

అలీగఢ్ నుండి వెలువడే 'మనుష్యబనో', 'శివ్' మాసపత్రికలలో, హన్మకొండ నుండి వెలువడే 'దయాల్' మాసపత్రికలో మహారాజ్ సత్సంగాలు ప్రచురించ

బడుతుంటాయి. మానవతా మందిరం నుండి 'మానవ మందిర్' మాసపత్రిక ప్రచురించబడుతుంది. దీనిని ఉచితంగా పంచిపెడుతుంటారు. ఇంకా చాలా సమాచార పత్రికలు పంజాబ్ నుండి వెలువడుతుంటాయి. వాటన్నిటిలో మహారాజ్ వచనాలను తప్పనిసరిగా పొందుపరుస్తుంటారు. ఆయనవి దాదాపు 100 పుస్తకాల కంటే ఎక్కువగానే ప్రచురించబడ్డాయి. అవన్నీ అలీగఢ్‌లోని 'మనుష్యబనో' కార్యాలయంలో, హోషియార్‌పుర్‌లోని మానవతా మందిరంలో లభిస్తాయి.

రాధాస్వామి మతం – సంత్ మతానికి చెందిన సమస్త ఆచార్యులు ఒకే వేదికపై ఏకం కావాలని మహారాజ్ గారి హృదయ పూర్వకమైన కోరిక. తమ తమ భేదభావాలన్నిటినీ దూరం చేసి సత్సంగీయులకు సత్యమైన పథ ప్రదర్శన చేస్తూ ఉండాలి. విభిన్న గద్దెలు లేదా డేరాలలో – ఆశ్రమాలలో సత్సంగీయులలో కన్పించే ద్వేష భావాలు తొలగిపోవాలి. పరస్పరం ప్రేమభావం పెరగాలి. వీరికి గురుమతం అర్థం కావాలి. మనిషి జీవితంపై చాలా గొప్ప ప్రభావం చూపే అంశాన్ని వారు శ్రేష్టతరం చేయగలుగుతారు.

***సత్సంగ్ కరత్ బహుత్ దిన్ బీతే, అబ్ తో ఛోడ్ పరాయీ బాన్ ।***
***కబ్ లగ్ కరో కుటిలతా గురు సే, అబ్ తో గురు కో లే పహచాన్ ॥***

## సంశోధన, పరిష్కరణ, సంస్కారం

మన రాజ్యం ప్రారంభమైన తరువాత ప్రస్తుత పాలనతో పార్టీల పరమైన సంకుచితత్వం తప్ప మరే చట్టమూ లేదు. ఈ సమయంలో ఏ విభాగంలోనూ, ఏ తరహాలోనూ మనిషి తన జీవితాన్ని శాంతిమయంగా చేసుకోవటం సాధ్యం కాదు. జీవితంలోని అనుభవాలు, కష్టాలు నన్ను ఈ నిర్ణయానికి చేర్చాయి అంటారు మహారాజ్. నేను ప్రస్తుత రాజ్యాంగానికి వ్యతిరేకంగా అంటున్నానని మీరో, ఇతరులో అనవచ్చు కానీ ప్రతి మనిషీ దీనిని అనుభవిస్తున్నాడనటం సత్యం. ఈ విషయం ప్రతి మనిషికీ తెలుసు. దీనికి కారణం ఉంది. సభ్యత, శిష్టాచారం, ధార్మిక భయం, ఈశ్వరుని భయం, రాజ్యాంగ పాలన యొక్క భయం పెరిగింది. రాజ్యాంగం భయం కూడా ఉన్నచోట అధికారులలో మానవత్వం

**ఉండదు.** కాంగ్రెస్ వారు కాంగ్రెస్ వైపు మాట్లాడతారు. సిక్కులు సిక్కులవైపే **మాట్లాడతారు.** కనుక మన వేదశాస్త్రాలు వేటి ఆధారంపై జీవితం గడిపే రహస్యం **చెప్పాయో** ఆ ప్రాకృతిక సిద్ధాంతం లేదా నియమాలను సైంటిఫిక్ రీతిలో వ్యాఖ్యానించాలని దైవేచ్ఛ నా మనసులో ప్రేరణ కలిగించింది.

నేనేదో కొత్త విషయం రూపొందించలేదు. కేవలం క్రియాత్మక జీవనం గడిపే పద్ధతిని వివరించాను. 'జైసా ఖ్యాల్ వైసా హాల్'. మనిషి తన ఆలోచనా విచారాలను శ్రేష్ఠతరం చేసుకుంటే, ప్రాకృతిక నియమానుసారం జీవితం గడిపితే తను సంతోషంగా ఉండటమే గాక ఇతరులకు కూడా సంతోషాన్ని అందివ్వగలడు.

ఆలోచన- విచారం-భావం ఒక ప్రబలమైన శక్తి. దీనిని గురించి నేను ట్రూత్ అనే శీర్షిక నుంచిన ఆంగ్ల పుస్తకంలో (హిందీలో సచాయీ అనే పుస్తకం), విశ్వశాంతి అనే మరో పుస్తకంలో వర్ణించాను. అనేక పుస్తకాలలో వర్ణించాను. విచార శక్తి ప్రభావాన్ని అర్థం చేసుకొని ఏవగింపు అసహ్యం, ద్వేషం, ఈర్ష్యలకు బదులుగా ప్రేమ-ప్రీతితో జీవితం గడిపాలని ప్రచారం చేస్తే మనిషి ఆలోచనా విచారాల పరివర్తనతో పాటువారి కర్మలకు అనుకూలంగా వారి జీవనం మెరుగయ్యే అవకాశముంది. ఎందుకంటే ఎవరికి ఏది లభించినా అది వారి కర్మ ఫలితమే అనవచ్చు.

విచారశక్తి యొక్క పరిణామం విషయంలో ఒక సంఘటన వినండి. ఒక రిటైర్డ్ మెజిస్ట్రేట్ జీవితమంతా ఈశ్వర భక్తుడిగా ఉన్నాడు. నిజాయితీగా బతుకు గడిపాడు. భార్యా భర్తలిద్దరూ భక్తులే. గురువు లేని వారు కావటం వలన (కుల గురువు ఉన్నా) "ఓ భగవంతుడా మాకు నీ భక్తి నివ్వు. మేం దుఃఖాలను పట్టించుకోం. ఎన్నయినా రానీ" అని కోరుకునేవారు. వారి సంకల్పం ఫలితంగా రాను రాను వారి జీవితంలో పేదరికం ప్రవేశించింది. వారి ఏకైక పుత్రుడు క్షయ వచ్చి మరణించాడు. వారు ఆత్మహత్య చేసుకున్నారని వారి బంధువుల నుండి ఉత్తరం వచ్చింది. ఇలా ఎందుకు జరిగింది? ఎలాంటి ఆలోచన ఉంటే అలాంటి స్థితి ఎదురవుతుంది. "జైసా ఖ్యాల్ వైసా హాల్" విషయం చాలా

సూక్ష్మమైనది. అర్థం చేసుకోవటం కష్టం. అర్థం చేయించటం కష్టం. అందుకే సంత్‌లు గురుమతానికి ప్రాధాన్యత నిచ్చారు.

ఎవరైనా పూర్ణ పురుషుడు, సత్పురుషుడు లేదా సద్గురువు యొక్క సత్సంగం, సేవయే ప్రతి మనిషికీ జీవన కర్తవ్యం కావాలి. కనుక గురుపరాయణులం కావాలి. గురుసేవ అంటే ఎవరైనా పూర్ణ పురుషుని వచనాలను వినటం, మననం చేయటం, ఆచరించటం అని నా అభిప్రాయం.

కబీర్ సాహబ్, నానక్ సాహబ్, రాధాస్వామి దయాల్ లేదా ఇతర సమస్త సంత్ మహాత్ముల బోధల సారం కేవలం నామమే. నామం గురువాధీనంలో ఉంటుంది. గురువు లేదా సద్గురువు ఆయా సమయాల ఆవశ్యకతను అనుసరించి ప్రకటమవుతుంటారు. అవతరిస్తుంటారు. మనుష్యత్వం తప్ప ప్రస్తుత కాలంలో మన కష్టాలను తప్పించే పద్ధతి మరొకటి లేదు. నేను సంత్ సద్గురు వక్త సమయపు సద్గురువు స్థానంలో నిర్భయుడినై హృదయంలో దయ, సానుభూతితో సత్యాన్ని వెల్లడిస్తున్నాను. దేశంలో భిన్నభిన్న రకాల సంత్ మహాత్ములు ఏకం కావాలి. వాటిని అనుసరించి ఆచరించకుంటే దేశమనే నౌక తుఫాను నుండి బయట పడజాలదు.

మానవత్వమే మతం. మానవత్వమే పంథ. మంచి, చెడు, ఆశ, నిరాశ, ఇతర వ్యతిరేక ఆలోచనా విచారాలు అన్నిటికన్నీ మనోమయ జగతి యొక్క లీల – ఆట అనేవారు దాతా దయాల్ జీ మహారాజ్. ఆయన నన్ను కాలం, మాయల నుండి బయటపడే మార్గదర్శనం చేశాడు. అప్పట్లో నేను కాలం ఏమిటి? దానినుండి బయట పడటమంటే అర్థమేమిటి అనే మాటలను అర్థం చేసుకోలేదు. నేను మనసులోని తరంగాలలోకి వచ్చాను. నాకు ఆయన శరీరంతో ప్రేమ ఉండేది. శుభ భావన, సత్యం, పరోపకారాలకు ప్రాముఖ్యత నిచ్చేవాణ్ణి. ఇప్పుడు ఈ మాటలకు అప్పటివలే అంతగా ప్రాధాన్యత లేదు. ప్రాపంచిక దృష్టి కోణం నుండి భక్తి, ప్రేమ, సత్యం, నిజాయితీ, పరోపకార భావనలు ధన్యం. కానీ ఇది మానసిక జగత్తు యొక్క ఆట. ఒక దానిని మనం మంచిదని అనుకుంటాం.

మరోదానిని చెడు అని భావిస్తాం. ఇదంతా మనసు యొక్క ఆట, మాయ యొక్క రచన అని ఇప్పుడు అనుకుంటూ ఉంటాను. నేను వీటన్నిటికంటే వేరుగా ఉన్నాను. దీని ఫలితంగా ఇప్పుడు నా మనసులో శాంతి ఉంటుంది. ఎందుకంటే నేను మనసు, మాయల రూపమును అర్థం చేసుకున్నాను. అదే చెబుతుంటాను" అన్నారు మహారాజ్.

ఇక్కడి వరకు మహారాజ్ గారి జీవితంలోని సంఘటనలు, ఆయన బోధనలను సంక్షిప్తంగా వర్ణించటం జరిగింది. ఎందుకంటే ఇంకా చాలా రాయవలసి ఉంది. ఇంకా ఇతరమైన విషయాలు, మహారాజ్ అనుభవాలు మరెప్పుడైనా నా జీవితం తదనంతరం ప్రచురించవచ్చు అన్నారు మహారాజ్.

***

*చరణ శరణ కీ వందనా నిత్ కోయి అవుర్ న కామ్ ।*
*గురు బసో చిత్ ఆయే మేరే బఖ్శ దో నిజనామ్ ॥*

*తేరీ శరణాగత హువా ఫిర్, కిస్ కీ రాఖూఁ ఆస్ ।*
*ఆస్ తో తేరీ దయా కీ, జగ్ సే రహూఁ ఉదాస్ ॥*

*రూప ధ్యావూఁ నామ గాఁవూఁ, శబ్ద రాతా మన్ ।*
*ఆఠోఁ యామ్ తేరా హీ సుమిరణ, భాగ్య మేరా ధన్ ॥*

*శీష్ పర్ నిజ కర్ కమల్ ధర్, లియా చరణ్ లగాయ్ ।*
*పతిత పాపీ తర్ గయా, గురు శరణ తేరీ ఆయ్ ॥*

*ముక్తి కీ నహిఁ చాహ మన్ మే, భక్తి ప్యారీ లాగ్ ।*
*రాధాస్వామీ కీ దయా సే, భాగ్య పూరణ జాగ్ ॥*


దయాల్ స్వరూప్ సందూభాయిజీ మహారాజ్ తో పరమ దయాల్ ఫకీర్‌చంద్ జీ మహారాజ్





పరమ దయాల్ ఫకీర్‌చంద్ జీ మహారాజ్‌గారి సుపుత్రులు శ్రీ శాహ పదమ్ జంగ్ గారు

పరమ దయాల్ ఫకీర్‌చంద్ జీ మహారాజ్ ఇంటి నుండి మానవతా మందిరానికి ఈ రిక్షాలోనే వచ్చేవారు





పరమసంత్ పరమదయాల్ సత్‌గురు

పండిత్ ఫకీర్‌చంద్ జీ మహారాజ్